www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్

ఆంధ్రజ్యోతి

నూతన సంవత్సర శుభాకాంక్షలు
పేజీలు: 14
సంపుటి (Volume) : 21
సంచిక (Issue) : 274

సోమవారం | 1-1-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: పంచమి మ. 2.29 తదుపరి షష్ఠి; నక్షత్రం: మఖ ఉ. 8.37 తదుపరి పుబ్బ; వర్జ్యం: సా.5.39-7.27; దుర్ముహూర్తం: మ.12.41-1.25, మ.2.53-3.37; అమృతఘడియలు: శే.ఉ.7.43, తె.4.29-6.17; రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.50, సూర్యాస్తమయం: 5.48

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కొత్త ఏడాదికి కొంగొత్త ఆశలతో..

చూస్తూచూస్తుండగానే ఏడాది గడిచిపోయింది! 2023 కాలగర్భంలో కలిసిపోయి 2024 వచ్చేసింది. గడిచిన ఏడాది కాలంలో ఎన్నో తీపి జ్ఞాపకాలు.. చేదు సంఘటనలు.. మరెన్నో సంచలనాలు! 'కొత్తకు ఎపుడూ స్వాగతం.. పాతకో వందనం' అన్నట్టు.. ఆ పాత జ్ఞాపకాలకు బైబై చెప్పి, 2024కు స్వాగతం పలుకుదాం.

రైతు-మహిళ-యువత నామ సంవత్సరం

కొత్త ఏడాది సంకల్పం ఇదే.. ప్రజల ఆశలు ఫలిస్తాయి
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
13
రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
పాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తాం
ఆర్థిక పరిస్థితిని పరిపుష్టం చేసే చర్యలు చేపడతాం
ఇరిగేషన్‌లో అవినీతిపైనా శ్వేతపత్రం విడుదల చేస్తాం
ఉద్యమకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: సీఎం



ఐఏఎస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్త సంవత్సర వేడుకల్లో సీఎం రేవంత్ దంపతులు

కొత్త సంవత్సరంలో..
కొత్త పింఛన్!

జనవరి నుంచే అమలుకు సర్కారు కసరత్తు
ఎన్నికల హామీ అమలు దిశగా అడుగులు
సంక్రాంతి కానుకా!? లేక ఫిబ్రవరి నుంచా!?
బడ్జెట్ అంచనాలను రూపొందిస్తున్న విభాగాలు
ఇప్పుడు పెంపు పాత పింఛనుదారులకు మాత్రమే
దరఖాస్తులు పరిష్కరించాక కొత్త వారికీ అమలు
పింఛనుదారులకు రూ. 2016 నుంచి రూ. 4000
దివ్యాంగులకు మాత్రం రూ. 6000కు పెంపు
సర్కారుపై పడే అదనపు భారం రూ. 873 కోట్లు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పింఛన్‌దారులకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా తీపికబురు అందించనుందా!? ఆరు గ్యారెంటీల్లో భాగంగా 'చేయూత' పథకం కింద రూ.4 వేల పింఛన్ ఇస్తామన్న ప్రభుత్వం.. దానిని జనవరి నుంచే లబ్ధిదారులకు అందజేయాలని యోచిస్తోందా!? ఇందుకు 'ఔను' అనే అంటున్నాయి అధికార వర్గాలు. వృద్ధులు, వితంతువులు తదితర వర్గాల వారికి ఇప్పటిదాకా 'ఆసరా' పథకం కింద రూ.2016 పింఛన్ అందుతున్న విషయం తెలిసిందే. తాము అధికారంలోకి వస్తే దానిని రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ హామీని అమలు చేసే దిశగా చర్యలు ప్రారంభించింది. జనవరి నుంచే పెంచిన పింఛన్లను అమలు చేయాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఆయా విభాగాల ద్వారా బడ్జెట్ అంచనాలను రూపొందిస్తున్నట్లు

మిగతా 13వ పేజీలో...

13

ఉన్నత విద్యా మండలి కొనసాగింపు!

ప్రస్తుత ఛైర్మన్, వైస్ ఛైర్మన్లతోనే నడిపించనున్న సర్కారు?
ఎంసెట్, వివిధ కోర్సుల అడ్మిషన్ల నేపథ్యంలోనే నిర్ణయం!

కూలీ నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దాకా..

హైదరాబాద్‌లో డ్రగ్స్ స్మగ్లర్లు, వాడకందారుల అరెస్టు
మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన ఏపీ యువకుడు
అందుకోసం లోన్ యాప్‌ల నుంచి భారీగా రుణాలు
వాటిని తీర్చలేక.. స్నేహితుడితో కలిసి డ్రగ్స్ స్మగ్లింగ్
కొత్త సంవత్సర వేడుకల కోసం ఢిల్లీ నుంచి 'సరుకు'
పట్టుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్.. 7.5లక్షలు స్వాధీనం
డ్రగ్స్‌తో పోలీసులకు చిక్కిన మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
హెరాయిన్ సరఫరాలో యూపీ, రాజస్థాన్ కూలీలు
సూర్యాపేటకు చెందిన ఇద్దరు గంజాయి స్మగ్లర్ల అరెస్టు



ఒక్కరోజే రూ. 40 కోట్లు

31న హైదరాబాద్‌లో మద్యం అమ్మకాల జోరు.. నిరుటి కంటే అధికం
రాష్ట్రవ్యాప్తంగా విక్రయాలు రూ.260 కోట్లని అంచనా!
13



రాజస్థాన్ ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న హెరాయిన్, నగదు, సెల్‌ఫోన్లు
13

ఉన్నత చదువు కోసం వెళ్లి అలవాటుపడిన వారొకరైతే..! కొత్త సంవత్సరాన్ని మత్తుగా ఆహ్వానించాలనుకున్నవారు మరొకరు..! ఇతర రాష్ట్రాల నుంచి కూలీ పనులకు వచ్చి దందా సాగిస్తున్నవారు ఇంకొందరు..! డ్రగ్స్ వాడుతూ, విక్రయిస్తూ హైదరాబాద్‌లో వీరంతా ఆదివారం పోలీసులకు పట్టుబడ్డారు. నూతన సంవత్సర వేడుకలను డ్రగ్స్‌తో జరుపుకోవాలనుకునేవారిని లక్ష్యంగా చేసుకుని విక్రయానికి సిద్ధమైన వీరిని కటకటాల వెనక్కినెట్టారు. ఇందులో పెద్దగా చదువుకోని కూలీలు.. ఉజ్వల భవిష్యత్ ఉన్న యువత.. మంచి ఉద్యోగం చేస్తున్న యువతి ఉండడం గమనార్హం.

300 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ!

మిగిలిన 243 సీట్లు మిత్రపక్షాలకు
ముఖాముఖి పోరు, గెలిచే అవకాశం ఉన్న నియోజకవర్గాలపైనే దృష్టి
రాష్ట్రాల విభాగాలతో అలయన్స్ కమిటీ చర్చలు.. 4న సోనియా, ఖర్గేకు నివేదిక
'ఇండియా'తో ఇచ్చిపుచ్చుకునే ధోరణి
మీరు మాకు సహకరిస్తే.. బీజేపీతో పోరులో మీకు మేం సహకరిస్తాం
కాంగ్రెస్‌కు మిత్రపక్షాల హితవు

న్యూఢిల్లీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ముఖాముఖి పోటీ ఉన్న స్థానాలతోపాటు పక్కాగా గెలిచే అవకాశం ఉన్న స్థానాల్లోనే పోటీ చేయాలని, మిగిలిన వాటిని ఇండియా కూటమిలోని మిత్రపక్షాలకు వదిలేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఈ మేరకు మొత్తం 543 నియోజకవర్గాల్లో 300 సీట్లకే పరిమితమై, మిగిలిన 243 సీట్లను కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు కేటాయించాలని కసరత్తు జరుపుతోంది. గుజరాత్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్,

మిగతా 2వ పేజీలో...



13

32 మెడికల్ కాలేజీలకు బదులు..
32 యూట్యూబ్ చానళ్లు పెట్టాల్సింది

మా ఓటమికి కారణం దుష్ప్రచారమే
నెటిజన్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నా
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2

16వ ఆర్థిక సంఘం చైర్మన్‌గా
అరవింద్ పనగడియా

కమిషన్ కార్యదర్శిగా రిత్విక్ పాండే
కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు

రాజేంద్రనగర్ ఠాణా.. దేశంలోనే నంబర్ 1

మహిళా భద్రతకు పెద్దపీట
కేసుల పరిష్కారంలో బెస్ట్
3
మిస్సింగ్ కేసుల ట్రేసింగ్‌లో టాప్
కుటుంబ కౌన్సెలింగ్‌లోనూ భేష్
కేంద్ర హోం శాఖ ప్రకటన

విశాఖలో గ్యాంగ్ రేప్?

17 ఏళ్ల బాలికపై పదిమంది అత్యాచారం.. ప్రేమించిన ప్రియుడే వంచించాడు
స్నేహితుడితో కలిసి ఆమెపై అఘాయిత్యం.. ఓదార్చినట్టు నటించి మరొకడి దుర్మార్గం
పలు హోటళ్లలో మిత్రులతో కలిసి అకృత్యం.. వారం రోజులపాటు బాలికకు నరకం
తండ్రి ఫిర్యాదుతో వెలుగులోకి ఘోరం.. విచారణ చేపట్టిన విశాఖ పోలీసులు



విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖలో దారుణం జరిగింది. ఓ బాలికపై పది మంది యువకులు పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. అత్యాచారం తరువాత షాక్‌లోకి వెళ్లిన యువతి ఒడిసాలోని స్వగ్రామానికి వెళ్లింది. ఆమె కనిపించడంలేదంటూ బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఆమె ఒడిసాలో ఉన్నట్టు గుర్తించి, విశాఖకు తీసుకువచ్చి వివరాలు సేకరించారు. అత్యాచారానికి పాల్పడిన యువకుల్లో కొంతమందిని అదుపులోకి తీసుకుని

మిగతా 3వ పేజీలో...

ప్లీజ్.. ఏపీకి రావొద్దు చెల్లీ!

14

బాబాయ్ సుబ్బారెడ్డితో షర్మిలకు జగన్ రాయబారం?
బుజ్జగించేందుకు వైవీ ప్రయత్నం.. కుదరదన్న షర్మిల
మాకు అన్యాయం జరిగితే రాయబారం నడపలేదేం?
మేం రోడ్డున పడితే పట్టించుకోలేదు.. క్షోభ పడ్డాం
ఇప్పుడు జగన్‌కు ఇబ్బంది అవుతుందని వచ్చారా?
నా మానాన నన్ను బతకనివ్వండి.. తేల్చిచెప్పిన షర్మిల



సోషల్ మీడియాలో 'శ్రీరామ భజనలు'

2

శ్రీరామ భజన్‌తో సృజనాత్మకతను పంచుకోండి
మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ ప్రసంగం

యూపీ లఖ్‌నవూకు చెందిన అనిల్ కుమార్ సాహూ అనే వ్యక్తి 8 దేశాల సమయాలను సూచించే 75 సెంటీమీటర్ల గోడ గడియారాన్ని అయోధ్య రామాలయానికి కానుకగా ఇచ్చారు. ఈ గడియారం దుబాయ్ (యూఏఈ), టోక్యో (జపాన్), మాస్కో (రష్యా), బీజింగ్ (చైనా), సింగపూర్, మెక్సికో, వాషింగ్టన్, న్యూయార్క్ (అమెరికా)లకు చెందిన సమయాలను ఒకేసారి చూపిస్తుంది.

పాతకో వందనం.. కొత్తకు స్వాగతం

అదేదో సినిమాలో రాజేంద్రప్రసాద్ 'అప్పుడే తెల్లారిందా?' అన్నట్టు.. చూస్తూచూస్తూండగానే ఏడాది గడిచిపోయింది! 2023 కాలగర్భంలో కలిసిపోయి 2024 వచ్చేసింది. గడిచిన ఏడాది కాలంలో ఎన్నో తీపి జ్ఞాపకాలు.. చేదు సంఘటనలు.. మరెన్నో సంచలనాలు! 'కొత్తకు స్వాగతం.. పాతకో వందనం' అన్నట్టు.. ఆ పాత జ్ఞాపకాలకు బైబై చెప్పి, 2024కు స్వాగతం పలుకుదాం. తెలుగువారి సంవత్సరాది ఉగాదికి పంచాంగం చూసుకున్నట్టే.. అంతరిక్ష, ఆర్థిక, వాతావరణ, సాంకేతిక పరిజ్ఞాన తదితర రంగాల్లో మన భవిష్యత్తు ఎలా ఉండొచ్చో ఈ ఆంగ్ల సంవత్సరాది రోజున ఒక అంచనా వేసుకుందాం.



ఎన్నికల నామ సంవత్సరే..

ప్రజాస్వామ్య దేశంలో అతి పెద్ద పండగ.. ఓట్ల పండగే. ఈ ఏడాది.. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో ఎన్నికలు జరగనున్నాయి. జనవరిలో తైవాన్‌తో మొదలుపెడితే.. నవంబరులో అమెరికా అధ్యక్ష ఎన్నికల దాకా ఈ ఓట్ల పండగ సందడి ప్రపంచం నలుమూలలా కొనసాగనుంది. మనదేశం విషయానికి వస్తే.. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జయకేతనం ఎగురవేసిన బీజేపీ సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆ జోరు కొనసాగించి మరింత బలపడుతుందా? లేక ఇండియా పేరుతో కూటమి గట్టి ఎలాగైనా అధికారంలోకి రావడానికి పావులు కదుపుతున్న కాంగ్రెస్‌కు కాలం కలిసొస్తుందా?.. వేచి చూడాలి. ఒకవేళ బీజేపీ గెలిస్తే.. వరుసగా మూడుసార్లు సొంత బలంతో అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర పార్టీగా దేశచరిత్రలో నిలిచిపోతుంది. సార్వత్రిక ఎన్నికలతోపాటు జరుగుతున్న ఏపీ ఎన్నికలపైన కూడా అందరి దృష్టి ఉంది. అలాగే.. ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమేనంటూ తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు 2024 సెప్టెంబరు 30లోగా కశ్మీరులో ఎన్నికలు జరపాలని ఆదేశించిన నేపథ్యంలో ఆ ఎన్నికలు కూడా ఈ ఏడాది జరుగుతాయి.

రోదసిలో రయ్ రయ్..

హాలీవుడ్ సూపర్‌హిట్ సినిమా అవతార్ బడ్జెట్‌లో ఆవగింజంత ఖర్చుతో చంద్రయాన్-3 ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించి 2023లో సత్తా చాటిన ఇస్రో.. 2024లోనూ మరిన్ని మైలురాళ్లు అందుకునే ప్రయత్నాల్లో ఉంది. అందులో భాగంగానే.. విశ్వాంతరాళాల నుంచి వచ్చే ఎక్స్ కిరణాల అధ్యయనానికి సంబంధించిన 'ఎక్స్‌రే పోలారిమీటర్ శాటిలైట్ ప్రయోగాన్ని ఏడాదిలో తొలిరోజే (జనవరి 1న) నిర్వహించడానికి రంగం సిద్ధం చేసుకుంది. అలాగే, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో కలిసి జనవరి లేదా ఫిబ్రవరిలో 'గగన్‌యాన్-1' మిషన్‌ను నిర్వహించే ఏర్పాట్లు చేస్తోంది. ఈ మిషన్‌లో భాగంగా ముగ్గురు వ్యోమగాములను రోదసిలోకి పంపనుంది. ఇంకా.. మంగళ్‌యాన్‌కు కొనసాగింపుగా మంగళ్‌యాన్-2 (మార్స్ ఆర్బిటర్ మిషన్-2) నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. శుక్రుడిపై వాతావరణం గురించి తెలుసుకునేందుకు శుక్రయాన్-1 (వీనస్ ఆర్బిటర్ మిషన్-1) ప్రయోగానికీ ఇస్రో ఏర్పాట్లు చేస్తోంది. అలాగే.. మనదేశంలో అంతరిక్ష రంగానికి సంబంధించి ప్రైవేటు స్పేస్ కంపెనీల హవా పెరుగుతోంది. 2023లో దేశంలో స్పేస్ స్టార్టప్‌ల సంఖ్య.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే రెండు రెట్లు పెరిగిందని డెలాయిట్ కన్సల్టెన్సీ డేటా చెబుతోంది. పిక్సెల్, ధ్రువ స్పేస్ వంటి సంస్థలు అంతరిక్ష పరిశోధనలను కొత్తపుంతలు తొక్కిస్తున్నాయి. వీటి జోరు మరింతగా పుంజుకుంటుందని అంచనా.

సూపర్ ఎల్‌నినో

2023లో ఎల్‌నినో కారణంగా మనదేశంలో లోటువర్షపాతం నమోదవుతుందని వాతావరణ నిపుణులు అంచనావేశారుగానీ.. సాధారణ వర్షపాతమే నమోదైంది. కానీ, 2024లో అలా ఉండబోదని.. దక్షిణ అమెరికా వద్ద పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు వేడెక్కడం వల్ల సూపర్ ఎల్‌నినో ఏర్పడే ప్రమాదం ఉందని 'నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్'కు చెందిన క్లైమేట్ ప్రెడిక్షన్ సెంటర్ అంచనా వేసింది. ఈ ఎల్‌నినో ప్రభావం దక్షిణ భారతదేశం కన్నా ఉత్తరాదిపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా.

అంతకు మించి.. వేడి!

పారిశ్రామిక యుగానికి ముందు ఉష్ణోగ్రతలతో పోలిస్తే.. ప్రపంచవ్యాప్తంగా ఉపరితల ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్ మించకుండా చూసుకోవాలని 2015లో ప్రపంచ దేశాలన్నీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాలని.. బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని, వాహన కాలుష్యాన్ని నియంత్రించుకోవాలని ప్రపంచదేశాలు అప్పట్లో లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆ దిశగా భారత్ సహా పలు దేశాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. కానీ, ఎన్ని ప్రయత్నాలు చేసినా.. 2023లో జనవరి నుంచి అక్టోబరు నడుమ ఉపరితల ఉష్ణోగ్రతలు 1.4 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయని, ఈలెక్కన 2024లో 1.5 డిగ్రీల పరిమితిని దాటేసే ప్రమాదం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అలా భూతాపం పెరిగిపోతే భూమ్మీద మనుగడ కష్టమవుతుందని వారు హెచ్చరిస్తున్నారు.

ఆర్థికంగా ముందంజే

శతాబ్దానికి ఒకసారి వచ్చే మహమ్మారి ముప్పు.. రెండు యుద్ధాలు.. అంతర్జాతీయ ద్రవ్యోల్బణం.. సంరక్షణవాద విధానాలు.. వీటన్నింటితో గడిచిన మూడేళ్లుగా పలు దేశాలు ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయాయి. భారతీయుల పొదుపు మంత్రం కారణంగా.. మన దేశం మాత్రం కొంతవరకూ వీటన్నింటినీ తట్టుకుని నిలబడగలిగింది. కానీ.. అంతర్జాతీయంగా పరిస్థితుల్లో, ద్రవ్యోల్బణంలో, కల్లోల పరిస్థితుల్లో ఇప్పటికీ పెద్దగా మార్పు లేదు. దీనికి తోడు.. ఏప్రిల్-మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు, పలు రాష్ట్రాల ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సీజన్ అంటే సంక్షేమ పథకాలు జోరందుకునే సమయం. వీటన్నింటి నేపథ్యంలో కూడా.. భారత ఆర్థిక వ్యవస్థ తొలి ఆరు నెలలూ వృద్ధిబాటలోనే సాగుతుందని గోల్డ్‌మన్ శాష్ అంచనా వేసింది. 2024లో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే దేశంగా భారత్ నిలుస్తుందని అసోచాం ఇటీవలే ప్రకటించింది.

ఏఐ పిన్

గడిచిపోయిన 2023.. చాట్‌జీపీటీ, బార్డ్ లాంటి 'జనరేటివ్ ఏఐ'లదేననడంలో సందేహం లేదు. కొత్త ఏడాదిలో ఈ జనరేటివ్ ఏఐ అన్ని స్మార్ట్‌ఫోన్లలోకీ చొచ్చుకురావడం తథ్యం. గూగుల్ పిక్సెల్ ఫోన్లలో ఇప్పటికే కొన్ని ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి కూడా. ఆ సంగతి పక్కన పెడితే.. 2024ని 'ఏఐ పిన్'లు ఏలబోతున్నాయని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. 'ఏఐ పిన్' అంటే.. ఓ చిన్న బ్యాడ్జ్ లాగా మన చొక్కాకు ధరించగలిగే మినీ కంప్యూటర్! యాపిల్ కంపెనీ మాజీ ఉద్యోగులైన ఇమ్రాన్ చౌధరీ, బెతనీ దీని సృష్టికర్తలు. ఈ ఏఐ పిన్‌ను లాంగ్వేజ్ మోడల్స్‌తో పనిచేసేలా వారు రూపొందించారు. అంటే.. దీంతో మాట్లాడి పనులన్నీ చేసుకోవచ్చు. చేయించుకోవచ్చన్నమాట. చాట్‌జీపీటీని రూపొందించిన 'ఓపెన్‌ఏఐ'కి సీఈవోగా వ్యవహరించిన శామ్ ఆల్ట్‌మన్ లాంటివారు ఈ 'ఏఐ పిన్'కు పెట్టుబడులు పెట్టడంతో ప్రపంచమంతా దీనిపై దృష్టి సారించింది.

శాటిలైట్ టోల్‌గేట్లు

ఫాస్టాగ్‌ల ప్రవేశంతో టోల్ గేట్ల వద్ద రద్దీ చాలావరకూ తగ్గిపోయింది. దీనికి కొనసాగింపుగా.. అసలు భౌతిక టోల్‌గేట్లే లేకుండా శాటిలైట్ టోల్‌గేట్ వ్యవస్థను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని కేంద్ర మంత్రి గడ్కరీ రాజ్యసభలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కొత్త వ్యవస్థ 2024 మార్చి నాటికి అందుబాటులోకి రావచ్చని సమాచారం. ఇందుకోసం భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది.

- సెంట్రల్ డెస్క్

సోషల్ మీడియాలో 'శ్రీరామ భజనలు'

- # శ్రీరామభజన్‌తో సృజనాత్మకతను పంచుకోండి
- మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, డిసెంబరు 31: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమైన అయోధ్య రామ మందిరం, శ్రీరాముడిపై భజనలు, కవితలు, పాటలను సోషల్ మీడియాలో #శ్రీరామభజన్‌తో పంచుకోవాలని ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. తద్వారా భక్తి భావం వెల్లివిరుస్తుందని.. రామతత్వం అందరికీ చేరుతుందన్నారు. మందిర ప్రారంభ నేపథ్యంలో దేశమంతా ఉత్సాహంగా ఉందని.. ఈ సంతోష క్షణంలో ప్రజలు సృజనాత్మకత భావాలను రకరకాలుగా వ్యక్తం చేస్తున్నారని, సీనియర్, వర్ధమాన కళాకారులు హృద్యమైన భజనలు రచిస్తూ ఇందులో భాగస్వాములు అవుతున్నారని, ఇలాంటివాటిలో కొన్నిటిని తాను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు చెప్పారు. ఇదంతా గమనించినప్పుడు ఒకే హ్యాష్‌ట్యాగ్ (#శ్రీరామభజన్) ద్వారా సోషల్ మీడియాలో ఎందుకు షేర్ చేయకూడదు? అనే ఆలోచన తనకు వచ్చిందని తెలిపారు. ఈ ఏడాదిలో చివరిదైన 'మన్ కీ బాత్'లో ఆదివారం మోదీ మాట్లాడారు. ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం దేశమంతా ఆత్మవిశ్వాసం, స్వయం సమృద్ధి స్ఫూర్తితో ఉందన్నారు. ఆవిష్కరణల కేంద్రంగా, ఎదురులేని శక్తిగా భారత్ ఎదుగుతోందని పేర్కొన్నారు. పర్యావరణం నుంచి వినోద రంగం వరకు మన ప్రతిభ, క్రియేటివిటీని ప్రపంచమంతా చూసిందన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు, డాక్యుమెంటరీ ఎలిఫెంట్ విస్పరర్స్‌కు ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారం దక్కడం మన ఘనతకు నిదర్శనమని చెప్పారు. నాటు నాటు పాటను ఆస్కార్ వరించడంతో దేశం ఉర్రూతలూగిందని మోదీ వివరించారు.


300 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, అసాం రాష్ట్రాల్లో బీజేపీని, ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలను ఒంటరిగా ఢీకొనాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలిసింది. ఇక ఉత్తర ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, జార్ఖండ్, ఢిల్లీ, పంజాబ్, తెలంగాణల్లో మిత్రపక్షాలతో పొత్తు పెట్టుకొని బీజేపీని, ఇతర పార్టీలను ఢీ కొనాలని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. సీట్ల పంపకాలపై కసరత్తు కోసం కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన జాతీయ అలయెన్స్ కమిటీ ఆయా రాష్ట్రాల పార్టీ యూనిట్లతో చర్చించిన తర్వాత ఈ అభిప్రాయానికి వచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జనవరి 4న సోనియా, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీల సమక్షంలో ఈ కమిటీ నివేదికను సమర్పించనుంది. దీని ఆధారంగా ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలన్న విషయంపై కాంగ్రెస్ ఒక స్పష్టతకు రానుంది.

300 సీట్లలో పోటీ చేస్తే సగమైనా గెలవొచ్చు

2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 52 స్థానాలలో విజయం సాధించింది. 209 నియోజకవర్గాల్లో రెండవ స్థానంలో నిలిచింది. ఈ రెండింటినీ కలుపుకుంటే 261 స్థానాలవుతాయి. వీటికి మరికొన్నింటిని చేర్చి మొత్తమ్మీద 300 స్థానాల వరకు పోటీ చేస్తే వాటిలో సగమైనా గెలిచే అవకాశాలున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు అంచనా వేశారు. పార్టీ గెలుపునకు అవకాశం లేని సీట్లలో పోటీ చేసి మిత్రపక్షాలతో ఇబ్బందులు కొని తెచ్చుకోవటం కన్నా, గత రెండు లోక్ సభ ఎన్నికల్లో, ఆయా రాష్ట్రాల గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు, సీట్ల ప్రాతిపదికగా పోటీచేయడం మంచిదని ఆయన భావిస్తున్నారు. కాగా, సొంతంగా ఎన్ని సీట్లకు, మిత్రపక్షాలతో కలిసి ఎన్ని సీట్లకు పోటీ చేయాలన్న దానిపై కాంగ్రెస్ దాదాపుగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇండియా కూటమిలో లుకలుకలు లేకుండా ఇచ్చి పుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం.




ఇండియా కూటమిలో అంతర్గత చర్చలు

ఇండియా కూటమిలోని వివిధ పార్టీల మధ్య సీట్ల పంపకాల గురించి ఇప్పటికే అంతర్గత చర్చలు ప్రారంభమయ్యాయి. ఢిల్లీలో మొత్తం 7 లోక్‌సభ స్థానాలు ఉండగా, కాంగ్రెస్‌కు 2-3 సీట్లు ఇవ్వాలని ఆమ్‌ఆద్మీపార్టీ భావిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఢిల్లీలో బీజేపీ, ఆప్‌లను ఢీ కొని 5 స్థానాల్లో రెండవ స్థానంలో నిలిచింది. కాబట్టి, 5 సీట్లు కావాలని ఆప్‌ను కాంగ్రెస్ అడిగే అవకాశాలున్నాయి. ఢిల్లీ మాట ఎలా ఉన్నా పంజాబ్‌లో (మొత్తం సీట్లు 13) మాత్రం ఒక్క సీటు కూడా ఇచ్చేందుకు ఆప్ సముఖంగా లేదు. గత ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ 8 స్థానాలు గెలుచుకోగా, అయిదు సీట్లలో రెండో స్థానంలో నిలిచింది. కాబట్టి, కనీసం 8 సీట్లు తనకు కావాల్సిందేనని కాంగ్రెస్ డిమాండ్ చేసే అవకాశాలున్నాయి. 40 సీట్లున్న బిహార్‌లో కాంగ్రెస్ పరిస్థితి బాగాలేదు. గత ఎన్నికల్లో ఒక్క స్థానమే గెలుచుకోగా, 8 స్థానాల్లో రెండవ స్థానంలో నిలిచింది. అందువల్ల ఈసారి ఆ రాష్ట్రంలో మిత్రపక్షాలైన జేడీయూ, ఆర్జేడీలు కేటాయించే సీట్లకే పరిమితం కావచ్చు. 9 స్థానాలను కాంగ్రెస్ డిమాండ్ చేసే అవకాశం ఉంది. ఇక 48 సీట్లున్న మహారాష్ట్రలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది కానీ 21 స్థానాల్లో రెండవ స్థానంలో నిలిచింది. ఈసారి తాము అధిక సీట్లకు పోటీ చేస్తామని శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఇప్పటికే ప్రకటించారు. కాబట్టి ఎన్సీపీ, కాంగ్రెస్‌లకు ఎన్ని సీట్లు మిగులుతాయో వేచి చూడాల్సి ఉంది. బెంగాల్‌లో కాంగ్రెస్, వామపక్షాలకు ఒక్క సీటు కూడా ఇచ్చేందుకు తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ సిద్ధంగా లేరు. ఇక్కడ గత ఎన్నికల్లో కాంగ్రెస్ 2 స్థానాలు గెలుచుకోగా, ఒక్క సీటులో రెండవ స్థానంలో నిలిచింది. కాబట్టి, మహాఅయితే కాంగ్రెస్‌కు మూడు సీట్లు ఇచ్చేందుకు మమత అంగీకరించవచ్చు.

కాంగ్రెస్ తమతో ఔదార్యంగా వ్యవహరిస్తే.. కాంగ్రెస్ ఒంటరిగా బీజేపీని ఢీకొనే సీట్లలో తాము ఆ పార్టీకి సహకరిస్తామని ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు స్పష్టం చేస్తున్నాయి. సీట్ల సర్దుబాటు తర్వాతే కూటమి కలిసికట్టుగా సమావేశాలు, సభలు నిర్వహించి ప్రచారంపై దృష్టి కేంద్రీకరించే అవకాశాలున్నాయి.

లోకం తీరు



నేడే పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ ప్రయోగం

- ఎక్స్‌పోశాట్ ఉపగ్రహంతో నింగిలోకి
- ఉదయం 9:10 గంటలకు ప్రయోగం



సూళ్లూరుపేట, డిసెంబరు 31: చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 ప్రతిష్ఠాత్మక మిషన్లను విజయవంతంగా ప్రయోగించి 2023 ఏడాదిని ఘనంగా ముగించిన ఇస్రో.. కొత్త ఏడాదిని అదిరిపోయే విజయంతో ఆరంభించాలని ఉవ్విళ్లూరుతోంది. 2024 ఆరంభం రోజునే పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ ద్వారా ఎక్స్‌రే పోలారిమీటర్ ఉపగ్రహం (ఎక్స్‌పోశాట్) ప్రయోగానికి ఏర్పాట్లు చేసింది. దీంతోపాటు మరో పది బుల్లి ఉపగ్రహాలను కూడా తక్కువ భూకక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష కేంద్రం నుంచి సోమవారం ఉదయం 9.10 గంటలకు ఈ ప్రయోగాన్ని చేపట్టనుంది. దీనికి సంబంధించిన కౌంట్‌డౌన్‌ను ఇస్రో శాస్త్రవేత్తలు ఆదివారం ఉదయం 8.10 గంటలకు ప్రారంభించారు. కౌంట్‌డౌన్ జరిగే సమయంలో రాకెట్‌కు ఇంధనాన్ని నింపి, గ్యాస్ ఫిల్లింగ్ చేశారు. రాకెట్‌లోని అన్ని వ్యవస్థల పనితీరును శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పరిశీలించి ప్రయోగానికి సిద్ధం చేశారు. ఇస్రో ప్రయోగిస్తున్న తొలి పోలారిమెట్రీ మిషన్ ఇదే. అమెరికాకు చెందిన నాసా 2019లో చేపట్టిన ఇమేజింగ్ ఎక్స్‌రే పోలారిమెట్రీ ఎక్స్‌ప్లోరర్ (ఐఎక్స్‌పీఈ) తర్వాత మరో దేశం చేపడుతున్న పోలారిమెట్రీ మిషన్ ఇదే కావడం గమనార్హం. ఎక్స్‌రే మూలాలను అన్వేషించడం ఈ ఉపగ్రహ ప్రధాన లక్ష్యం. దీనిద్వారా విశ్వంలోని బ్లాక్ హోల్స్, భారీ నక్షత్రాలను అధ్యయనం చేయనున్నారు.

16వ ఆర్థిక సంఘం చైర్మన్‌గా

అరవింద్ పనగడియా

న్యూఢిల్లీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల వాటాను నిర్ధరించడానికి ఉద్దేశించిన 16వ ఆర్థిక సంఘం చైర్మన్‌గా ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ అరవింద్ పనగడియాను ఆదివారం కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ కార్యదర్శిగా ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి రిత్విక్ రంజనం పాండే నియమితులయ్యారు. వైస్‌చైర్మన్, సభ్యులను ఇంకా నియమించాల్సి ఉంది. కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసిన పనగడియా గతంలో నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్‌గా పనిచేశారు. వివిధ అంశాలపై 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు అయిదేళ్ల కాలానికి అమలయ్యేలా సిఫార్సులు చేయాల్సి ఉంటుంది. 2025 మార్చి 31 నాటికి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలి. ఆ సిఫార్సులు 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. పన్నుల్లో వాటాను నిర్ణయించడంతో పాటు ఆదాయ వనరులను పెంచే మార్గాలను అన్వేషించడం, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి నిధులను సమకూర్చడం తదితర అంశాలపై అధ్యయనం చేసి సిఫార్సులు చేయాల్సి ఉంది.

ఆడబిడ్డలపై ఇంత నిర్దయా?

- వినేశ్ ఫొగట్‌పై ప్రధాని వైఖరి బాధించింది: రాహుల్

న్యూఢిల్లీ, డిసెంబరు 31: రెజ్లర్ వినేశ్ ఫొగట్ విషయంలో ప్రధాని మోదీ నిర్దయ వైఖరి తనను బాధించిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. వినేశ్ తనకు ప్రభుత్వం ప్రదానం చేసిన ఖేల్‌రత్న, అర్జున అవార్డులను ఢిల్లీలోని కర్తవ్యపథ్ మార్గంలో శనివారం వదిలేసి వచ్చారు. రెజ్లింగ్ సమాఖ్యలో జరుగుతున్న పరిణామాలను ప్రధానిని ఆయన నివాసంలో కలిసి వివరించేందుకు వినేశ్ చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఆమెను ప్రధానమంత్రి కార్యాలయం చేరకముందే కర్తవ్యపథ్‌లో నిలువరించారు. నిరసనగా ఆమె తనకు లభించిన అవార్డులను అక్కడే వదిలేసి పోయారు. దీనిపై ఆదివారం రాహుల్‌గాంధీ స్పందించారు.

అమ్మకు పప్పన్నం ఇష్టం



విదేశాలకు వెళ్లిరాగానే పప్పుఅన్నం తినడానికి తన తల్లి సోనియాగాంధీ ఇష్టపడతారని రాహుల్‌గాంధీ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా తల్లితో కలిసి ఓ వీడియోను యూట్యూబ్‌లో ఆయన విడుదల చేశారు. బత్తాయిలతో చేసిన జ్యూస్‌ను తయారుచేస్తూ రాహుల్ ఆ వీడియోలో కనిపించారు.

841 కొత్త కొవిడ్ కేసులు.. ముగ్గురి మృతి

న్యూఢిల్లీ, డిసెంబరు 30: దేశంలో రోజువారీ కొవిడ్ కేసులు పెరిగిపోతున్నాయి. గత 24 గంటల వ్యవధిలో 841 కొత్త కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదివారం బులెటిన్ విడుదల చేసింది. కిందటి రోజుతో పోలిస్తే దాదాపు 100 కేసులు పెరిగాయి. తాజాగా మరో మూడు మరణాలు రికార్డయ్యాయి. కేరళ, కర్ణాటక, బిహార్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మహమ్మారికి బలయ్యారు. కొత్త కొవిడ్ కేసులతో క్రియాశీల కేసులు 4,309కి చేరాయి.

మహారాష్ట్రలోని ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

- ఆరుగురు కార్మికుల మృతి

ఛత్రపతి శంభాజీనగర్, డిసెంబరు 31: మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో చేతి గ్లౌజులు తయారుచేసే ఓ ఫ్యాక్టరీలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. వాలజ్ పారిశ్రామికవాడలోని ఓ ఫ్యాక్టరీలో తెల్లవారుజామున ఒంటిగంటకు అగ్నిప్రమాదం జరిగింది. ఆ సమయంలో 13 మంది కార్మికులు లోపల నిద్ర పోతున్నారు. వారిలో ఆరుగురు మృతి చెందగా మిగిలిన ఏడుగురు పైకప్పు పగలగొట్టి బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే అగ్నిమాపక దళాన్ని అప్రమత్తం చేయడంతో.. ఆ దళం రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చింది.

ఎంజీఎం ఆస్పత్రిని ప్రక్షాళన చేస్తాం

» దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



హనుమకొండ అర్బన్, డిసెంబరు 31: ఎంజీఎం ఆస్పత్రిలో మెరుగైన సేవలను విస్తృతం చేసేందుకు ఆస్పత్రిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని దేవాదాయ, అటవీశాఖ మంత్రి మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆదివారం ఆమె ఆస్పత్రిని సందర్శించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మెరుగైన సేవలే తమ ప్రభుత్వ లక్ష్యమని, పేద రోగులకు అన్ని రకాల వసతులను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఎంజీఎం ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు సురేఖ తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రి గుండెకాయ లాంటిదని, దానిని కాపాడుకుంటామని ఆమె తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రికిలో ప్రస్తుతం 25 మంది కొవిడ్ రోగులు చికిత్స పొందుతున్నారని, వారిలో ఎవరికీ ప్రాణాపాయ లక్షణాలు లేవని వెల్లడించారు. హెల్త్‌సిటీ పేరుతో నిర్మిస్తున్న ఆస్పత్రి గురించి ఎంజీఎం అధికారులకు సమాచారం లేకపోవడం పట్ల మంత్రి విస్మయం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాలపై క్రిమినల్ కేసు

» కోర్టు వివాదంలోని స్థలంలో వైన్స్ ఏర్పాటు

బంజారాహిల్స్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కోర్టు వివాదంలో ఉన్న ఓ స్థలంలో వైన్ షాప్ ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదైంది. రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు వైన్‌షాప్‌ను కూడా సీజ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 3లో ప్లాట్ నెంబరు 8(డీ)లో 2.2 ఎకరాల స్థలం ఉంది. దీనిపై ప్రభుత్వానికి.. షౌఖతున్నీసా బేగం అనే మహిళకు మధ్య కోర్టులో వివాదం నడుస్తోంది. అయితే 2006లో అపెక్స్ కోర్టు షౌఖతున్నీసాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. కాగా, ఈ స్థలానికి అనుకొని ఉన్న 2,175 గజాల స్థలం తమదేనంటూ పాలేరు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల.. దీప్తి ఎవెన్యూ ప్రైవేటు లిమిటెడ్ పేరిట ఆక్రమించేందుకు యత్నించారు. ఈ స్థలం ప్లాట్ నంబరు 8(సీ) కిందకు వస్తుందని ఆయన వాదించారు. దీంతో రెవెన్యూ అధికారులు స్థలంలో ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. కందాల కోర్టును ఆశ్రయించగా స్టేటస్ కో ఇచ్చింది. అయితే కోర్టు నిబంధనలను ఉల్లంఘించి 15 రోజుల క్రితం కందాల అక్కడ షెడ్లు నిర్మించి వైన్‌షాపు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మృతుడి పేరుతో పాస్‌పుస్తకం.. రద్దు!

» ధరణిలో ఆ భూమి ఔటర్ రింగ్ రోడ్డుదని సవరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఘట్‌కేసర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగు రోడ్డుకు సేకరించి, పరిహారం కూడా చెల్లించిన భూమికి మృతుడి పేరుతో ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాన్ని ఎట్టకేలకు అధికారులు రద్దు చేశారు. డిసెంబరు 27న 'ఆంధ్రజ్యోతి'లో 'మృతుడి పేరుతో పట్టాదారు పాస్‌పుస్తకం' శీర్షికన ప్రచురితమైన కథనంపై రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం పడమటి సాయిగూడలోని సర్వే నంబరు 18(ఇ)లో ఔటర్ రింగ్ రోడ్డుకు సేకరించి పరిహారం పొందిన భూమికి, అదీ మృతి చెందిన బండారి రాందాసు పేరిట ధరణిలో పాస్‌పుస్తకం జారీ అయింది. ఈ వ్యవహారాన్ని, ధరణిలో లోపాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఇదే సర్వే నంబరులో సీఎం రేవంత్‌రెడ్డి కుమార్తె నైమిషారెడ్డి, ఆమె కుటుంబసభ్యులు భూమి కొనుగోలు చేసిన విషయాన్ని వెల్లడించింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. ధరణి పోర్టల్‌లో జారీ అయిన పాసుపుస్తకంలోని పట్టాదారు కాలమ్‌లో మృతుడు బండారి రాందాసును పేరును తొలగించి 'రోడ్డు' అని నమోదు చేశారు. పాసుపుస్తకం జారీ అయిన 5.08 ఎకరాల భూమికి రూ.88.20 లక్షల మార్కెట్ విలువగా పొందుపర్చారు. ఈ భూమి ఔటర్ రింగ్ రోడ్డుకు చెందినదని ధరణిలో నమోదు చేశారు.

విశాఖలో గ్యాంగ్ రేప్!?

(మొదటి పేజీ తరువాయి)



విచారిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని కలహండి జిల్లా పనిముండ్ర గ్రామానికి చెందిన 44 ఏళ్ల వ్యక్తి విశాఖలోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబంతో కంచరపాలెంలో ఉంటున్నాడు. ఇతని 17 ఏళ్ల కుమార్తె పోర్టు క్వార్టర్స్ సమీపంలోని నేవీ అధికారి ఇంట్లో సహాయకురాలిగా పనిచేస్తోంది. ఈ నెల 17న పనికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మరుసటి రోజు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. స్వగ్రామమైన పనిముండ్ర వెళ్లినట్టు గుర్తించారు. తల్లిదండ్రులను వెంటబెట్టుకుని అక్కడకు వెళ్లి బాలికను తీసుకువచ్చారు. అప్పటికే షాక్‌లో ఉన్న బాలిక ఎవరితో మాట్లాడలేదు. కోలుకున్నాక తనపై జరిగిన అఘాయిత్యం గురించి శనివారం తల్లిదండ్రులకు చెప్పింది. వారు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. బాలిక వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. ఆమె చెప్పిన వివరాల మేరకు.. పదిమంది యువకులు, పలుమార్లు అనేక హోటళ్లలో అత్యాచారానికి పాల్పడ్డారు.

మోసం చేసిన ప్రియుడు?

బాధితురాలు కొన్నాళ్ల క్రితం స్థానిక యువకుడితో ప్రేమలో ఉందని, అతడి కోరిక మేరకు ఈ నెల 17న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ దగ్గరలోని ఓ హోటల్‌కు వెళ్లినట్టు చెబుతున్నారు. అక్కడ వీరిద్దరూ శారీరకంగా కలిశాక, ఆ యువకుడు తన స్నేహితునికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. అతను కూడా హోటల్‌కు చేరుకుని బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ప్రేమించిన యువకుడే అతని స్నేహితునితో అత్యాచారం చేయించడాన్ని తట్టుకోలేకపోయిన బాలిక తీవ్ర మనస్తాపానికి గురై బీచ్‌కు చేరుకుని విలపిస్తుండగా, గుర్తించిన మరో వ్యక్తి(ఫొటోగ్రాఫర్ అని చెబుతున్నారు) ఓదార్చినట్టు నటించి స్నేహితుల గదికి తీసుకువెళ్లాడు. ఆ గదిలో ఫొటోగ్రాఫర్‌తోపాటు మరో ఏడుగురు యువకులు బాలికను హింసించి, అత్యాచారం చేశారు. తర్వాత నగర పరిధిలోని మరికొన్ని హోటళ్లు, లాడ్జిలకు తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో కొంతమంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి



యాదగిరిగుట్టలో..

యాదగిరిగుట్ట/భద్రాచలం/వేములవాడ, డిసెంబరు 31: ఏడాదిలో చివరి రోజు, సెలవు దినం కూడా కావడంతో ఆదివారం ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ తదితర ప్రధాన ఆలయాల్లో రద్దీ నెలకొంది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని సుమారు 35 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఖజానాకు రూ.42 లక్షల ఆదాయం సమకూరింది. వేములవాడకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలోనూ భక్తుల సందడి నెలకొంది. దేవస్థానం నిత్య అన్నదాన పథకానికి ఏపీలోని బాపట్ల జిల్లా చీరాలకు చెందిన సూర్యకుమారి రూ.1,01,116 విరాళం అందజేశారు.

సాగర్‌లో పర్యాటకుల సందడే సందడి

» అతిథి గృహాలన్నీ ఫుల్.. కొత్త సంవత్సర వేడుకలకు రాక

నాగార్జునసాగర్, డిసెంబరు 31: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు పర్యాటకులు పెద్దఎత్తున సాగర్‌కు తరలివచ్చారు. దీంతో బుద్ధవనం, విజయవిహార్, అనుపు, ఎత్తిపోతల తదితర ప్రాంతాల్లో సందడి నెలకొంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు హిల్‌కాలనీ విజయవిహార్ అతిథి గృహం వెనకవైపు ఉన్న పర్యాటకశాఖ లాంచీస్టేషన్ నుంచి మూడు లాంచీ ట్రిప్పులు నడిపినట్లు అధికారులు తెలిపారు. పర్యాటకుల రాకతో సాగర్‌లోని విజయవిహార్ అతిథిగృహంలో 35 గదులు, ప్రాజెక్టు హౌస్‌లోని 30 గదులతోపాటు ప్రైవేట్ హోటళ్లు, మాతాసరోవర్, పార్క్‌ఇన్, శ్రీనివాస రెసిడెన్సీలలో కూడా రెండు రోజులకు గదులు బుక్ చేసుకున్నారు.

రాజేంద్రనగర్ ఠాణా.. దేశంలోనే నంబర్ 1

» ప్రకటించిన కేంద్ర హోం శాఖ

» 5న జైపూర్‌లో అవార్డు ప్రదానం

రాజేంద్రనగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్ ఠాణా దేశంలోనే నంబర్-1 పోలీస్‌స్టేషన్‌గా నిలిచింది. పలు అంశాలను ప్రామాణికంగా తీసుకుని, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ(ఎంహెచ్‌ఏ) నిర్వహించిన అధ్యయనం/సర్వేలో సింహభాగం కేటగిరీల్లో ఉత్తమ ప్రతిభ కనిపించిన రాజేంద్రనగర్ పోలీసులు ఈ అరుదైన ఘనతను సాధించారు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌హెచ్‌వో)కు ఈ మేరకు ఎంహెచ్‌ఏ నుంచి సందేశం అందింది. ఈనెల 5న జైపూర్‌లో జరగనున్న డీజీపీల కాన్ఫరెన్స్‌లో అవార్డును అందుకోవాల్సిందిగా ఎంహెచ్‌ఏ నుంచి పిలుపు వచ్చిందని అధికారులు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల పరిష్కారం, ఠాణాకు వచ్చేవారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించడం వంటి అంశాల్లో రాజేంద్రనగర్ ఠాణా మంచి మార్కులను కొట్టేయగా.. మహిళా భద్రతలో టాప్‌గా నిలిచింది. మిస్సింగ్ కేసులను త్వరితగతిన ట్రేస్ చేయడం, భార్యాభర్తల మధ్య వివాదాలను కౌన్సెలింగ్‌తో ఠాణా స్థాయిలోనే పరిష్కరించడం వంటి అంశాల్లోనూ మంచి స్కోరును సాధించింది. వీటితోపాటుగా.. గుర్తుతెలియని వ్యక్తులు మరణించినప్పుడు, వారి మృతదేహాలు దొరికినప్పుడు.. వెనువెంటనే వారెవరనేదాన్ని గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందజేయడం, పోస్టుమార్టం జరిగిన వెంటనే మృతదేహాన్ని అప్పగించడంపై రాజేంద్రనగర్ పోలీసుల పనితీరును ఎంహెచ్‌ఏ ప్రత్యేకంగా అభినందించింది. ఎన్నెన్నో జాతీయ, రాష్ట్రస్థాయి విద్య, పరిశోధన సంస్థలు, అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి సమీపంలో ఉండడంతో పోలీసులు నిత్యం బిజీగా ఉన్నా.. శాంతిభద్రతల విషయంలో రాజీపడకుండా పనిచేయడాన్ని ఎంహెచ్‌ఏ మెచ్చుకుందని అధికారులు తెలిపారు. కాగా దేశంలోనే 2, 3 ర్యాంకులను పొందిన ఠాణాల జాబితాలో జమ్మూకశ్మీర్‌లోని షేర్‌గరీ, బెంగాల్‌లోని సేరంపూర్ ఠాణాలున్నాయి.

జేఎన్‌టీయూలో డేటా సెంటర్

» రూ.5కోట్లతో ఏర్పాటుకు అదానీ గ్రూప్ అంగీకారం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సుమారు రూ.5కోట్లతో అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటుకు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని అదానీ గ్రూప్ ఎంచుకుందని రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ తెలిపారు. వర్సిటీలో దీని ఏర్పాటుతో విద్యార్థులు, ఇతర సంస్థలకు బహుళ ప్రయోజనాలుంటాయని చెప్పారు. దీనికి సంబంధించి అదానీ గ్రూప్ ప్రతినిధులు ఇటీవల జేఎన్‌టీయూను సందర్శించి వైస్‌చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి, ఇతర అధికారులతో చర్చించారని తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న ఐకానిక్ బిల్డింగ్‌లో డేటా సెంటర్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయించాలని వీసీ అధికారులను సూచించినట్లు చెప్పారు. యూనివర్సిటీ విద్యార్థుల డేటాతోపాటు అనుబంధ కళాశాలల విద్యార్థులు, కార్పొరేట్ కంపెనీలకు సంబంధించిన డేటాను ఈ సెంటర్‌లో భద్రపరిచేందుకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల ప్రాజెక్టు వర్క్‌లు, పరిశోధనలకు ఈ డేటా సెంటర్ ఎంతగానో దోహదపడనుందని రిజిస్ట్రార్ తెలిపారు. ఐదేళ్ల నిర్వహణ అనంతరం ఇక్కడి అధ్యాపకులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి, ఈ విభాగాన్ని పూర్తిగా జేఎన్‌టీయూకు అప్పగించేలా ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు ఆయన చెప్పారు.

యువతీయువకుల బలవన్మరణం

» ఏపీకి చెందినవారిగా అనుమానం

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 31 : ఇద్దరు యువతీయువకులు రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలోని 115వ మైలురాయి వద్ద రైలుపట్టాలపై వీరి మృతదేహాలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. యువకుడి జేబులో శనివారం ఉదయం 11 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్‌లో కొన్న టికెట్ ఉంది. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించేందుకు టికెట్లు కొనుగోలు చేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. యువకుడి కుడిచేతిపై రామలక్ష్మి అనే పేరుతో టాటూ ఉంది. ఇతడి వయసు 30 ఏళ్లు, యువతి వయస్సు సుమారు 25 ఏళ్లు ఉంటుంది. వీరు ఒకే కుటుంబానికి చెందినవారా..? ప్రేమజంటా.. అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. రైలుపట్టాలపై ఛిద్రమై పడి ఉన్న వీరి మృతదేహాలను స్థానిక ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. యువతీయువకులిద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారై ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

కార్నియా అంధత్వానికి మూలకణ చికిత్స

» ఎల్వీ ప్రసాద్ వైద్యుల ఆవిష్కరణ

» 20 ఏళ్లకు పేటెంట్ మంజూరు

» ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్

» విజయవంతమైతే కంటి చికిత్సలో కీలక మైలురాయిగా నిలిచే అవకాశం



వైద్యులు వివేక్‌సింగ్, సయన్ బసు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పారదర్శకమైన కంటి బయటి పొర (కార్నియా) చికిత్సలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు ఆవిష్కరించిన ఓ వినూత్న ప్రక్రియకు పేటెంట్ లభించింది. మూలకణాలతో (స్టెమ్ సెల్స్‌తో) జరిపే ఈ చికిత్సకు 20 ఏళ్ల కాలానికి కేంద్ర ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. ఈ సెల్ థెరపీని నేత్ర వైద్యులు సయన్ బసు, వివేక్ సింగ్ అభివృద్ధిపరిచారు. ప్రస్తుతం ఈ థెరపీ పరీక్ష (క్లినికల్ ట్రయల్స్) దశలో ఉంది. కార్నియా దెబ్బతిన్నప్పుడు ఇన్ఫెక్షన్, ప్రమాదాల వల్ల పొర అపారదర్శకంగా మారి కార్నియల్ మచ్చలు ఏర్పడుతాయని డాక్టర్ సయన్ బసు, డాక్టర్ వివేక్ సింగ్ తెలిపారు. అంధత్వం, దృష్టి లోపానికి కార్నియా సమస్య ఒక ప్రధాన కారణమని, అటువంటప్పుడు కార్నియల్ మార్పిడి అవసరమవుతుందన్నారు. అయితే కార్నియల్ మార్పిడి శస్త్రచికిత్స చాలా క్లిష్టమని, ఆపరేషన్ తర్వాత జీవిత కాలం పాటు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. తాము అభివృద్ధి పరిచిన స్టెమ్‌సెల్స్ చికిత్స ద్వారా కార్నియల్ మూలకణాలను ఉపయోగించి కార్నియాను మెరుగుపర్చటం సాధ్యపడుతుందని చెప్పారు. కార్నియా ఆకారాన్ని కలిగి ఉండే కనెక్టివ్ ప్రొటీన్ కార్నియల్ కొల్లాజెన్‌ను స్టెమ్‌సెల్ థెరపీతో పునరుజ్జీవింప చేయవచ్చని, తద్వారా కొల్లాజెన్ కార్నియాను బలోపేతం చేస్తుందని డాక్టర్ వివేక్ సింగ్ తెలియజేశారు. ఈ థెరపీ నేత్ర పరిశోధన రంగంలో ఓ కీలక మైలురాయి వంటిదని, అదే సమయంలో కార్నియల్ అంధత్వంతో సతమతమయ్యే ఎంతోమందికి మేలు చేస్తుందని డాక్టర్ సయన్ బసు తెలిపారు. క్లినికల్ ట్రయల్స్ విజయవంతమైతే కార్నియల్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు సంభవిస్తాయన్నారు.

సోమనాథ సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పించాలి

» తెలుగు వర్సిటీ ఉప కులపతి తంగెడ కిషన్‌రావు

» పాలకుర్తిలో సాహితీవేత్తలకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న సాహితీవేత్తలు

పాలకుర్తి, డిసెంబరు 31: సాహితీ విప్లవమూర్తి పాల్కురికి సోమనాథుడి సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని, ఇందుకు సోమనాథ కళాపీఠం దోహదపడుతుందని తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు అన్నారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కిషన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయం సమీపంలోని పాల్కురికి సోమనాథుడి విగ్రహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యం, కళా, పండిత, పరిశోధన రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి మూడు దశాబ్దాలుగా పురస్కారాలు అందజేస్తుండటం కళాపీఠం గొప్పతనమన్నారు. సోమనాథుడు పేదలను చైతన్యం చేయడానికే గ్రంథాలు రాశారని తెలిపారు. సోమనాథ సాహిత్య పురస్కారాన్ని డాక్టర్ కానుకుర్తి శెట్టి సోమశేఖర్, సామాజిక శోధన పురస్కారాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్, రంగస్థల పురస్కారాన్ని మంచాల రమేష్, పందిల్ల శేఖర్‌బాబు.. రాజయ్య శాస్త్రి స్వచ్ఛంద భాషా సేవ పురస్కారాన్ని డాక్టర్ మైథిలి అబ్బరాజు, చలపతిరావు సాహిత్య పురస్కారాన్ని ఎం.ఎస్.ఆర్. వెంకటరమణ, ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారాన్ని డాక్టర్ సి.ఎస్.ఆర్. ప్రభు, రాపోలు సోమయ్య ప్రతిభా పురస్కారాన్ని డాక్టర్ అరూరి మహేందర్, దేవగిరి రాజయ్య స్మారక పురస్కారాన్ని బూస రేణుకారాధ్య స్వీకరించారు. కార్యక్రమానికి కళాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

కల్తీ నెపంతో.. పాలను పారబోస్తారా..?

» డెయిరీ సిబ్బందిని బంధించిన పాడి రైతులు

» తీసుకున్న పాలకు బిల్లు ఇవ్వాలని డిమాండ్



నిర్బంధంలో ఉన్న మేనేజర్, సూపర్‌వైజర్లు

మద్దూరు, డిసెంబరు 31: డెయిరీలో పోస్తున్న పాలు కల్తీ అవుతున్నాయని చెప్పి పారబోయడంపై పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజులుగా ఇలాగే జరుగుతుండటంతో విజయ డెయిరీ మేనేజర్, ఇద్దరు సూపర్‌వైజర్లను పాల కేంద్రంలో బంధించారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరులో ఆదివారం ఈ ఘటన జరిగింది. లద్నూరులోని విజయ డెయిరీ పాల శీతలీకరణ కేంద్రంలో 140 మంది రైతులు సుమారు 1,300 లీటర్ల పాలు పోస్తున్నారు. కేంద్రంలో చైర్మన్, సెక్రటరీ టెస్ట్ చేసి సేకరిస్తున్న పాలను రూట్ సూపర్‌వైజర్ చెక్ చేసి చేర్యాలలోని పాలశీతలీకరణ కేంద్రానికి తరలిస్తున్నారు. ఈ నెల 28న సేకరించిన 28 క్యాన్ల పాలను చేర్యాలకు తరలించగా 6 క్యాన్లలో ఉప్పు కలుస్తున్నట్లు హైదరాబాద్ టెస్టింగ్‌లో తేలిందని చెప్పి పాలను తిరిగి కేంద్రానికి పంపకుండా పారబోశారు. మరుసటి రోజు ఉదయం పోసిన 11క్యాన్ల పాలను అదే విధంగా పారబోశారు. దీంతో రైతులు ఆగ్రహించగా.. టెస్టింగ్ కోసం లద్నూరు వచ్చిన సూపర్‌వైజర్ తిరుపతి పాలను పరిశీలించి.. కల్తీ లేదని చెప్పి కేంద్రానికి పంపించాలని సూచించి వెళ్లిపోయారు. శనివారం కూడా పాలలో ఉప్పు కలుస్తోందని చెప్పిన చేర్యాల మేనేజర్ 11 క్యాన్ల పాలను తిరస్కరించి పారబోశారు. లద్నూరులో సాయంత్రం రైతుల నుంచి పాలను తీసుకోవడానికి కేంద్రం నిర్వాహకులు నిరాకరించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు పాల కేంద్రం షట్టర్‌ను బంద్ చేసి ధర్నాకు దిగారు. విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించారు. వెంటనే సమస్య పరిష్కారానికి మేనేజర్, సూపర్‌వైజర్లను పంపిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆదివారం లద్నూరు వచ్చిన మేనేజర్ మురళి, ఇద్దరు సూపర్‌వైజర్లను రైతులు గదిలో బంధించి నిరసనకు దిగారు. పాలను టెస్టింగ్ చేసి తీసుకుని చేర్యాలకు తరలించిన క్రమంలో కల్తీ అవుతున్నాయని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. తాము పోసిన పాలకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని మేనేజర్ మురళి హామీ ఇచ్చారు.

అతడు రాసిన ఆమె కథలు

ప్రాచీన కావ్యాల్లో స్త్రీని ఒక 'సౌందర్యమూర్తి'గా ప్రతిష్ఠించే క్రమంలో ఆమెను అనైతికతకు ఆస్కారంలేని దేవతామూర్తిగా చేసి ఒక నైతిక చట్రంలో ఇమిడ్చే నర్మగర్భమైన ప్రయత్నం కనబడుతుంది. స్వతఃసిద్ధమైన స్త్రీ అస్తిత్వానికి దూరంగా ఆమెకు ఒక నిర్దిష్టమైన రూపాన్ని అంటగట్టే ప్రయత్నంలో సాహితీ సృజనలో అవసరమైన యిన్-యాంగ్ అంటే నీతి-అవినీతి, మంచి-చెడు, న్యాయం-అన్యాయం వంటి ద్వంద్వాలను ఆమె అస్తిత్వానికి అన్వయించుకునే అవకాశం లేకుండా కనిపించని ఆంక్షలు అమల్లో ఉండేవి. అందుకే ప్రాచీన కావ్యాల్లో కవులూ, రచయితలూ సృష్టించిన స్త్రీ పాత్రలు అయితే మచ్చలేని చందమామను తలపించే దేవతా మూర్తులుగానో లేదా దానికి పూర్తి విరుద్ధంగా మంత్ర తంత్రాలు నేర్చిన మంత్రగత్తెలూ, రాక్షసులుగానో చిత్రించబడేవి. డాంటే, గోథే, మిల్టన్ వంటివారు ఆద్యులుగా, పవిత్రమైన వర్జిన్ మొదలు గృహానికి పరిమితం చేసిన ఇల్లాలి వరకూ అన్ని కావ్యాల్లోనూ ఈ సంప్రదాయం చాలాకాలం కొనసాగింది.

ఇమ్మాన్యుయేల్ కాంట్ స్త్రీ తర్కాన్ని పూర్తిగా విస్మరించనప్పటికీ ఆమె హేతువాదం నైతిక, సామజిక వ్యవహారాల్లో పరిణతిలేనిదని నిర్ధారించారు. కాంటియన్ తత్వం స్త్రీ ఉనికిని కేవలం మగవాడిని పరిపూర్ణం చేసే దిశగా వివాహవ్యవస్థ ద్వారా మాత్రమే నిర్వచిస్తుంది. కాంట్ స్త్రీ పురుషుల వివాహాన్ని రెండు ప్రకృతుల మేళవింపుగా చూస్తారు. భావాన్ని స్త్రీత్వంగానూ; హేతువునూ, తర్కాన్నీ పురుషత్వంగానూ నిర్వచిస్తారు. ఈ కారణంగా మగవాడిని ఆదర్శవంతమైన నైతిక జీవనం దిశగా ప్రోత్సహిస్తూ, సహాయ సహకారాలందించే పాత్రకి మాత్రమే ఆమెను పరిమితం చేశారు.

ఈ కారణాల దృష్ట్యా అప్పుడప్పుడే రచనా వ్యాసంగంలో తొలి అడుగులు వెయ్యడం మొదలుపెట్టిన రచయిత్రులు సహజంగానే అనేక సవాళ్ళను ఎదుర్కోవలసి వచ్చింది. ప్రాచీన కాలం నుండీ ఏకపక్షంగా మగవారికి మార్గదర్శకత్వం చేస్తూ వచ్చిన 'వడ్డించిన విస్తరి' లాంటి కావ్యాలూ, గ్రంథాలూ రచయిత్రుల విషయంలో లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. అందువల్ల స్త్రీలు తమ రచనల ద్వారా పితృస్వామ్య సాహితీ సృజనలో రూపుదిద్దుకున్న మూస నుండి బయటపడి ప్రప్రథమంగా తమ ఉనికిని నిర్వచించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందువల్ల 1970ల తరువాత గానీ వారి రచనలకు గుర్తింపే దొరకలేదు. రాయడం మొదలుపెట్టిన తొలినాళ్ళలో తనకు ఏం రాయాలో, ఎలా రాయాలో ఒక పురుషుడి స్వరంలో ఉన్న అదృశ్యవాణి శాసిస్తున్నట్లు అనిపించేదంటారు ఇటాలియన్ రచయిత్రి ఎలెనా ఫెరాంటే. "అతడు నా సమ వయస్కుడో, లేదా నాకంటే వయసులో పెద్దవాడో నాకు తెలియదు. నేను రాయాలంటే అతడిలా ఆలోచించాలి, అతణ్ణి అనుకరించాలి. ఏకకాలంలో ఒక మగవాడిగానూ, మరికొన్నిసార్లు నా ఉనికిని కాపాడుకుంటూ ఒక స్త్రీగానూ కూడా ఆలోచించాలి" అంటారామె.

అమెరికన్ స్త్రీవాద తత్వవేత్త జుడిత్ బట్లర్ లాటిన్ అమెరికన్ స్త్రీవాద సిద్ధాంతాలలో 'స్త్రీ' అనే పదానికి నిర్వచనాలున్నాయనే ప్రతిపాదనలని సవాలు చేస్తూ, భాషలో స్త్రీపురుష నిర్వచనాలు ఆది నుంచీ లేవనీ, అది కేవలం పితృస్వామ్యపు సృష్టి అనీ కొట్టిపారేస్తారు. మరోవైపు ఫ్రెడ్రిక్ నీషే పురుషాధిక్య భావజాలంతో కూడిన మానసిక విశ్లేషణలు స్త్రీని అజమాయిషీ అవసరమైన ఒక పశువుగా చూడాలని నూరిపోస్తాయి. నీషే 'Thus Spoke Zarathustra' రచనలో ఒక పాత్ర "నువ్వు స్త్రీ దగ్గరకు వెళ్తున్నావా? అయితే నీ కొరడా తీసుకెళ్ళడం మర్చిపోకు" అంటుంది.

ఫ్రాయిడ్ సిద్ధాంతాలను సాహిత్యానికి అన్వయించిన విమర్శకులు హరాల్డ్ బ్లూమ్ సాహితీ చరిత్రను రాయడంలో తీవ్రమైన 'పితృస్వామ్యాన్ని' తన మోడల్‌గా చేసుకున్నారు. ఆయన కావ్యగతిని మగవాడైన కవికీ, అతడి కావ్యానికి ప్రేరణైన స్త్రీకీ మధ్య సంభోగంగా చూస్తారు. ఈ స్థితిలో కావ్యంలో కవయిత్రి స్థానం ఎక్కడన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కవయిత్రిగా ఆమె ఎవరిని ఆదర్శంగా తీసుకోవాలి? ప్రేరణది ఏ లింగం? హరాల్డ్ బ్లూమ్‌ని చదివిన ఏ స్త్రీలోనైనా తలెత్తే ప్రశ్నలు ఇవే.

నిజానికి బ్లూమ్ మోడల్‌ను ఆదర్శంగా తీసుకుంటే ఆయన ప్రతిపాదించిన "Anxiety of influence" ప్రభావం రచయితలపై ఉన్నంతగా రచయిత్రులపై ఉండదంటారు విమర్శకురాలు సాండ్రా గిల్బర్ట్. ఎందుకంటే వెనక్కి తిరిగి చూసుకుంటే వారిపై ప్రభావం చూపించడానికి వారికొక మోడల్ అంటూ లేదు. 19వ శతాబ్దంలో కాస్త ఆలోచనగల ఏ స్త్రీనయినా ప్రకృతి విరుద్ధంగా వ్యవహరించే మానసిక రోగిగా ముద్రవేసేవారు. ఈ కారణంగా ఆ కాలపు రచయిత్రులు "Anxiety of authorship"తో బాధపడ్డారంటారు సాండ్రా. ప్రాచీన కావ్యాల్లో స్త్రీ ఉనికే సందిగ్ధంలో ఉంది గనుక రాయడం తన వల్ల కాదనీ, తనలో సృజనాత్మకత లేదనీ భావించేదామె. నిజానికి ఆమె సంఘర్షణ పితృస్వామ్య రచనల్లోని ప్రపంచంతో కాదు. కవి కలం నుండి జీవం పోసుకున్న ఆమె మూర్తితో. మాక్బెత్‌ను కథానాయకుడిగా చూపి లేడీ మాక్బెత్‌ను ఒక దిగజారిన స్త్రీగా అభివర్ణిస్తారు, అలాగే ఒడిపస్‌ను కథానాయకుడిగానూ, మెడియాను ఒక మంత్రగత్తెగానూ చూపిస్తారు. ఇకపోతే కింగ్ లియర్ పిచ్చితనం అతడి వ్యక్తిత్వానికి వన్నెతెచ్చే ఒక గొప్ప విషయమైతే ఒఫీలియా పిచ్చితనం కడుదుర్భరం అన్నట్లు వర్ణిస్తారు. ఏకపక్షంగా ఇలాంటి వర్ణనలు చేసే అతడి చేతుల్లో నుండి కలం లాక్కుని తన గురించి చెప్పే అధికారం అతడికి ఇవ్వకుండా తన సాధికారతను చాటుకోవాలంటే స్త్రీ సమాజంలో తన ఉనికిని మళ్ళీ సరికొత్తగా నిర్వచించుకోవాలి. వర్జినియా వూల్ఫ్ తన 'A Room of One's Own' రచనలో షేక్స్పియర్ సోదరి జుడిత్ పాత్రను సృష్టిస్తూ, 16వ శతాబ్దంలో ప్రత్యేకమైన నైపుణ్యం, సృజనాత్మకతతో పుట్టిన ఏ స్త్రీకి అయినా పిచ్చిపట్టడం ఖాయం అంటారు.

ప్రాచీన కాలం నుండీ స్త్రీలను కళారంగానికి దూరంగా ఉంచిన అంశాలపై 19వ శతాబ్దం తరువాత స్త్రీవాద తత్వవేత్తలు దృష్టి సారించారు- సృజన విషయంలో మగవారిని దైనందిన జీవితానికి సంబంధించిన బాధ్యతల నుండి విరమింపచేయడం... [as printed: "వి ఎనహాయించడంతో"] వారికి స్వేచ్ఛగా రచనావ్యాసంగాన్ని కొనసాగించే సౌకర్యం (మేల్ ప్రివిలేజ్) ఉండేదనీ, రచయిత్రులకు ఆ అవకాశం లేదనీ వారు అంటారు. ఎమిలీ డికిన్సన్, సిల్వియా ప్లాత్, జేన్ ఆస్టెన్, బ్రోన్టే సిస్టర్స్ వంటి ప్రముఖ రచయిత్రులు సైతం దీనికి మినహాయింపు కాదు. సాహితీ విమర్శకుడు హరాల్డ్ బ్లూమ్ సైతం కవిత్వ ప్రేరణను 'తండ్రీ కొడుకుల బంధం'గా అభివర్ణించారు. ("from the sons of Homer to the sons of Ben Jonson, poetic influence [has] been described as a filial relationship") ఆయన యావత్ సాహితీ ప్రస్థానాన్ని ఇరువురు అత్యంత శక్తిమంతమైన సరిసమాన వ్యక్తుల మధ్య పోరుగా, అనగా తండ్రీకొడుకుల పోరుగా చూస్తారు.

ఎంత పిడికిట్లో బిగించి అదుపులో పెట్టాలని ప్రయత్నించినా ఈడెన్ సాక్షిగా ఈ కథలన్నీ ఏదో ఒక సమయంలో రచయిత మునివేళ్ళ నుండి తప్పనిసరిగా జారుకుంటాయి. స్త్రీని ఒక జీవమున్న ప్రాణిగా కాక కేవలం ఒక ఇమేజికి కుదించిన ప్రాచీన కావ్యాలను యథాతథంగా అంగీకరించడం ముందుముందు వీలుపడదు. అదే సమయంలో మిల్టన్, డాంటే, కీట్స్ మొదలు హాప్కిన్స్, బ్లేక్, ఈట్స్, ఇలియట్ వరకూ వేల సంవత్సరాల పాశ్చాత్య సాహిత్యాన్ని ఉన్నపళంగా విస్మరించడమూ సరికాదు. తరతరాల సంస్కృతిని పరిరక్షించుకోవలసిన బాధ్యత స్త్రీపురుష భేదం లేకుండా మనందరిపైనా ఉంది. కానీ అసలు చిక్కంతా ఆ సాహిత్యాన్ని నిస్సంశయంగా, నిర్ద్వంద్వంగా అంగీకరించాలీ అనుకోవడంలోనే ఉంది. సరిగ్గా ఇక్కడే సాహిత్యంలో స్త్రీవాదులూ, విమర్శకుల అవసరం కనిపిస్తుంది. కేవలం నాణానికి ఒక వైపు కథనే చెబుతూ రెండోవైపు కథను ఉద్దేశ్యపూర్వకంగా చెప్పకుండా వదిలేసిన ప్రాచీన సాహిత్యాన్ని తీసిపారేసే బదులు ఆ చరిత్రను తిరగరాయవలసిన అవసరం ఉంది. ఆ రెండో పార్శ్వం మానవజాతిలో సగమైన స్త్రీల జీవితాలు. అందువల్ల సాహితీసంస్కృతిని పునర్నిర్మించాలి, పునఃసృజించాలి, పునరాలోచించాలి, పునర్లిఖించాలి, పునఃవిశ్లేషించాలి. ఈ మార్పు తీసుకురావాలంటే భాష నుండి మొదలుపెట్టాలి. మూలగ్రంథాల నుండీ ప్రక్షాళన జరగాలి.



> రాయడం మొదలుపెట్టిన తొలినాళ్ళలో తనకు ఏం రాయాలో, ఎలా రాయాలో ఒక పురుషుడి స్వరంలో ఉన్న అదృశ్యవాణి శాసిస్తున్నట్లు అనిపించేదంటారు ఇటాలియన్ రచయిత్రి ఎలెనా ఫెరాంటే. "అతడు నా సమ వయస్కుడో, లేదా నాకంటే వయసులో పెద్దవాడో నాకు తెలియదు. నేను రాయాలంటే అతడిలా ఆలోచించాలి, అతణ్ణి అనుకరించాలి. ఏకకాలంలో ఒక మగవాడిగానూ, మరికొన్నిసార్లు నా ఉనికిని కాపాడుకుంటూ ఒక స్త్రీగానూ కూడా ఆలోచించాలి" అంటారామె.

గాలిలా కంటికి కనిపించని లింగవివక్షను ఎదుర్కొంటూ, మౌనాన్ని ఛేదిస్తూ ఆ కాలంలో కూడా ఎమిలీ డికిన్సన్, సిల్వియా ప్లాత్, అన్నే సెక్స్టన్, వర్జీనియా వూల్ఫ్ వంటి రచయిత్రులు అనేక రచనలు చేశారు. ఈ కారణంగా పురుషాధిక్యత, లింగవివక్షకు సంబంధించిన వైరుధ్యాలు ముఖ్యంగా 19వ శతాబ్దపు తొలినాళ్ళలో స్త్రీ పురుష అస్తిత్వవాద రచనలన్నిటిలోనూ స్పష్టంగా కనిపించేవి. 'మేల్ టెక్స్ట్' బంధనాల్ని తెంచుకుంటూ అరోరా లీ, మేరీ ఎలిజబెత్ కాలేరిడ్జ్ వంటి స్త్రీలు కొన్నిసార్లు వారికి ఆపాదించిన ద్వంద్వ ప్రవృత్తులైన దేవతగానూ, మరి కొన్నిసార్లు రాక్షసిగానూ మార్చి మార్చి తమ ఉనికిని నిర్వచించుకోవడం మొదలుపెట్టారు.

ఈ దిశగా పరిశోధనలు చేస్తూ 'ది మాడ్ వుమన్ ఇన్ ది అటిక్' పేరిట రాసిన వ్యాసాల్లో స్త్రీవాద సాహిత్య విమర్శకులు సాండ్రా గిల్బర్ట్, సుసాన్ గుబార్‌లు కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెలుగులోకి తీసుకొచ్చారు. 'Anxieties of authorship'తో కష్టపడుతున్న రచయిత్రులు రచనా వ్యాసంగం వైపు వెళ్ళే ముందు మగవారు తయారుచేసిన 'ఆమెలోని ఆదర్శ మూర్తి'ని చంపాలని తీర్మానిస్తారు వర్జీనియా వూల్ఫ్. అంటే స్త్రీ ఉనికిని సాహిత్యంలో లేకుండా చేసిన పితృస్వామ్యం కొలమానంగా పెట్టిన 'స్త్రీ ఎస్తెటిక్ ఐడియల్'ను నాశనం చెయ్యాలి. అలాగే ఆమె ప్రత్యర్థిగా తయారుచేసిన ఆమెలోని 'రాక్షసి'ని పోలిన ప్రతిమని కూడా నాశనం చెయ్యాలి. అలా చెయ్యాలంటే ముందు వాటి మూలాలెక్కడున్నాయో తెలుసుకుని వాటి పూర్వాపరాలు అర్థం చేసుకోవాలి. అందుకు స్త్రీల రచనల్ని చదవాలి, వాటిలోని స్త్రీవాద తత్వాన్ని లోతుగా పరిశీలించాలి. పాశ్చాత్య సాహిత్యాన్ని పునర్విమర్శిస్తూ వర్జీనియా వూల్ఫ్- పితృస్వామ్య చరిత్రను శిలాశాసనాల్లా పదేపదే పునర్లిఖించే బదులు, చరిత్ర చెప్పకుండా వదిలేసిన కథల్నీ, కొత్త కథల్నీ చెప్పుకోవలసిన అవసరం ఉందంటారు. స్త్రీల విషయంలో ఈ 'సాంస్కృతిక పరాయీకరణ'కు కారణాలను స్త్రీవాదులూ, విమర్శకులూ ఇప్పటికీ పరిశోధిస్తూనే ఉన్నారు.

ఇక సమకాలీన స్త్రీవాద విమర్శ విషయానికొస్తే మార్గరెట్ అట్వుడ్, ఎలెనా ఫెరాంటే, జాడీ స్మిత్, ఝుంపా లహిరి, చిమమంద అడిచి వంటి ప్రామాణికత కలిగిన అతికొద్ది స్త్రీవాద రచయిత్రులను మినహాయిస్తే అమెరికన్ రచయిత్రి రెబెక్కా సోల్నిట్ వంటి కొందరు స్త్రీవాదానికి ఫ్యాషన్ ఐకాన్స్‌గా చెలామణి అవుతున్నారు. నిజానికి రెబెక్కా వంటి స్త్రీవాదులు 'స్త్రీ మౌనం' గురించి ఉటంకించే అనేక విషయాలు స్త్రీవాదానికి కొత్తగా కలిపినదేమీ లేదు. అవన్నీ Maya Angelou, Adrienne Rich, Cynthia Ozick, Simone de Beauvoir, Allison Bechdel లాంటి మునుపటి తరం స్త్రీవాదులు అనేక రచనల్లో చెప్పినవే. కానీ కాస్త లోతుగా పరిశీలిస్తే బహుశా స్త్రీవాదుల స్వరాలు చేరాల్సిన చెవులకు చేరకపోవడం వల్ల చెప్పినదాన్నే మళ్ళీ మళ్ళీ చెప్పడం తప్పనిసరి అయిపోయిందేమో అనిపిస్తుంది.

ఏదేమైనా లింగవివక్షపై అవగాహన వచ్చినంత తేలిగ్గా రచయిత్రులకు సాహితీ సంస్కృతిని పునర్లిఖించడం సాధ్యం కాలేదంటారు సాండ్రా గిల్బర్ట్, గాయత్రి స్పివాక్ వంటి విమర్శకులు. ఈ క్రమంలో మరోరకమైన వివక్షలు వివిధ రూపాల్లో అవరోధాలుగా తయారయ్యాయి. నిజానికి ఎక్కువమంది రచయితలు స్త్రీవాద సదస్సులకు వెళ్ళడానికి ఆసక్తి చూపరు. స్త్రీల రచనల్ని గానీ, వారి వ్యాసాలను గానీ చదవరు. ఇటువంటి వివక్షలో కూడా పలురకాలుంటాయి. మొదటి రకపు వివక్ష సాహిత్యానికి ఎంతమాత్రమూ సంబంధంలేని వారి నుంచి ఎదురవుతుంది. సుమారు 50-60 శాతం ఉండే వీరిలో చాలామంది స్త్రీవాదాన్ని వినరు, చదవరు. కొంతమంది మాకెందుకొచ్చిందని విసుగ్గా ఆవలిస్తారు, మరికొంతమంది అజ్ఞానం నటిస్తారు. వీళ్ళంతా స్త్రీవాద సాహిత్య విమర్శను ఉద్దేశ్యపూర్వకంగా తిరస్కరిస్తారు. ఇక స్త్రీవాద విమర్శపై రెండో రకమైన తిరస్కరణ వివక్ష లేదని అంటూ విపరీతమైన ఆశావహదృక్పథాన్ని అవలంబించే పండితవర్గం నుంచి ఎదురవుతుంది. వీరు ప్రతీ సాహితీ విభాగంలోనూ ఒక స్త్రీవాది ఉంటే చాలనుకునే వర్గం. ఇక స్త్రీవాద విమర్శకు మూడో తరహా తిరస్కరణ ప్రత్యక్ష శత్రుత్వం ద్వారా జరుగుతుంది. చాలాసార్లు శత్రుత్వాన్ని బాహాటంగా ప్రదర్శించడానికి రచయితలు ఇష్టపడకపోయినా రచయిత్రులు ఏ మాత్రం మొహమాటపడకుండా తమ వ్యతిరేకతనూ, తిరస్కారాన్నీ ప్రదర్శిస్తారు. ఈ శత్రుత్వం వెనుక పితృస్వామ్య మూలాలుంటాయి. ఏదేమైనా "స్త్రీవాదులు గళం విప్పడం అన్ని చారిత్రక మూలాల్నీ సమూలంగా పెకలించివేస్తుంది" అనేది కేవలం ఒక మెటఫోర్‌గా చూడడం వరకే బావుంటుంది. స్త్రీవాదం వినాశనాన్ని కోరదు, ఎటువంటి వివక్షలకూ తావులేని సమాజాన్ని నిర్మించే దిశగానే ప్రయాణిస్తుంది. అందువల్ల స్త్రీవాద ఉద్యమాన్ని విచ్ఛేదనంగా చూడడం కంటే పునర్నిర్మించడంగా చూడాల్సిన అవసరం ఉంది.

గాయత్రి చక్రవర్తి స్పివాక్ అనేక రచనలను విశ్లేషించడానికి ఉపయోగించిన డెరిడా ప్రతిపాదించిన 'డీ కన్‌స్ట్రక్షన్ ప్రిన్సిపల్'ని స్త్రీ ఉనికిని పునఃనిర్వచించే దిశగా మన ప్రాచీన సాహిత్యం మొదలు సమకాలీన సాహిత్యం వరకూ వర్తింపజేయాలి. స్త్రీ అస్తిత్వాన్ని ఇప్పటి తూకపురాళ్ళతో మరోసారి తూచాలి. ఈ క్రమంలో స్త్రీవాద సాహిత్య విమర్శకుల అవసరం మునుపటి కంటే ఇప్పుడు మరింత ఎక్కువ ఉంది. అస్తిత్వం చాటుకునే దిశగా సంకెళ్ళు తెంచుకుంటూ మొదలైన స్త్రీవాద ఉద్యమం క్రమేపీ ఆధిపత్యపోరులోకి దిగకూడదని ఆశిద్దాం. స్వాతంత్ర్యం కోసం చేసే ప్రతీ పోరాటమూ గెలుపు దిశగా అడుగులు వేయిస్తుంది, కానీ ఆధిపత్యం కోసం చేసే ప్రతీ పోరాటంలోనూ కేవలం వినాశనమే మిగులుతుంది. స్వేచ్ఛనూ, సమానత్వాన్నీ మాత్రమే సాధించే దిశగా స్త్రీవాదం తన సాధికారతను చాటుకుంటుందని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

(ఈ వ్యాస రచనకు సాండ్రా గిల్బర్ట్, సుసాన్ గుబార్, ఎలెనా ఫెరాంటే, వర్జీనియా వూల్ఫ్, గాయత్రి స్పివాక్‌ల పలు రచనలు సాయ పడ్డాయి.)

నాగిని కందాళ
nagini.kandala@gmail.com

బొమ్మలు: అక్బర్

హైకు



రాలుతున్న తుహిన కణాలతో
ఈ నశ్వర ప్రపంచం -
కడగాలని వుంది
బషో (జపాన్)



పుట్టగానే స్నానం
చావగానే స్నానం -
ఎంత మూర్ఖం
ఇస్సా (జపాన్)



హేమంత రాత్రి -
సాలెపురుగును చంపాక
నేనెంత ఏకాకిని
షికి (జపాన్)



సముద్ర తీరంలో
తలతిప్పి చూస్తే -
నా పాదముద్రలేవీ లేవు
హొసయ్ ఒజకి (జపాన్)



ఖాళీ రేవులో
చంద్రునితో -
నౌక మౌన సంభాషణ
చక్ బ్రిక్లీ (అమెరికా)



వేసవి రాత్రి
దీపాలన్నీ ఆర్పేసాం -
వర్షపుసడి వినడానికి
పెన్నీ హర్టర్ (అమెరికా)



ఆస్పత్రి కిటికీల గుండా
నొప్పి మాయమౌతోంది -
చెర్రీలు వికసిస్తూ
అమితవదాస్ గుప్తా (ఇండియా)



ఆలయ శిథిలాలు -
గాలి మాత్రమే ఇంకా
పూలు సమర్పిస్తోంది.
రోహిణీ గుప్తా (ఇండియా)



కరెంటు కోత -
ఈ రోజు
పక్షుల కిలకిలలు విన్నాను
- ఉషా కిరణ్ (ఇండియా)



జైలులో కవి -
అక్కడున్నది అతని నీడే..
అతనున్నది ప్రజల మధ్య
- అజిమ్ విన్నా (మెసడోనియా)

అనువాదం: పి. శ్రీనివాస్ గౌడ్
99494 29449

'కవిత్వ సౌరభం' కవి సమ్మేళనం

తెలంగాణ సాహితీ సమాఖ్య నిర్వహణలో 'కవిత్వ సౌరభం' శీర్షికన కవిసమ్మేళనం జనవరి 1 మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఇరవై మంది ప్రముఖ కవులు పాల్గొంటున్న ఈ కవి సమ్మేళనంలో అతిథులుగా దేశపతి శ్రీనివాస్, కొప్పర్తి, కాంచనపల్లి గోవర్ధన్ రాజు, ఏనుగు నరసింహారెడ్డి, వాజల శివకుమార్, వేముగంటి మురళి పాల్గొంటారు.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

'నెవర్ ఎండ్ - వీరులకు మరణం లేదు'

తెలంగాణలో గత నలభై ఏళ్లుగా యువజనోద్యమంలో ప్రాణత్యాగం చేసి అమరులైన విస్మృత వీరుల చరిత్రను రాష్ట్ర వ్యాప్తంగా 822 కిలోమీటర్లు మోటారు సైకిల్ యాత్ర చేసి వెలికితీసి ఎం. విప్లవకుమార్, ఎ. విజయ్ కుమార్ రాసిన పుస్తకం 'నెవర్ ఎండ్ - వీరులకు మరణం లేదు' ఆవిష్కరణ సభ జనవరి 5 మధ్యాహ్నం 2 గంటలకు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్‌లో జరుగుతుంది. పుస్తకాన్ని ప్రజాకవి జయరాజ్ ఆవిష్కరిస్తారు. సభలో జయరాజ్, భూపతి వెంకటేశ్వర్లు, ఎ. నర్సిరెడ్డి, యాకూబ్, చింతల యాదగిరి, పసునూరి రవీందర్, తగుళ్ళ గోపాల్, ఆనగంటి వెంకటేష్, దాసరి యువరాణి, సాత్విక నన్నెబోయిన పాల్గొంటారు. వివరాలకు: 9573715656.

ఎ. విజయ్ కుమార్

'మాయని గాయాల నెత్తుటి చరిత్ర'

లక్ష్మణ్ రచించిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' (యదార్థ సంఘటనల సమాహారం) పుస్తకావిష్కరణ జనవరి 6 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో అన్నవరం దేవేందర్, ఘంటా చక్రపాణి, వి. ప్రకాష్, నారదాసు లక్ష్మణ్ రావు, ఎస్కే. జకీర్, వెల్దండి శ్రీధర్ పాల్గొంటారు.

సాహితీ సోపతి

'సముద్రం'పై కథల పోటీ

విశాలాక్షి సాహిత్య మాస పత్రిక ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారకంగా 'సముద్రం' అంశంపై నిర్వహించే కథల పోటీకి ప్రథమ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు రూ.3వేలు, తృతీయ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు రూ.2వేలు బహుమతులు ఉంటాయి. సాధారణ ప్రచురణకు ఎన్నికైన ప్రతి కథకు వెయ్యి రూపాయల బహుమతి ఉంటుంది. ఈ కథలతో ప్రత్యేక కథా సంపుటి వెలువడుతుంది. కథలను జనవరి 20లోపు విశాలాక్షి సాహిత్య మాస పత్రిక, 27-5-487, పద్మావతి నగర్, బాలాజీ నగర్ ఎక్స్‌టెన్షన్, నెల్లూరు 524002, ఫోన్: 94405 29785కు పంపాలి.

ఈతకోట సుబ్బారావు


కొండను ఏమార్చే 'మార్కెట్'పై కథలు ఎక్కుపెట్టాడు!

గిరిజన ప్రాంతాలు ధన సముపార్జనకు పనికొచ్చే ప్రాంతాలు. అక్కడ దొరికే ఖనిజ సంపద నుంచి అటవీ కలప వరకు ప్రతీది మైదాన ప్రాంత 'అభివృద్ధి'కి కీలకం. అందుకే గిరిజన ప్రాంతాల్లోకి చొచ్చుకుపోయే ప్రయత్నంలో మైదాన ప్రాంతం, ప్రభుత్వాలు ఒక నూతన పరిభాషను సృష్టిస్తాయి. 'అటవీ పరిరక్షణ' అనీ, గిరిజనులకు నాగరికత నేర్పాలనీ, వారివి మూఢనమ్మకాలనీ... ఇలాంటి పరిభాషను వాడతాయి. ఈ పరిభాష గిరిజనులపై మైదాన ప్రాంతీయుల సాంస్కృతిక దాడిగా పనిచేస్తూనే కొండపై పెట్టుబడి చొచ్చుకుపోవడానికి వీలు కలిగించే భావజాలాన్ని విస్తరింప చేస్తుంది. అయితే ఈ లోగుట్టును విప్పి చెప్పాల్సినవి కళా రూపాలే. అందులోనూ ముఖ్యంగా సాహిత్యమే!

గూడూరు రాజేంద్రరావు (చెంచు) మొదలుకొని సువర్ణముఖి వరకు ఈ లోగుట్టును విప్పుతూ ఆదివాసీల వెతలను సహానుభూతితో కథలుగా అల్లిన తెలుగు రచయితలు ఎందరో ఉన్నారు. అయితే వీరందరూ గిరిజనేతరులే. దెబ్బతిన్నవాడే నొప్పిని నిజాయితీగా చెప్పగలడు. ఇలాంటి సందర్భంలో ఒక గిరిజనుడు తన అనుభవాలను, తన సంస్కృతిపై జరుగుతున్న దాడిని అధ్యయనం ద్వారా ఎఱుక పరచుకొని, వాటి గురించి సృజన చేయడం మొదలుపెట్టాడు. అతడే తెలుగు సాహిత్యంలో తొలి ఆదివాసీ రచయితగా చెప్పబడుతున్న మల్లిపురం జగదీష్.

మల్లిపురం జగదీష్ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఇప్పటి వరకు 28 కథలను వెలువరించాడు. అవి 'గాయం', 'శిలకోల', 'గురి' అనే సంపుటాలుగా వచ్చి పాఠకుల ఆదరణను చూరగొన్నాయి. ఈ కథల ఇతివృత్తాలు మైదానప్రాంతం కొండపై చేస్తున్న సాంస్కృతిక దాడికి ప్రతిఫలనాలే.









నిజమైన కొండ సంస్కృతిని తన కథలలో బలంగా చూపించాడు జగదీష్. ప్రకృతితో, వన్యప్రాణులతో సామరస్య వాతావరణంలో కలసి జీవిస్తున్న జన సమూహం గిరిజనులు. అందుకే వీరి ప్రతీ పండుగా, ప్రతీ సాంప్రదాయం ప్రకృతితోనే ముడిపడి ఉంటాయి. "విత్తనం నాటితే పండుగ. మొలకెత్తితే పండుగ. పూత పూస్తే పండగ. కోత కోస్తే పండుగ. ఎంత గొప్ప సంస్కృతి!" ('గాయం'); "ఊరంటే సంబరం, నలుగురు కలిసే ఉత్సవం. ఊరంటే గుగ్గిలం పొగ. ఊరంటే ఎజ్జోడి మంత్రం. ఊరంటే కొత్తల సంబరం. ఊరంటే సన్నాయి, పిన్నలగ్గ్రల గానం. ఊరంటే తుడుం డప్పుల హోరు" ('అడవితనం')... ఇలా ప్రతీ సందర్భాన్ని ఉత్సాహవంతం చేసుకుంటున్న గిరిజనుల ప్రతీ సంబరాన్ని సందర్భానుసారం తన కథల ద్వారా పాఠకలోకానికి అందించాడు జగదీష్.

కొన్ని వేల సంవత్సరాల నుంచి కొండల మీద కొనసాగుతున్న ఈ సందడి, సమిష్టి జీవనం గత కొన్ని దశాబ్దాలుగా నిర్వీర్యమౌతుంది. దీనికి కారణం కొండ జీవనానికి వ్యతిరేకమైన మతాలు కొండకు చేరుకొని, వారిని సమిష్టి జీవనానికి దూరం చేస్తున్నాయి. ఈ స్థితిని 'నా పేరు సొంబరా', 'గాయం' కథలలో చాలా ఆర్తితో చిత్రించాడు రచయిత. పల్లపు మతాలు, ముఖ్యంగా క్రైస్తవ మతం, కొండకు చేరుకొని ఆదివాసీల నిజమైన అస్తిత్వాన్ని నాశనం చేసి "చినుకురాలని చీకటి కొండలుగా" తయారు చేశాయని, తరతరాల కొండ సాంప్రదాయాలను మూఢనమ్మకాల పేరుతో కొట్టిపారేసి, వాళ్ళ నమ్మకాలను హేళన చేశాయని వాపోతున్నాడు రచయిత. అలాగని తాము హిందూ మతానికి కూడా దూరమని, తాము ఏ మతానికి సంబంధించినవారము కాదని, మా ఆచారాలన్నీ మా జీవన విధానానికి అలవాటైనవనీ చెబుతున్నాడు.

> అడవికి దూరమైనా అడవితనాన్ని విడిచిపెట్టకుండా, తన మూలాలను కాపాడుకోవాలనే ఆలోచనను తన తరువాత తరానికి బలంగా తన కథల ద్వారా దిశా నిర్దేశం చేస్తున్నాడు మల్లిపురం జగదీశ్. వాళ్ళ జీవితాల్లోంచే వచ్చిన రచయితగా ఆదివాసీలు ఏమి కోల్పోతున్నారో, వాళ్ళ నిజమైన సంస్కృతి ఏంటో లోకానికి ఎఱుకపరచడానికి కథా ప్రక్రియను ఎంచుకున్నాడు.

అలాగే మార్కెట్ మేఘాలు అన్ని ప్రాంతాలను కమ్మినట్టే కొండను కూడా చుట్టుముట్టేశాయి. కొండలో జరిగే ప్రతీ మార్పుకీ కూడా పెట్టుబడి ప్రయోజనం ఖచ్చితంగా ఉంటుంది. దీని వలలో పడి గిలగిలా కొట్టుకుంటున్నాడు గిరిజనుడు. దీనిని సూక్ష్మంగా పరిశీలించి తన కథలలో చూపించాడు రచయిత. మార్కెట్‌ను ఈ రచయిత సిందవతో పోలుస్తాడు. "పులైతే.. వేటాడి తినేస్తుంది దానికాకలేస్తే, సిందవ అలాగ కాదు నక్కబుద్ధులున్న పులి, మాటు కాస్తుంది, అవసరమైతే చీకట్లో దాక్కుంటుంది, జడదు, అదును చూసి దొంగదెబ్బ తీసి కావల్సింది ఎత్తుకుపోతుంది." అలాంటి సిందవను కూడా తమ సమిష్టి జీవనంతో ఎదిరిస్తారు గిరిజనులు. కానీ మార్కెట్ సిందవ నుంచి తప్పించుకోలేకపోతున్నారని మార్కెట్ కొండను ఎలా ఏమార్చిందో తన కతలలో చూపించాడు.

"యువకులు తూలుతూ... పాన్‌పరాగ్‌లు, ఖైనీలు నములుతూ, వూరి జనం గడపల్లో రంగుల టీవీ సెట్ల ముందు... సీరియళ్ళ ప్రవాహంలో కొట్టుకుపోవడం లేదూ! వ్యాపార ప్రకటనల హోరులో లైవ్ క్రికెట్ మ్యాచ్‌ల్లో మునిగిపోయి, డాన్స్ షోలతో ఇళ్ళన్నీ వెలిగిపోతూ, జనం కునుకు తీస్తూ నిర్జీవంగా లేరూ! గడపల్లో కొన్ని గుంపులు పేకాట ప్రపంచంలో పడి..." ('కళ్ళం'). మార్కెట్ కొండకు కొత్త కొత్త అవసరాలు నేర్పింది. వాటిని నెరవేర్చుకోవడానికి ఫైనాన్స్ కంపెనీలను చేరారు. ఒకప్పుడు షావుకార్లకు వస్తువుల రూపంలో ఇన్‌స్టాల్‌మెంట్ కట్టేవారు. ఇప్పుడు ఫైనాన్స్ కంపెనీలకు కడుతున్నారు.

చదువుకొని అర్హతకు తగిన ఉద్యోగాన్ని సంపాదించుకున్న గిరిజనులు పట్నాలకు వచ్చి, నాగరిక మానవుడిగా మారి, తనలో సహజంగా ఉన్న సున్నితత్వాన్ని, నిజమైన అడవితనాన్ని కోల్పోతున్నాడనే ఆవేదనను తన కథలలో బలంగా చూపించాడు రచయిత. "నేస్తరికం చెయ్యడం... ఆశ్రయమివ్వడం... ఓదార్పునివ్వడం..." ఇవి అడవితనం లక్షణాలు. నాగరికత పేరుతో అభివృద్ధి మోజులోపడి వీటినిప్పుడు కోల్పోతున్నారనే ఆవేదన రచయితలో అడుగడుగునా కనిపిస్తుంది. అలాగే ఆడపిల్లలు సగం సగం చదువులతో, మైదాన ప్రాంత మాయలలో పడి జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్న స్థితి, వీళ్ళ రిజర్వేషన్‌లను వాడుకొని రాజకీయ పదవులు కూడా పొందుతున్న మైదాన ప్రాంత మోసాలు 'ఇప్పపూలు', 'శిలకోల' కథలలో మనకు కనిపిస్తాయి.

ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమం కోసం కొన్ని పథకాలు ప్రవేశ పెట్టడం, గిరిజనులకు ఏమికావాలో అవి కాకుండా, ఆఫీసర్లకు ఏది మంచిదనిపిస్తే అదే సంక్షేమ పథకంగా పెట్టడాన్ని రచయిత ఆక్షేపిస్తాడు. ఈ క్రమంలో గిరిజనులను, నాగరిక లక్షణాలు అలవరుచుకున్న సాటి గిరిజనులే మోసం చేయడాన్ని తన కథలలో చూపించాడు. 'పొరలు' కథలో ప్రభుత్వాధికారులు గిరిజనులను ఎలా మోసం చేస్తారో చెబితే, 'దారి' కథలో గిరిజనుడే రాజకీయ నాయకుడయ్యాక సాటి గిరిజనుల సబ్సిడీలను ఎలా దోచుకుంటున్నాడో నిర్మొహమాటంగా చెప్పాడు. అలాగే ఈ మధ్య కాలంలో కొండను బాగా ఆవరించిన మూఢాచారం 'సిల్లంగి' అనీ ఇది ప్రబలంగా పెరుగుతుందనే ఆవేదన రచయిత కథలలో మనకు కనిపిస్తుంది. ఇన్ని అవలక్షణాలు కొండను ఆవరించినా మరలా సమిష్టి తత్వం వస్తుందనే ఆశ రచయితలో బలంగా కనిపిస్తుంది. షావుకారుని నమ్మి మోసపోయిన సిరిమెల తన భూమిని ఊరంతా కలసి సవిఎప్పిగా వ్యవసాయం చేసుకోమని చెబుతుంది. ఊరు కూడా దానికి అంగీకరించడం 'కళ్ళం' కథలో మనకు కనిపిస్తుంది. అలాగే 'గురి' కథలో పెట్టుబడిని వ్యతిరేకించాలంటే జనాలందరినీ సంఘటితం చేసే అధ్యయనం అవసరం అనీ, ఆ దిశగా కొత్త తరం సిద్ధమౌతుందనే ఆశను వ్యక్తపరుస్తాడు.

అడవికి దూరమైనా అడవితనాన్ని విడిచిపెట్టకుండా, తన మూలాలను కాపాడుకోవాలనే ఆలోచనను తన తరువాతి తరానికి బలంగా తన కథల ద్వారా అందిస్తున్నాడు మల్లిపురం జగదీశ్. వాళ్ళ జీవితాల్లోంచే వచ్చిన రచయితగా ఆదివాసీలు ఏమి కోల్పోతున్నారో, వాళ్ళ నిజమైన సంస్కృతి ఏంటో లోకానికి ఎఱుక పరచడానికి కథా ప్రక్రియను ఎంచుకున్నాడు. పాఠకుడిని ఉత్సుకతతో కథలోకి తీసుకువెళ్ళడమే కాకుండా, ఉత్కంఠతో చదివించడం, కొత్త కొత్త ప్రయోగాలను కథలోకి తీసుకురావడం, నిజాయితీగా కథను చెప్పడం ఈ రచయిత బలాలు.

ఆల్తి మోహన రావు
99638 95636



సమ తరంగాద్వైతం

ఒకరు
కళ్ళు తెరచి ఓ దృశ్యం చూస్తారు
కాదు కాదు దర్శిస్తారు
అది
మనసులో ఇంకే దాకా
కనులు మూస్తారు
తర్వాతే
కాగితమ్మీద తెరచుకుంటారు

ఒకరు
కళ్ళు తెరచి దాన్ని చదువుతారు
తన మనసులో
అది ఇంకే దాకా
కనులు మూస్తారు

కవి పాదాలు రాస్తూ
ఓ రాస్తా వేస్తే
చదువరి తెరువరై
ఆ దారిని పవిత్రం చేస్తాడు

నలిమెల భాస్కర్



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- జోరుగా కొత్త సంవత్సరం వేడుకలు
- కేకుల కటింగ్... స్వీట్ల పంపిణీ..
- న్యూయర్ సందేశాలతో హోరెత్తిన సెల్‌ఫోన్లు
- పోలీసుల నిఘాతో నిర్మానుష్యంగా రోడ్లు
- అడుగడుగునా తనిఖీలు

7



ఆశల పల్లకిలో..

- ఈ కొత్త సంవత్సరం శుభాలు జరిగేనా?
- జాబ్ క్యాలెండర్ వైపు నిరుద్యోగుల చూపు
- సంక్షేమ పథకాలపై ప్రజల కొత్త ఆశలు
- ఉమ్మడి జిల్లా అభివృద్ధి పరుగులు పెట్టేనా?
- పెండింగ్ పనులు పూర్తయ్యేనా ?

7లో..

జాతరను విజయవంతం చేయాలి

- ఐనవోలు మల్లన్న ఆలయ అభివృద్ధికి పెద్దపీట
- ఆలయాల మాన్యాలు అన్యాక్రాంతం కాకుండా చూస్తాం..
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

8

ఎంజీఎం ఆస్పత్రిని ప్రక్షాళన చేస్తాం..

- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

వివరాలు : 7లో..

అజరా హాస్పిటల్‌లో హెల్త్ చెకప్ క్యాంపెయిన్ ప్రారంభం

హనుమకొండ అర్బన్, డిసెంబరు 31: అజరా హాస్పిటల్‌లో హెల్త్ చెకప్ క్యాంపెయిన్ ప్రారంభమైంది. జనవరి 1వ తేదీ నుంచి 31 వరకు ప్రివెంటివ్ హెల్త్ చెకప్ క్యాంపెయిన్‌ని ప్రారంభించడం గర్వంగా ఉందని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. 54శాతం వరకు తగ్గింపుతో బాడీ చెకప్ ఉంటుందన్నారు. పరిమిత స్లాట్‌లు అందుబాటులో ఉన్నందున అజరా హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 9391009701 లేదా, 9391009702 సంప్రదించాలన్నారు.

నేడు జూపార్కులో సందర్శకులకు అనుమతి

హనుమకొండ సిటీ, డిసెంబరు 31: హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జూలాజికల్ పార్కులో సోమవారం సెలవుతో నిమిత్తం లేకుండా సందర్శకులకు అనుమతి కల్పించినట్లు ఇన్‌చార్జి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వి.రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిమ్మింగ్ సౌత్ వెస్ట్ జోన్
పోటీలకు కేయూ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, డిసెంబరు 31: జనవరి 2 నుంచి 4 వరకు తమిళనాడులోని ఎస్ఆర్ఎంఐఎస్టీ యూనివర్సిటీలో జరిగే సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు పురుషుల, స్త్రీల సిమ్మింగ్ కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాసరావు ఆదివారం ప్రకటించారు. 2023-24 ఏడాదికిగాను కాకతీయ యూనివర్సిటీ నుంచి జట్టు పాల్గొంటుందని వెల్లడించారు. ఎంపికైన వారిలో మెన్స్ విభాగంలో కేటీ రాఘవేందర్, పి.శ్రవణ్‌చంద్ర (డీఆర్ఎస్ డీసీ డిగ్రీ కళాశాల, ఖమ్మం), బి.శ్రీకాంత్ నాయక్, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), కె.అక్షిత్ (కేయూ ఇంజనీరింగ్ కళాశాల, హనుమకొండ) ఎంపికయ్యారు. అలాగే వుమెన్స్ విభాగంలో బి.మహేశ్వరి, (బాలాజీ వుమెన్స్ డిగ్రీ కళాశాల, నర్సంపేట) ఎంపికైనట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు వెల్లడించారు.

జట్టుకు మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రమేశ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జట్టుకు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావుల అభినందించారు.

కొత్త సంవత్సరం... కోటి ఆశలు

● జాబ్ క్యాలెండర్ వైపు నిరుద్యోగుల చూపు ● సంక్షేమ పథకాలపై కొత్త ఆశలు ● ఊరిస్తున్న నామినేటెడ్ పదవులు ● పాలనా పరంగా చోటు చేసుకోనున్న మార్పులు

హనుమకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాలచక్రంలో మరో ఏడాది కరిగిపోయింది. తీపి జ్ఞాపకాలు, చేదు అనుభవాలు మిగిల్చి కాలగర్భంలో కలిసి పోయింది. కొత్త ఆశలు. సరికొత్త ఆకాంక్షలతో కొత్త సంవత్సరం ఆరంభమైంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2024 సంవత్సరానికి ఉత్సాహంగా సంబరంగా స్వాగతం పలికారు. కొత్త సంవత్సరంలో అంతా శభమే జరగాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకు న్నారు. ఆశలు, ఆకాంక్షలను వ్యక్తీకరించుకుంటున్నారు. గతం గతః... కొత్త ప్రభుత్వం ఏర్పాటయిన నేపథ్యంలో కనీసం ఈ సంవత్సరమైన తమ ఉద్యోగాలు రావాలని నిరుద్యోగు లు ఆశ పడుతున్నారు. సంక్షేమ పథకాలు అందాలని నిరుపేదలు కోరుకుంటున్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలని అన్నివర్గాలు కోరుకుంటున్నారు. బీఆర్ఎస్‌ను ఓడించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పరుగులు పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు కొత్త సంవత్సరం అంతా ఎన్నికల సందడే ఉండనున్నది. లోక్‌సభ, శాసన మండలి, పంచాయతీ ఎన్నికలపై నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నామినేటెడ్ పదవులను కాంగ్రెస్ నేతలను ఊరిస్తోంది.

● జాబ్ క్యాలెండర్...

కొత్త సంవత్సరంపై నిరుద్యోగులు కోటి ఆశలు పెట్టుకున్నారు. 2023 సంవత్సరం వారికి ఉద్యోగాల విషయంలో చేదు అనుభవాలనే మిగిల్చింది. టీఎస్పీఎస్సీ పేపర్ల లీకేజీ, గ్రూప్ 1, గ్రూప్ 2 సహా కమిషన్ నిర్వహించిన పలు పరీక్షల్లో అవకతవకలు, వరుస వాయిదాల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేని ఫెస్టోలో ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికా ర ంలోకి వచ్చిన ఆ పార్టీ అన్నట్టుగానే జాబ్ క్యాలెం డర్ ను ప్రకటించింది, మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్త సంవత్సరంలో ఏ ఏ ఉద్యోగాలకు ఎప్పుడెప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చేది తేదీలతో సహా ప్రకటించింది. నిరుద్యోగులు ఈ జాబ్ క్యాలెండర్‌పై కోటి ఆశలు పెట్టుకున్నారు. ఇది అమలైతే ఈ కొత్త సంవత్సరంలో తమకు ఉద్యోగాలు దొరకడం ఖాయమన్న ఆశతో ఉన్నారు.

నిరుపేద ప్రజలు ఈ కొత్త సంవత్సరం నుంచి అమలు కానున్న సంక్షేమ పథకాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆరు గ్యారెంటీలపేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పథకాల అమలు కోసం కోసం ప్రజలు ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్నారు. ఈ పథకాల అమలుకు ప్రభుత్వం అప్పుడే శ్రీకారం కూడా చుట్టింది. గృహలక్ష్మి పథకంలో భాగంగా మహిళకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చింది. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని ప్రభుత్వం చెబుతుండడంతో ఈ పథకాలపై అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

● పెండింగ్ పనులు పూర్తయ్యేనా ?

ఉమ్మడి జిల్లాలో అనేక అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. కనీసం ఈ కొత్త సంవత్సరం లోనైనా వీటికి మోక్షం లభించాలని ప్రజలు కోరుతున్నా రు. కనీసం ఈ ఏడైనా కాళోజీ కళాక్షేత్రం , వేయిస్తం బాల గుడి కళ్యాణ మండపం, పాతిమానగర్ సమాంతర బ్రిడ్జి, రింగ్ రోడ్డు, వడ్డెపెల్లి బండ్ సుందరీకరణ, స్మార్ట్ రోడ్లు, రూ 1100 కోట్ల వ్యయంతో నిర్మాణం అవుతున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పూర్తికావాలని కోరుతున్నారు. మాస్టర్ ప్లాన్‌కు కనీసం ఏ ఏడు అయినా కొత్త ప్రభుత్వం ఆమోద ముద్ర వేయాలని కాంక్షిస్తున్నారు. ములుగులో గిరిజన విశ్వ విద్యాలయం పనులు మొదలు కావాలనీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీకి అడుగులు పడాలని కోరుతున్నారు. పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పంచాలనీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొత్త ఇళ్ల నిర్మాణం జరగాలని కోరుతున్నారు.

● ఎన్నికలపై ఆశలు:

గత సంవత్సరం చివరలో మొదలైన ఎన్నికల సందడి ఈ కొత్త సంవత్సరం అంతా కొనసాగనున్నది. కొత్త సంవత్సరం ఆరంభంలో జరగనున్న పార్లమెంట్, ఎమ్మెల్సీ, పంచాయతీ ఎన్నికలపై నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నాయకులు లోక్ సభ ఎన్నికల్లో, అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. పంచాయతీ ఎన్నికలపై కూడా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆశావ`హులు ఇప్పటికే టికెట్ల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు.

● నామినేటెడ్ పదవులపై దృష్టి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు నామినేటెడ్ పదవులపై దృష్టి సారించారు. గట్టిగా ప్రయత్నిస్తే ఈ కొత్త సంత్సరం ఏదైనా ఒక పదవి రాకపోతుందా అని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించి భంగపడ్డవారు, పోటీ చేసి ఓడిపోయినవారు, అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసినవారు, పార్టీ కోసం ఎంతో కాలంగా పని చేస్తున్నవారు, సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు అనేక మంది నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకు న్నారు. పలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదువులు వీరిని ఊరిస్తున్నాయి.

● అవిశ్వాసాలు

అవిశ్వాస తీర్మానాలతో పలువురి మున్సిపల్ చైర్మెన్ పదవులు ఊడిపోనున్నాయి. ఈ సంవత్సరం ఇది వారికి చేదు అనుభవమే కానున్నది. ఉమ్మడి జిల్లాలో వరంగల్ నగర పాలక సంస్థతో పాటు తొమ్మిది మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి చైర్మెన్లు అందరు బీఆర్ఎస్‌కు చెందిన వారే. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పుడే వీటిపై దృష్టి సారించింది. అవిశ్వాస తీర్మానాలు పెట్టడం ద్వారా వారిని గద్దె దించి కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి ఇచ్చేందుకు అప్పుడే పావులు కదుపుతో ంది. జనగామ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానానికి అప్పుడే ప్రయత్నాలు మొదలయాయి.

● మార్పులు చేర్పులు:

ఈ కొత్త సంవత్సరం పాలనా పరంగా అనేక మార్పులు చేర్పులు చోటు చేసుకోనున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే దీనిపై దృష్టి సారించింది. పాలనను ప్రజల వద్దకు చేర్చేందుకు మార్పులకు అప్పుడే శ్రీకారం చుట్టింది. ఈ ఏడు ఈ దిశగా ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆ ప్రభావం ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా పడనున్నది. బదిలీలు, పదోన్నతులతో కొత్త సంవత్సరం తమకు తీపి కబురు అందవచ్చునని ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

▸▸ జోరుగా కొత్త సంవత్సరం వేడుకలు



హనుమకొండ హరిత హోటల్‌లో యువతుల నృత్యాలు

హనుమకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2024 కొత్త సంవత్సరానికి ప్రజలు కోటి ఆశలతో స్వాగతం పలికారు. రాత్రి 12 గంటలకు పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి సాదరంగా ఆహ్వానించారు. నూతన సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలని, అందరూ సంతోషంగా, సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చరవాణిల్లో సందేశాలు వెల్లువెత్తాయి. హ్యాపీ న్యూయర్.. అంటూ ఆనందోత్సహాలతో కేరింతలు కొట్టారు. 2024 ప్రవేశానికి శుభసూచనగా పెద్దఎత్తున బాణాసంచాను పేల్చారు. కేకులు కట్ చేశారు. స్వీట్లను పంచుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. సంతోషంతో నృత్యాలు చేశారు. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ పాటలు పాడారు.

ఏరులై పారిన మద్యం

కొత్త సంవత్సరం పుణ్యమా.. అని మద్యం ఏరులై పారింది. ఉదయం నుంచే మద్యం షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ కనిపించాయి. సాయంత్రం మద్యానికి గిరాకీ మరింత పెరిగింది. రాత్రి ఒంటి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతూనే ఉన్నాయి. బార్లు, రెస్టారెంట్లు మందుబాబులతో కిటకిటలాడాయి. హోటళ్లు, డాబాలు, రిసార్టులు అర్ధరాత్రి వరకు విందు లు, వినోదాలతో హోరెత్తాయి. హాస్టళ్లలో విద్యార్థులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆట, పాటలతో కేరింతలు కొట్టారు. అపార్టుమెంట్ల సెల్లార్లు, రూఫ్‌టాప్‌లు కొత్తపార్టీ వినోదాలతో ఊగిపోయాయి. రంగురంగుల విద్యుదీపాల నడుమ అపార్టుమెంట్లువాసులు తెల్లవారుజాము వరకు పార్టీల్లో మునిగి పోయారు. నగరంలో పేరున్న పలు హోటళ్లు కూడా న్యూ ఇయర్ ఈవెంట్లను నిర్వహి ంచాయి. పలు మధ్యతరగతి, సంపన్న కుటు ంబాలు పెద్దసంఖ్యలో హాజరైన ఈ ఈవెంట్లు డీజే మ్యూజిక్‌తో ఆకట్టుకున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టరాని సంతోషంతో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకున్నారు. ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు.

కేకులు, స్వీట్లు

కొత్త సంవత్సరం సంబరాల్లో భాగంగా చాలా మంది ఇళ్లలో కేకులు కట్ చేశారు. స్వీట్లను పంచుకున్నారు. ఉదయం నుంచి అన్ని బేకరీ షాపులు, స్వీట్ షాపులు కొనుగోలుదారులతో పోటెత్తాయి. న్యూయిర్‌ను పురస్కరించుకొని బేకరీలు వివిధ రకాల కేకులను తయారు చేసి సిద్ధంగా ఉంచాయి. వీటిపై ఆఫర్లను కూడా ఇచ్చాయి. మూడు కిలోలకు మించి కేక్ కొన్నవారికి ఒక లీటరు కూల్ డ్రింక్ ఉచితంగా ఇచ్చారు. మరికొన్ని చోట్ల 5కిలోల కేకు కొంటే కిలో కేక్ ఫ్రీగా అందచేశారు. స్వీట్‌షాపులు సైతం ఆఫర్లతో ఆకట్టుకున్నాయి. రెండు కిలోలకు మించి స్వీట్లు కొన్నవారికి పావుకిలో మిక్చర్ ఉచితంగా అందచేశాయి.



పద్మాక్షి గుట్ట సమీపంలో ని హాస్టల్ లో న్యూయర్ వేడుకలు

యూత్ జోష్..

నగరంలో న్యూ ఇయర్ సందడి

హనుమకొండ క్రైం, డిసెంబరు 31: నూతన సంవత్సర వేడుకలు ఫుల్ జోష్‌గా జరిగాయి. అర్ధరాత్రి నగరంలో ఉత్సాహపూరిత వాతావ రణంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. వరంగల్ కమిషనరేట్ పోలీసులు నిబంధలను కఠినతరం చేసినా యువత స్పీడుకు కళ్లెం వేయలేకపోయారు. కొందరు యువకులు పోలీసుల నిబంధనలు అతిక్రమించి మత్తు జోష్‌లో మునిగిపోయి రోడ్లపై చెక్కర్లు కొట్టగా.. మరి కొందరు ఇళ్లకే పరిమితమై వేడుకల్లో మునిగిపోయారు. రాత్రి 12 గంటలు కొట్టగానే నగరం భారీ శబ్దాలతో బాణాసంచా మోతలతో దద్దరిల్లింది. యువతీ, యువకుల కేరింతలతో కొత్త సంవత్సర వేడుకలు మిన్నంటాయి. డీజే సౌండ్స్ ఏర్పాటు చేసుకుని డ్యాన్స్‌ల్లో మునిగిపోయారు. రోడ్లపై కుర్రకారు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుగూ సెలబ్రేషన్స్‌లో మునిగిపోయారు. రయ్.. రయ్.. మంటూ బైక్‌లపై పర్యటిస్తూ రెచ్చిపోయారు. కొత్త సంవత్సర వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ ఘట నలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు పోలీసులు జాగ్రత్తపడ్డారు. సాయంత్రం 6 గంటల నుంచే శాతిభద్రతల పరిరక్షణ కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో గొడవలు, అల్లర్లు తలెత్తకుండా ఉండేందుకు లా అండ్ ఆర్డర్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ ఆదేశాల మేరకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ సెంటర్‌లో పోలీ సు పికెటింగ్‌లో ఏర్పాటు చేశారు. 380 మంది పోలీసులు రంగంలోకి దిగి డ్యూటీలు చేశారు. అడుగడుగునా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. సుమారు 542 మంది మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. ఈ- చలానా పద్ధతిలో ఫైన్‌లు విధించి ఉట్టి చేతులతో పంపించారు. బైక్‌లపై త్రిపుల్ రైడింగ్ చేయకుండా పోలీసులు డేగకళ్లతో వీక్షించారు. ప్రమాదాలు జరుగకుండా పోలీసులు రోడ్లపై నిఘా పెట్టారు. మహిళా వసతి గృహాలు, మహిళా కళాశాలల వద్ద పోలీసులు మఫ్టీ లో కాపుకాచి ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఇంకా కొందరు యువత గంజాయి మత్తులో తూగుతూ రోడ్లపై హల్‌చల్ చేశారు. నగరంలోని మహిళలు నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని 31 రాత్రి 10 గంటల నుంచే వాకిళ్లలో ముత్యాల ముగ్గులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. అనంతరం మహిళలు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కేకులు కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. సీపీ కార్యాలయంలో కమిషనర్ కిశోర్ ఝా కేక్ కట్ చేసి సిబ్బందికి పంచారు.



నగరంలోని ఓ వైన్స్ వద్ద గుమికూడిన జనం

వైన్స్‌షాపుల వద్ద హంగామా

డిసెంబరు 31 సందర్భంగా ఆదివారం రాత్రి పోలీసు కమిషనరేట్ పరిధిలోని మద్యం షాపుల వద్ద యుద్ధ వాతావరణం నెలకొంది. మద్య ం కొనుగోలు చేసేందుకు మద్యంప్రియుల పోటెత్తా రు. వైన్స్, బార్‌షాపుల ముందు దడికట్టారు. ఇక నగరంలోని ప్రతీ మద్యం షాపుల ముందు జాతర వాతావరణం నెలకొంది. నగరంలోని అన్ని బార్లు, వైన్స్, రెస్టారెంట్లతో పాటు నగర శివారులో సైతం వెలసిన బెల్టుషాపుల వద్ద మందు ప్రియులు ఫుల్లుగా తాగి చిందులు వేశారు. ఇదే అదునుగా భావించిన కొందరు మద్యం వ్యాపారులు ఇష్టం వచ్చిన రేట్లకు అమ్ముకున్నట్టు యువకులు వాపోయారు.

ఎంజీఎం ఆస్పత్రిని ప్రక్షాళన చేస్తాం..

● హెల్త్ సిటీ పేరుతో పెద్దాస్పత్రి అభివృద్ధి కుంటు పడింది ● దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హనుమకొండ అర్బన్, డిసెంబరు 31: ఎంజీఎం ఆస్పత్రిలో మెరుగైన సేవలు విస్తృతపరిచేందుకు ఆస్పత్రిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఎంజీఎం ఆస్పత్రిని ఆదివారం మధ్యాహ్నం కొండా సురేఖ సందర్శించారు. తొలుత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. పేద రోగులకు అన్ని రకాల వసతులను ప్రభుత్వం కల్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఉత్తర తెలంగాణకే తలమానికంగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రి గుండెకాయ లాంటిదన్నారు. దీనిని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. 14 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయని, మందుల కొరత లేకుండా అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఇటీవల కోతుల బెడద వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వెంటనే అధికారులు అప్రమత్తమై పునరుద్దరించారని మంత్రి సురేఖ చెప్పారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు ఐదు జనరేటర్ల ద్వారా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఈ ఘటన వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. తొమ్మిది రోజుల వ్యవధిలో 25కు కరోనా కేసులు పెరిగాయని సురేఖ వెల్లడించారు. కరోనా రోగులకు ప్రత్యేక వార్డుల్లో చికిత్స అందుతోందని అన్నారు. ఎంజీఎంలో ప్రస్తుతం 25 మంది కరోనాతో చికిత్స పొందుతున్నారని, వీరిలో ఎలాంటి ప్రాణాపాయ లక్షణాలు లేవని ఆమె స్పష్టం చేశారు. ఈ నెల 21 నుంచి 170 మంది రోగులకు కరోనా పరీక్షలు నిర్వహించగా 25 మందికి పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని, పది మంది ఎంజీఎంలో చేరి చికిత్స పొందుతున్నారని తెలిపారు. 1200 ఆక్సిజన్ బెడ్స్, మూడు ఆక్సిజన్ ట్యాంకులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. కాగా, హెల్త్‌సిటీ పేరుతో నిర్మిస్తున్న ఆస్పత్రి గురించి ఎంజీఎం అధికారుకు సమాచారం లేకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ చంద్రశేఖర్, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డి.మోహన్‌దాస్, టీఎస్ఎంఐడీసీఎస్ ఇ.దేవేంద్ర కుమార్, ఎన్‌పాడీసీఎల్ డీఈ మల్లికార్జున్, ఆర్ఎంఓ మురళి, అడిషనల్ ఆర్ఎంవోలు, వైద్యులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

పేదరిక నిర్మూలనే ప్రధాని మోదీ ధ్యేయం

కేంద్ర మంత్రి బీఎల్.వర్మ

హనుమకొండ రూరల్, డిసెంబరు 31: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కేంద్ర సహకార శాఖ, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ తెలిపారు. ఆదివారం హనుమకొండలోని కలెక్టరేట్ ముందు వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి బీఎల్.వర్మ మాట్లాడారు. ముందుగా ప్రధాని నరేంద్ర మోదీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయం చేసే రైతులకు ఎకరానికి రూ.2వేల ఆర్థిక అందించడంతోపాటు కిసాన్ భరోసా కింద సబ్సిడీ ఎరుగులను సైతం కేంద్రం పంపిణీ చేస్తోందన్నారు. సబ్సిడీ గ్యాస్, ఎరువులు, ముద్ర లోన్లు, ఆయుష్ భారత్, బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన, సురక్ష యోజన ఇలా ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు. పేదరిక నిర్మూలన, పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని కేంద్ర మంత్రి అన్నారు. అనంతరం వికాసిత్ భారత్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, బీజేపీ నాయకులు కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందంగౌడ్, కుమారస్వామి, రాంచంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, మధుసూదన్‌రావు, శ్రీనివాస్, రాజు, కళ్యాణ్, శ్రీధర్, అన్వేష్, వాణిశ్రీ, వివిధ బ్యాంకులకు చెందిన చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వికాసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఎల్.వర్మ

ఏపీలో గుట్టుగా
ఇసుక దోపిడీ షురూ!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీలో గుట్టుగా ఇసుక దోపిడీ షురూ అయింది. 2023-25 కాలానికిగాను ఇసుక తవ్వకాలు, అమ్మకాలకు సంబంధించిన టెండర్ల వ్యవహారమంతా సీక్రెట్‌గా జరిగిపోయింది. జగన్ సర్కారు కంపెనీలను ఎంపిక చేసి అమ్మకం బాధ్యతలు కూడా అప్పగించింది. ఉత్తర్వులు కూడా జారీ చేసింది. వాటిలో ఒకటి తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ముఖ్యనేత బోయినపల్లి వినోద్‌కుమార్ సోదరుడు శ్రీనివాసరావుకు చెందిన ప్రతిమ కంపెనీ. ఆయన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్వయానా మేనల్లుడు. మరొకటి రాజస్థాన్‌కు చెందిన జీసీకేసీ కంపెనీ. కంపెనీలతో జగన్ సర్కారు డిసెంబరు 11న సీక్రెట్ గా ఒప్పందాలు చేసుకుంది. అదే రోజు నుంచి ఇసుక అమ్మకం బాధ్యతలను వాటికి అప్పగించింది. కానీ.. డిసెంబరు 22న గనుల శాఖ దీనిపై కలెక్టర్లకు, అధికారులకు లేఖ రాసింది. అగ్రిమెంట్ కుదిరిన రోజు నుంచే ప్యాకేజీల వారీగా ఆయా జిల్లాల్లో ఆయా సంస్థలు ఇసుక తవ్వకాలు, అమ్మకాలు చేస్తున్నట్లుగా పరిగణించాలని గనుల శాఖ డైరెక్టర్ ఆ లేఖలో సూచించడం గమనార్హం. ఈ జగన్నాటకం వెనుక మరో పెద్ద రహస్యం ఉంది. అదేంటంటే.. కంపెనీలు ఏవై నా, ఇసుక అమ్మకాలను పర్యవేక్షించేది ముఖ్యమంత్రి తమ్ముడు అనిల్‌రెడ్డే. ఏపీ సర్కారుకు వేల కోట్ల ఆదాయం తెచ్చిపెట్టే ఈ ఇసుక అమ్మకాల వ్యవహారంలో అంతా రహస్యమే. రాయల్టీ, ఫీజులు ఎంతో.. వెల్లడించడం లేదు. కీలకమైన పర్యావరణ అనుమతుల విషయంపై కూడా గప్‌చుప్! వైసీపీ సర్కారు గతంలో జేపీ వెంచర్స్‌కు ఇసుక టెండర్ ఇచ్చినప్పుడు.. దాని విలువ ఎంతో ప్రకటించింది. నిబంధనలు, చెల్లించాల్సిన రాయల్టీ, సీనరేజీ, కన్సిడరేషన్ ఫీజులు ఎంతో ముందే ప్రకటించింది. కానీ ఇప్పుడు మాత్రం ఆ వివరాలన్నింటినీ రహస్యంగా ఉంచుతోంది.

నిబంధనలను తోసిరాజని..

టెండర్ నిబంధనల ప్రకారం.. ఇసుక వ్యాపారం చేసిన అనుభవం ఉన్న సంస్థలకే పనులు అప్పగించాలి. కానీ.. ప్రతిమ కంపెనీకి ఇంతకు ముందు ఇసు క వ్యాపారం చేసిన అనుభవం లేదు. జీసీకేసీదీ అదే పరిస్థితి. అయినా నిబంధనలు తోసిరాజని ఆ కంపెనీలకు పనులు అప్పగించారు. ఇలా అక్రమంగా ఇసు క టెండర్లు దక్కించుకున్న ప్రతిమ, జీసీకేసీలు ఇసుక తవ్వకాలు, అమ్మకాల వ్యాపారం మొదలుపెట్టాయి. అయితే ఇసుక అమ్మకాల సందర్భంగా ఇచ్చే రహదారి బిల్లులపై కీలకమైన జీఎస్టీ నంబర్‌ను మాత్రం జీసీకేసీ సంస్థ ముద్రించట్లేదు. దీంతో ఆ సంస్థ జీఎస్టీ నంబరు తీసుకోకుండానే ఇసుక వ్యాపారం మొదలుపెట్టిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని గనుల శాఖ చూసీచూడనట్టు వదిలేస్తోంది. అలాగే.. ఇసుక తవ్వకాలకు విధిగా పర్యావరణ అనుమతులు కావాలి. కానీ, కొత్తగా ఆ అనుమతులు లేకుండానే టెండర్లు నిర్వహించడం గమనార్హం.

ఆంధ్రజ్యోతి HANUMAKONDA CITY
సోమవారం 1 జనవరి 2024
హనుమకొండ సిటీ
• హనుమకొండ • కాజీపేట • హసన్‌పర్తి • ఐనవోలు • ధర్మసాగర్ • వేలేరు



మెట్టురామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న కేంద్రమంత్రి

మడికొండ, డిసెంబరు 31: మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి క్షేత్రాన్ని ఆదివారం ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి సహాయక మంత్రి బీఎల్. వర్మ సందర్శించారు. మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయానికి తోడ్కొని వెళ్ళగా మంత్రి స్వయంభూ మెట్టురామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, సీతారామచంద్రస్వామి వారికి విశేష అర్చనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మెట్టుగుట్ట క్షేత్రం విశిష్టతను ప్రత్యేకతను అడిగి తెలుసుకున్నారు. అలాగే పీరియాడికల్ ఓవర్‌హాలింగ్(పీహోహెచ్)వర్క్‌షాప్‌కు కేటాయించిన స్థలాన్ని గుట్టపై నుంచే పరిశీలించారు. మంత్రి వెంట హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఉమారాణి, మాజీ మంత్రి గుండె విజయరామారావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ఉన్నారు. ఈవో శేషభారతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు అభిలాష్ శర్మ, విష్ణువర్ధనాచార్యులు, విష్ణువర్ధనాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సోమనాథ సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

పాలకుర్తి, డిసెంబరు 31 : పాల్కూరికి సోమనాథుడి సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని, దీనికి సోమనాథ కళాపీఠం దోహపడుతుందని తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాలులో సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కారాల ప్రదానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సోమనాథ సాహిత్య పురస్కారాన్ని డాక్టర్ కానుకుర్తి శెట్టి సోమశేఖర్, సామాజిక శోధన పురస్కారాన్ని డాక్టర్ నలిమెల భాస్క ర్, రంగస్థల పురస్కారాన్ని మంచాల రమేష్, పందిల్ల శేఖర్‌బా బు.. రాజయ్య శాస్త్రి స్వచ్ఛంద భాషా సేవ పురస్కారాన్ని డాక్టర్ మైథిలి అబ్బరాజు, చలపతిరావు సాహిత్య పురస్కారాన్ని ఎం.ఎస్.ఆర్. వెంకటరమణ, ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారాన్ని డాక్టర్ సి.ఎస్.ఆర్. ప్రభు, రాపోలుసోమయ్య ప్రతిభా పురస్కారాన్ని డాక్టర్ అరూరి మహేందర్, దేవగిరి రాజయ్య స్మారక పురస్కారాన్ని బూస రేణుకారాధ్య స్వీకరించారు.

ఐనవోలు జాతరను విజయవంతం చేయాలి

దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

ఐనవోలు, డిసెంబరు 21: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. జనవరి 13 నుంచి జరిగే ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాల ఏర్పాట్లపై ఆదివారం ఆలయ ప్రాంగణంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. అంతకుముందు ఆలయానికి వచ్చిన మంత్రికి ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షణ చేసి మంత్రి గోపూజ చేశారు. తదుపరి స్వామి వారిని దర్శించుకున్నాక పట్టువస్త్రాలు సమర్పించి వేద ఆశీర్వచనాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరను గతం కంటే భిన్నంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. గత జాతర అనుభవాలను పరిగణలోకి తీసుకొని ఈ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొని వెళ్లేవిధంగా సౌకర్యాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. జాతర సమయంలో వచ్చి చూస్తానని, ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతరలో దివ్యాంగులు, వృద్ధుల కోసం బ్యాటరీ కార్లను ఏర్పాటు చేయాలన్నారు. జాతర సమయంలో తాత్కాలిక పనులు చేస్తూ నిధులు వృథా చేస్తున్నారని, అలాకాకుండా వచ్చే జాతర వరకు శాశ్వత నిర్మాణాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జాతరలో పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖతోపాటు ప్రయివేటు ఆస్పత్రులను భాగస్వామ్యం చేసి కమ్యూనిటీ రిసోర్స్ ఫండ్ కింద వారు వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలిగించకుండా సరిపోను ఆర్టీసీ బస్సులు నడుపాలన్నారు. జాతర పరిసర ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని, అవసరమైతే జాతర ప్రాంగణంలో జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు.


సమీక్షసమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండ సురేఖ

ప్లాస్టిక్ రహిత జాతరగా మార్చాలి..

ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా చేయాలనే ఉద్దేశంతో పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ సూచించారు. జాతరలో ప్లాస్టిక్ బ్యాగులు, బాటిల్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత డీపీవోపై ఉందన్నారు. కవర్లు, బ్యాగులు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణహితంగా ఉండేందుకు ప్లాస్టిక్‌ను వినియోగిస్తే జరిమానాలు విధించాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేసి, స్క్రోలింగ్ లైన్స్‌ని ఏర్పాటు చేసి వ్యాపారులను, భక్తులను అనౌన్స్‌మెంట్ ద్వారా చైతన్యపరచాలన్నారు. ఐనవోలుకు వచ్చే రహదారులను తక్షణమే మరమ్మతులు చేయాలని, మూలమలుపులు, వ్యవసాయబావుల వద్ద రేడియంతో కూడిన సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు స్పాపర్లను ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ, 'కుడా' అధికారులు ఆదేశించారు. విద్యుత్ అంతరాయం జరగకుండా చూసుకోవాలని, అవసరమైతే జనరేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆలయ ప్రాంగణంలో హైమాస్ట్ లైట్లను 'కుడా' నిధులతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు భక్తులకు కావాల్సిన శుద్ధి చేసిన నీటిసరఫరాకు ట్యాంకర్లు ఏర్పాటు చేసి ఎక్కడ నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తాం..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా ఐనవోలు, కొమురవెల్లి, సమ్మక్క సారలమ్మ జాతరలను నిర్వహించే బాధ్యత తనకు లభించిందని, గిరిజన బిడ్డగా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా తాను.. ఇద్దరం మహిళలం కలిసి జాతరలను విజయవంతం చేయడానికి బాధ్యత తీసుకున్నామని కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవుడి మాన్యాలు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. మాన్యాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేయడంతోపాటు పురాతన కాకతీయుల ఆలయాలను కాపాడుకోవడానికి ఆర్థికపరమైన ప్రణాళికను రూపొందించుకొని ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఐనవోలు దేవస్థానంలో అసంపూర్తిగా ఉన్న డార్మిటరీ హాల్, కల్యాణ మండపం, ఒగ్గు పూజారులకు శాశ్వత భవనం, కల్యాణ కట్ట నిర్మాణాలను వచ్చే జాతర వరకు పూర్తిచేయనున్నట్లు తెలిపారు.

భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం..

ఈ సారి మేడారం జాతర ఉన్నందున ఐనవోలు జాతరకు భక్తులు ఎక్కువ సంఖ్యలోవచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్లుగా ఏ లోటు ఏర్పడకుండా సకల సౌకర్యాలు కల్పిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు చెప్పారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ప్రణాళికబద్ధంగా రూట్‌మ్యాప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. జాతరకు ప్రత్యేక అధికారిగా ఆర్డీవో రమేష్‌ను నియమించినట్లు తెలిపారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవాభావంతో పనిచేయాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికగుప్తా, డీసీపీ రవీందర్, ఏసీపీ సతీష్, ఎంపీపీ మార్నేని మధుమతి, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు, ఏసీ సునిత, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, డీఎంహెచ్‌వో సాంబశివరావు, ఆయా శాఖల ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈలు, స్థానిక సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఎంపీటీసీ కొత్తూరి కల్పనమధుకర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్‌కు అండగా ఉంటా..

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట జంక్షన్, డిసెంబరు 31: ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని అందించి ప్రాణాలు కాపాడే ప్రాణదాత రెడ్‌క్రాస్‌కు ఎల్లవేళలా అండగా ఉంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో తలసేమియా రోగుల కోసం ఏర్పాటు చేసిన తలసేమియా సెంటర్ మొదటి అంతస్తు నిర్మాణం కోసం ఆదివారం నిర్వహించిన పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు, జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో కలిసి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రక్తదానం మాత్రమే కాకుండా ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ అభ్యున్నతికి ప్రభుత్వ పరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగరమాజీ మేయర్ రెడ్ క్రాస్ ప్యాట్రన్ ఎర్రబెల్లి స్వర్ణ, హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలక వర్గ సభ్యులు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవానీనగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా..

హనుమకొండ సిటీ : హనుమకొండలోని భవానీనగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం భవానీనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి సన్మాన కార్యక్రమం జరిగింది. శాలువా, పూలమాలతో కాలనీవాసుల సన్మానించారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి కమిటీ తన దృష్టికి తీసుకువచ్చిన కాలనీ సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. తన విజయానికి సహకరించిన కాలనీవాసులకు రాజేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియచేశారు. మందా ప్రకాశ్ అధ్యక్ష ఉపన్యాసంతో జరిగిన ఈ కార్యక్రమంలో 59వ డివిజన్ కార్పొరేటర్ వసంత, కాలనీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి తోటిరెడ్డి దామోదర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు జువ్వాడ జనార్ధన్‌రావు, సమ్మెట వీరయ్య, ఎల్లయ్య రాంరెడ్డి, భవానీ మాత ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు నందికొండ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ పాలక వర్గం

విజయవంతంగా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సదస్సు

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్


ఐహెచ్‌సీ నిర్వహణ కమిటీ బాధ్యులతో వీసీ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్

కేయూ క్యాంపస్, డిసెంబరు 31: డిసెంబరు 28, 29, 30 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన 82వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సదస్సులు దిగ్విజయం చేయడంలో నిర్వహణ కమిటీలు కృషి అభినందనీయమని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అన్నారు. ఆదివారం కేయూ గెస్ట్‌హౌస్‌లో ఐహెచ్‌సీ నిర్వహణ కమిటీ బాధ్యులు, ఇతర ప్రొఫెసర్లతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఐహెచ్‌సీ లోకల్ సెక్రటరీ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఐహెచ్‌సీ నిర్వహణ కమిటీల బాధ్యులకు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా వీసీ రమేశ్ మాట్లాడుతూ.. ఐహెచ్‌సీ సదస్సు దిగ్విజయంగా జరుగడంతో యావత్ దేశం కేయూ వైపు చూస్తోందని చెప్పారు. 3 దశాబ్దాల అనంతరం వర్సిటీలో ఐహెచ్‌సీ సదస్సు జరిగిందన్నారు. సదస్సు నిర్వహణలో ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ వ్యూహాత్మకంగా ముందుకు సాగామని చెప్పారు. అదే స్ఫూర్తితో అందరూ టీంవర్క్‌తో ముందు మరిన్ని సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్లు పి.మల్లారెడ్డి, బనాఅయిలయ్య, వాసుదేవారెడ్డి, వై.వెంకయ్య, తిరుమలదేవి, నరసింహాచారి, రాధికారాణి, టి.దయాకర్‌రావు, బ్రహ్మం, చీకటి శ్రీను, ఎస్.రామస్వామి, అధ్యాపకులు వెంకటేశ్ ఆకులపల్లి కుమార్, సుచితపాల్, వర్సిటీ అధికారులు పెండ్లి అశోక్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ప్రయాణికులను వేధించే హిజ్రాలపై చర్యలు

ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు


కాజీపేట, డిసెంబరు 31: రైలులో ప్రయాణికులను వేధించి డబ్బుల వసూళ్లకు పాల్పడే హిజ్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాజీపేట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సంజీవరావు తెలిపారు. డబ్బుల కోసం రైలు ప్రయాణికులను వేధిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం కాజీపేట ఆర్పీఎఫ్ స్టేషన్‌లో ఆర్పీఎఫ్ సిబ్బంది హిజ్రాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎం. సంజీవరావు మాట్లాడారు. రైలులో ప్రయాణికుల వద్ద డబ్బులు వసూళ్లు చేస్తే సహించబోమన్నారు. జనవరి 1వ తేదీ నుంచి హిజ్రాలు రైళ్లలోకి ప్రవేశాన్ని నిషేధిస్తున్నామన్నారు. హిజ్రాలు న్యూసెన్స్ చేస్తే రైల్వే పోలీస్ హెల్ప్‌లైన్ 139కు సమాచారం ఇవ్వాలని, లేదా నేరుగా రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీఐ రాంమూర్తి, ఎస్సై శ్రావణి పాల్గొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరైన వారిలో హిజ్రాలు స్నేహ, సుధా, అశ్విని, రోషిణి, పూర్ణిమ, తోపాటు 30 మంది హిజ్రాలు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో ముగ్గురి అరెస్టు

కాజీపేట, డిసెంబరు 31: వరకట్న వేధింపుల కేసులో కాజీపేట పోలీసులు ఆదివారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. కట్నం కోసం అత్తింటి వేధింపులు తట్టుకోలేక డిసెంబరు 20న కాజీపేటలో ఉష్మై కుల్సా (28) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లి జహీరా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఆదివారం కుల్సా భర్త యాకుబ్ పాషా, అత్త ఫాతిమా, మామ సండే సాహెబ్‌లను ఖమ్మంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఐనవోలు, డిసెంబరు 31: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఐనవోలులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన చింతం ప్రభాకర్(55), ఆయన కుమారుడు రమేష్ ఇద్దరు కలిసి ఆదివారం ఐనవోలుకు వచ్చారు. కూల్‌డ్రింక్ తాగివస్తానని తండ్రి కుమారుడికి చెప్పి వెళ్లాడు. ఆ తరువాత తండ్రి రాకపోవడంతో వేచిచూసి తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. తండ్రి ఐనవోలు సబ్‌స్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగి మృతిచెంది ఉన్నాడని స్థానికులు గుర్తించి వెంకటాపురంలో ఉన్న కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మృతుడు ప్రభాకర్

ఘనంగా సంకటహార చతుర్థి వేడుకలు

కాజీపేట, డిసెంబరు 31: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో ఆదివారం సంకటహర చతుర్థి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులచే సేకరించిన 108 కిలోల నవధాన్యాలతో గణపతికి అభిషేకం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు పంచామృత అభిషేకం నిర్వహించి నిత్య సహస్ర మోదక గణపతి మూలమంత్రం నిర్వహించారు. సాయంత్రం భక్తులకు తీర్థప్రసాద వితరణ, మహా అన్నదానం నిర్వహించారు. అర్చకులు రోహిత్ ఉపాధ్యాయ, శివం శర్మయల్లంబట్ల క్రాంతి కుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భక్తులు, ఆలయ సిబ్బంది పెద్ద ఎత్తున హాజరయ్యారు.

కార్యకర్తల సంక్షేమమే లక్ష్యం..

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు

వడ్డెపల్లి, డిసెంబరు 31: కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల సంక్షేమమే తన లక్ష్యమని వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ కల్లుమండవ ప్రాంతంలోని కేజీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నేత కొంక హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని వివిధ కాలనీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు ఎమ్మెల్యే నాగరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దూలం రఘుపతి గౌడ్, మాజీ సర్పంచ్‌లు పాపావత్ విజయ, దూలం సదానందం గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర , జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా పీఆర్టీయూ

మడికొండ, డిసెంబరు 31 : గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకుల గూడెం మండల ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయు డు, పీఆర్టీయూ టీఎస్‌లో క్రియాశీలక సభ్యుడు బొమ్మినేని సుధాకర్ ఈనెల 4న మృతి చెందాడు. ఆదివారం పీఆర్‌టీయూ నేతలు సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కును అం దించి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మండల తిరుపతిరెడ్డి, పీఆర్టీయూ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పలీత శ్రీహరి, వరంగల్ జిల్లా ప్రధా న కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ గఫార్, కాజీపేట మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు దేవిరెడ్డి మాలకొండారెడ్డి, బొమ్మ వీయ్య, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు బీరం సంధ్యారాణి, సత్యనారాయణ రెడ్డి, బొబ్బాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు నోటీసుల జారీ

ధర్మసాగర్, డిసెంబరు 31: ఇంటి వద్ద ర్యాంపు కూల్చివేసిన విషయంలో హైకోర్టు ఆదేశాల మేరకు ధర్మసాగర్ సీఐ శ్రీధరావు నిందితులకు నోటీలను ఆదివారం జారీ చేశారు. ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన న్యాయవాది మాచర్ల కిషన్ కుమార్ గౌడ్ తన ఇంటి వద్ద 2015 సంవత్సరంలో ఇంటి వద్ద ర్యాంపు నిర్మాణం చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని అప్పటి సర్పంచ్ వల్లపురెడ్డి రమాదేవి ఆదేశాల మేరకు నిర్మాణం చేపట్టిన ర్యాంపును జీపీ సిబ్బంది సహాయంతో కూల్చివేశారు. జిల్లా పంచాయతీ అధికారులు విచ్చేసి ఈ విషయంపై విచారణ చేట్టారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణం జరిగిందని అధికారులు నిర్ధారించడంతో కిషన్ కుమార్ గౌడ్ ధర్మసాగర్ పీఎస్‌లో జీపీ కార్యదర్శి జై థార్మాండ్, నారాయణగిరికి చెందిన వల్లపురెడ్డి రమాదేవి, వల్లపురెడ్డి రాంరెడ్డి, పుట్ట కుమార్, దేవరుప్పల సుధాకర్, వక్కల శ్రీనివాస్, వెల్దండి రమేష్, మట్ల శ్రీను, పుట్ట సుమన్, కుందేళ్ళ రాజు, ధర్మసాగర్‌కు చెందిన ఆకునూరి భద్రయ్య, బంక రాజ్ కుమార్ మొత్తం 12. మందిపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

దీంతో నిందితులు అదే సంవత్సరం హైకోర్టులో అరెస్టు కాకుండా ముందస్తుగా హైకోర్టు నుంచి స్టేను తీసుకున్నారు. ఆ స్టేను డిసెంబరు 5.న హైకోర్టు ఎత్తి వేస్తూ నిందితులకు నోటీసులిచ్చి అరెస్టు చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది.

ఆలయాలతో ఆధ్యాత్మిక చింతన

ఐనవోలు, డిసెంబరు 31 : ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లబోయిన అశోక్‌ముదిరాజ్ అన్నారు. 44వ డివిజన్ సింగారంలో కోటగండి పెద్దమ్మతల్లి దేవాలయం ట్రస్ట్ బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయాన్ని నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, మత్స్యపారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుస్సా మల్లేశం, మెపా రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రేగుల మొగిళి, ముదిరాజ్ నగర అధ్యక్షుడు భయ్యాస్వామి, పులి రజినీకాంత్, సోనబోయిన సతీష్, అమర్‌చంద్, పిట్టల రాజు, సొసైటీ చైర్మన్ జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవ్య

కుటుంబ కదంబం

నూతన సంవత్సర శుభాకాంక్షలు

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో మేరు నగధీర రేఖ. సాధారణత్వం నుంచి గ్లామర్ శిఖరాగ్రం వరకు ఆమె ప్రయాణం అసాధారణం. రేఖ జీవిత చరిత్రను 'రేఖ- ది- అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో నవలీకరించాడు యాసిర్ ఉస్మాన్. దీన్ని 'స్వయంసిద్ధ- ఒక అభినేత్రి జీవనరేఖ' గా తెలుగులో అనుసృజన చేశారు శ్రీదేవీ మురళీధర్. ఆ పుస్తకంలోని కొన్ని విశేషాల సమాహారమే ఇది.!



ఇదొక అభినేత్రి జీవన 'రేఖ'

తన తొలి చిత్రాలు విజయఢంకా మోగిస్తుంటే 1972లో రేఖ బొంబాయి జుహూ ప్రాంతంలో తన సొంత ఫ్లాట్ కొనుక్కుంది. పద్దెనిమిదేళ్ల రేఖ హోటల్ అజంతా నుండి జుహూ బీచ్ అపార్ట్‌మెంట్‌కు మారింది. అదే అపార్ట్‌మెంటులో నటి జయ భాదురి కూడా నివసించేది. రేఖ, జయ తమ సినిమా కెరీర్‌ను దాదాపు ఒకేసారి ప్రారంభించారు. అయితే నటులుగా వారిద్దరి ఎదుగుదల పూర్తి భిన్న పథాలలో నడిచింది. రేఖ నటిగా తనను తాను ఎన్నడూ సీరియస్‌గా తీసుకోలేదు. పరిశ్రమ కూడా ఆమెను సమర్థురాలైన నటిగా పరిగణించలేదు. ఆమె నటన గురించి కాకుండా ఆమె చుట్టూ గాలివార్తలు ఆమె వ్యక్తిగత జీవితం గురించి, ప్రచారం అవసరం లేని అనేకమైన విషయాల గురించి వెలుగులోకి వచ్చేవి. అది సునీల్‌దత్ వంటి సీనియర్ నటుడైనా, అప్పటి సూపర్ స్టార్ రాజేష్ ఖన్నా అయినా, రేఖ తన కోసం ప్రతి ఒక్కరినీ సెట్స్ మీద వేచి ఉండేటట్లు చేసేది, మరి అది సాహసమో, వెర్రి ధైర్యమో! ఒకప్పుడు హృషీకేశ్ ముఖర్జీ వంటి గౌరవనీయుడైన దర్శకుడు కూడా 'నమక్ హరామ్' (1973) సెట్‌లో షూటింగ్ నిలిపివేయవలసి వచ్చింది. సగం రోజు పాటు అందరూ ఎదురు చూసినా రేఖ మాత్రం రాలేదు. ఆమె అప్పటికింకా యుక్త వయస్సు, స్వేచ్ఛా ప్రవృత్తి, భావోద్వేగం, త్వరగా చలించిపోయే సున్నితమైన మనసు కల స్టార్‌గా పేరు తెచ్చుకుంది.

> 'అతడు వివాహితుడు అన్న వాస్తవం వల్ల నా ఆలోచనలో ఎటువంటి తేడా లేదు. గులాబీ ఏ పేరుతో పిలిచినా గులాబీయే. అతడొక ఆసక్తికరమైన వ్యక్తిత్వం కల పురుషుడు, అంతే. నేను ఈ వ్యక్తితో అనుబంధం కలిగి ఉన్నాననే గౌరవాన్ని పొందాలనుకుంటున్నాను. కాబట్టి నన్ను ఆపగలిగేదేమిటి? నేను అతడి ఇంటిని, కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చెయ్యటం లేదు. కేవలం అతడిని చూసి, అతడి గాలి సోకి, ఆనందించగల మామూలు మనిషిగా ఉంటాను,' అని సిమి గరేవాల్ షోలో రేఖ చెప్పింది. సూపర్‌స్టార్ అమితాబ్ ఆకర్షణలో, ప్రేమలో రేఖ తలమునకలైంది. అయితే దీనిపై అమితాబ్ అధికారికంగా ఏనాడూ స్పందించలేదు.


అమితాబ్‌తో పరిచయం

బీచ్ అపార్ట్‌మెంట్స్‌లో, రేఖ, జయ తరచుగా కలుసుకునేవారు. రేఖ జయను ఆప్యాయంగా 'దీదీ భాయ్' అని పిలుస్తూ, ఆమెతో గడపడానికి జయ ఫ్లాట్‌కి వెళ్తూ ఉండేది. జయ రేఖకు జీవితం, వృత్తి గురించి సలహాలు ఇస్తూ ఉండేది. అక్కడే రేఖ జయ సన్నిహితుడు, స్నేహితుడైన అమితాబ్ బచ్చన్‌ను మొదటిసారి కలుసుకుంది.

జయ మీద కినుక...

నటుడు మెహమూద్ అధికారిక జీవిత చరిత్ర రచయిత హనీఫ్ ఝవేరి ఇలా అంటాడు. 'అమితాబ్, అన్వర్(మెహమూద్ సోదరుడు) సన్నిహితులు. అమితాబ్, జయలను తరచూ లాంగ్ డ్రైవ్‌లకు తీసుకెళ్లేవాడినని అన్వర్ నాతో చెప్పాడు. ఇద్దరూ అతనితో పాటు కారు, ముందు సీటులో కూర్చొని మాట్లాడుకునేవారు. వెనుక సీటులో రేఖ కూర్చునేది.' జయ, రేఖ ఒక రకంగా సినీ పరిశ్రమలో పోటీదారులు అయినప్పటికీ, జయ ఎంతో ప్రతిభావంతురాలిగా మంచి గౌరవం పొందింది. ఒక ఇంటర్వ్యూలో రేఖపై వ్యాఖ్యానించమని జయను అడిగితే.. రేఖ తనను తాను నటిగా సీరియస్‌గా తీసుకోలేదని జయ చెప్పింది. ఆ ఇంటర్వ్యూలో జయ మాటలు రేఖకు ఏమాత్రం నచ్చలేదని చెబుతారు.

అమితాబ్-జయ నటించిన 'జంజీర్' విజయం సాధించిన తర్వాత అమితాబ్, జయ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. 1973, జూన్ 3వ తేదీన, వారి వివాహం ఘనంగా జరిగింది. అయితే రేఖకు ఆహ్వానం అందకపోవటం ఆమెకు బాధ కలిగించింది. ఒక ఇంటర్వ్యూలో రేఖ మాట్లాడుతూ, 'ఒకప్పుడు నేను జయను సోదరిగా భావించాను. ఆమె ఆపేక్ష నిజమనుకున్నాను. ఎందుకంటే ఆమె చాలా గంభీరంగా, ప్రేమపూర్వకంగా నాకు సలహాలు ఇచ్చేది. కానీ నాకొక్కదానికే కాదు, ఆమె అందరికీ సలహాలిస్తుందని ఇప్పుడు నేను తెలుసుకున్నాను. ఆమెకు కావలసింది మనుషుల మీద ఆధిపత్యం చలాయించటం మాత్రమే. అది కూడా తనకు అవసరమైనంత వరకే!' రేఖ అంతటితో ఆగలేదు. 'ఆమె పైపైన ఎంత ఆప్యాయత, స్నేహం చూపించినా, నేను తానుండే బిల్డింగ్‌లోనే ఉంటున్నా. తన పెళ్లికి మాత్రం నన్ను ఆహ్వానించలేదు' అంటూ జయ మీద కినుక వ్యక్తం చేసింది.



బచ్చన్ ప్రభావం

అందరిలాగే, రేఖ కూడా అమితాబ్ వ్యక్తిత్వాన్ని చూసి అప్రతిభురాలైంది. 2004లో సిమి గరేవాల్‌తో ఒక ప్రముఖ ఇంటర్వ్యూలో, 'మిస్టర్ అమితాబ్ బచ్చన్ ముందు నిలబడటం తేలికైన విషయం కాదు' అని, 'దో అంజానే'లో అమితాబ్ నాయకుడన్న విషయం తెలియగానే ఆమెకు మతిభ్రమించినంత పనైందని చెప్పింది. షూటింగ్ సమయంలో తనకెంతో భయంభయంగా ఉండేదని రేఖ గుర్తు చేసుకుంది. భయాందోళనలతో తాను చెప్పవలసిన డైలాగులు మరచిపోతుంటే అమితాబ్ బచ్చన్ ఒక రోజు తన మంద్రస్వరంలో గంభీరంగా ఆమెను మందలించాడని నవ్వుతూ చెప్పింది రేఖ.

> 'నేను చేస్తున్న పనిని ఒక సరదాగా భావిస్తాను. అమ్మాయిలు కాలేజీ ఎగ్గొట్టినట్లు నేను షూటింగ్ ఎగ్గొడతాను. అయితే వాళ్లు కాలేజీలకు డబ్బు చెల్లిస్తారు. నా విషయంలో నిర్మాతలు నాకు డబ్బు చెల్లిస్తారు. ఎంత ధైర్యంగా కనిపించినా నా కోసం వెదికి, వేటాడే నిర్మాతలంటే నాకు ఎంతో భయం. స్నేహితుల దగ్గర దాక్కుని, మరునాడు సెట్స్‌లో అనారోగ్యంగా ఉన్నట్లు నటిస్తాను' అంటుంది రేఖ.

> సూటిగా, ధైర్యంగా, రహస్యాల, గోప్యతల ముసుగులు విడిచి రేఖ బాహాటంగా చేసే ప్రకటనలు కలకలం సృష్టించాయి. అయితే ఆమె మాటల్లో నిజానిజాలు నిర్ధారించటం సాధ్యం కాదు. ఈ పరిస్థితిలో ఎవరికి తోచినట్లు వాళ్లు ఊహాగానాలు చేస్తూ, బచ్చన్ పరివారానికి సంఘంలో ఉన్న నిష్కళంకమైన పేరు ప్రతిష్ఠల మీద రేఖ దాడి మొదలు పెట్టినట్లు భావించారు.

ఇంకా ఆమె ఇలా చెప్పింది. 'అమితాబ్ లాంటి వాళ్లను నేను మునుపెన్నడూ చూసి ఉండలేదు. ఇన్ని మంచి లక్షణాలు ఒకే మనిషిలో ఎలా ఉండగలవు? నేను మూర్ఖురాలిని కాను, తెలివైనదానిననే అనుకుంటున్నాను. ఉత్తమత్వాన్ని చూసినప్పుడు గుర్తించగలను'. అమితాబ్ అంకితభావం, చిత్తశుద్ధి, వృత్తిపట్ల శ్రద్ధ రేఖ మనసును చూరగొని, మంత్రముగ్ధురాలిని చేశాయి. అతడు ఆమెపై చూపుతున్న ప్రభావం అందరికీ స్పష్టంగా కనిపించింది.

దీన్ని 'బచ్చన్ ఎఫెక్ట్' (బచ్చన్ ప్రభావం) అని పిలవచ్చేమో గాని రేఖ తన జీవితంలో ఎప్పుడూ చేయని పని ఇప్పుడు చేయటం ప్రారంభించింది. ఆమె 'దో అంజానే' సెట్స్‌కి ఉదయం 6 గంటలకు, అంటే సరైన సమయానికి చేరుకోవటం అందరినీ ఆశ్చర్యపరిచేది. ఆమెలో మార్పు అక్కడితో ఆగలేదు. తన పాత్ర గురించి లోతుగా ఆలోచించడం మొదలు పెట్టి, అమితాబ్‌లాగానే పాత్ర చిత్రణలో చక్కటి అంశాలను చర్చించసాగింది. దశాబ్దాల పాటు సినీ పరిశ్రమను ఉర్రూతలూగించే ప్రణయగాథకు అలా రంగం సిద్ధమైంది! 'దో అంజానే' కారణంగా అందరి దృష్టికి వచ్చిన విషయం ఒకటి లేకపోలేదు. రేఖ తొలిసారి ఒక చక్కటి నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఈ ఒక్క చిత్రం రేఖకు కొత్త గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఔను, ఆమె తహతహలాడిన గౌరవం. దీనికి సంబంధించిన గొప్పతనమంతా అమితాబ్‌కే చెందుతుందన్నది రేఖ. ఒక వ్యక్తిలో ఆమె కోరుకున్న ప్రతి సుగుణానికి అతడు చిహ్నమైనాడు. రేఖ నెమ్మదినెమ్మదిగా అమితాబ్‌ను ప్రేమించసాగింది.

విడిపోవాలని నిర్ణయించుకుంది.

'చిన్నతనంలో నా మీద మా అమ్మ ప్రభావం ఉన్నట్లే, యౌవనంలో ఆ ప్రభావం నా జీవితంపై ప్రగాఢమైన ముద్ర వేసింది. సమయపాలన, మౌనం, క్రమశిక్షణ, అంకితభావం, ఏకాగ్రత వంటి వృత్తి నైపుణ్యాలు నేను అతడి నుండి నేర్చుకున్నాను. అతడు నా ప్రవర్తనను, జీవనశైలిని ప్రభావితం చేశాడు. నేను శాకాహారిగా మారి, ప్రమాదకరంగా జీవించడం మానేశాను. మార్పు మాత్రమే కాదు, ఆ మార్పు జరిగిన ప్రక్రియ కూడా ఎంతో అందమైనది' అని ఆమె భావనా సోమయాతో చెప్పింది. 'ముఖద్దర్ కా సికందర్' విడుదల తర్వాత అమితాబ్ రేఖతో కలసి పనిచేయడంపై అతడి భార్య జయ నిషేధం విధించినట్లు విశ్వసనీయ సమాచారం సినీపరిశ్రమలో వేగంగా వ్యాపించింది. ఈ విషయం గురించి రేఖ మాట్లాడుతూ, 'ఒక వారం తర్వాత (ముఖద్దర్ కా సికందర్ ట్రయల్ షో తర్వాత) సినీ పరిశ్రమలో ప్రతి ఒక్కరూ నాతో, 'అతు', నాతో పనిచేయనని తన నిర్మాతలకు స్పష్టం చేశాడని చెప్పటం మొదలెట్టారు. కానీ అతడు నాతో ఈ విషయమై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. నేను అతడిని దాని గురించి ప్రశ్నించడానికి ప్రయత్నించినప్పుడు, అతడు 'ఆ విషయం నన్ను అడగవద్దు, దాని గురించి నేను ఒక్క మాట కూడా మాట్లాడను' అని తేల్చి చెప్పాడు' అని చెప్పింది.

అదే ఇంటర్వ్యూలో, తాను ఎప్పుడూ ధరించే రెండు ఉంగరాలను అమితాబ్ తనకు బహుమతి చేశాడని ఆమె పేర్కొంది. తనతో కలసి పనిచేయడానికి అమితాబ్ నిరాకరించటంతో, ఆమె ఆ రెండు ఉంగరాలను తిరిగి ఇచ్చి అతడితో విడిపోవాలని నిర్ణయించుకుంది. ఆమె మాటల్లోనే, 'సహజంగానే నేనెంతో కలతపడ్డాను, మేము ఆ తర్వాత విడిపోయాము. ఆ సమయంలో నేను 'ఖూబ్‌సూరత్'లో పని చేస్తున్నాను. నా పాత్రలో త్రికరణశుద్ధిగా లీనమైనాను. సినిమా చివరిభాగంలో నేను నా రెండు ఉంగరాలు ధరించకపోవటం మీరు గమనించవచ్చు. అవి 'అతడిచ్చిన' ఉంగరాలు, నేను వాటిని నిద్రపోయేప్పుడు కూడా వేళ్ల నుండి తియ్యను. కానీ విడిపోయినప్పుడు నేను వాటిని అతడికి తిప్పి పంపాను'.

స్వయంసిద్ధ
ఒక అభినేత్రి జీవనరేఖ
ప్రచురణ: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
ధర: రూ.350;
ప్రతులకు: శ్రీదేవి మురళీధర్ (99081 32166)



అమితాబ్ అవలంభించిన తీరు తనను తీవ్రంగా బాధించిందని రేఖ పేర్కొంది. ఆమెతో పని చేయకూడదన్న అతడి నిర్ణయానికి జయను బాధ్యురాలిగా నిందించింది. జయ వేదనకంటే తాను అనుభవించే బాధ ఎంతో ఎక్కువ అని రేఖ నాటకీయకంగా నొక్కి చెప్పింది. 'కొంతకాలం క్రితం ఓ అవార్డు ఫంక్షన్‌లో నేను కొన్ని కవిత్వ పంక్తులు గానం చేశాను. అందరూ ఆ పంక్తులు 'అతడి'కోసం ఉద్దేశించానని పొరబడ్డారు. నిజానికి ఆ మాటలు జయను ఉద్దేశించి అన్నాను', అని రేఖ చెప్పింది.

అక్కడ రోజంతా చదువుకోవచ్చు...

"పాఠాలు చెప్పడంతోనే టీచర్ బాధ్యత తీరిపోదు. పిల్లల్లో జ్ఞానాన్ని పెంచాలి. సొంత నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం కలిగించాలి" అంటారు మమతా సింగ్. ఆమె నెలకొల్పిన గ్రంథాలయం పిల్లలకే కాదు, పెద్దలకూ విజ్ఞానాన్ని పంచుతోంది. ఏ సీజన్‌లోనైనా రోజంతా తెరిచి ఉండే లైబ్రరీగానూ అది ప్రసిద్ధి చెందింది. అయితే దీని ఏర్పాటు కోసం మొదట్లో ఎన్నో అభ్యంతరాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నానంటున్న మమతాసింగ్ కథ ఆమె మాటల్లోనే...

"సావిత్రీబాయి ఫూలే పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేస్తానని చెప్పినప్పుడు మా గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. "మీ అమ్మ పేరు పెట్టుకో. లేదా మరేదైనా పేరు పెట్టుకో. ఆ పేరు మాత్రం వద్దు" అని కరాఖండిగా చెప్పారు. "సావిత్రీబాయి గొప్ప సంఘ సేవకురాలు. భారత దేశంలోని మొదటి బాలికల పాఠశాలకు తొలి మహిళా టీచర్. దాన్ని మీరు ఎందుకు వద్దంటున్నారు?" అని ప్రశ్నించాను. కానీ దానికి సమాధానం నాకు తెలుసు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కుల వ్యవస్థ చాలా బలంగా ఉంటుంది. ఎవరైనా కళాశాలలు, పాఠశాలలు పెట్టాలనుకుంటే... వాళ్ళ అమ్మ పేరో, నాన్న పేరో పెట్టుకుంటారు. సావిత్రీబాయి దళితురాలు, మహిళ. కాబట్టే ఈ అభ్యంతరాలు. కానీ ఆమె బాలికా విద్య కోసం ఎంతగానో పాటుపడ్డారు. అందుకే ఎవరు ఏమన్నా నేను తలవంచలేదు. అలా 2018 జనవరిలో... 'సావిత్రీబాయి ఫూలే గ్రంథాలయం' ఉత్తరప్రదేశ్ అమేథీ జిల్లాలో నా స్వగ్రామమైన అగ్రేసర్‌లో ప్రారంభమయింది. దీని స్థాపన వెనుక ప్రధాన కారణం... ఉపాధ్యాయురాలిగా పాఠాలతో పాటు విజ్ఞానాన్ని, ఆలోచనాశక్తినీ అందించాలన్న కోరిక, పుస్తక పఠనం అంటే నాకున్న ఆసక్తి.



నా చిన్నప్పటి కల...

మా అమ్మ, నాన్న ఇద్దరూ టీచర్లే. చదువుకోవడానికి మంచి వాతావరణం ఉండేది. ఇంట్లో మ్యాగజైన్లు కొనేవాళ్ళు. బడి పాఠాలతో పాటు... కథల పుస్తకాలు ఎక్కువగా చదివేదాన్ని. నెలకు కనీసం ఎనిమిది, తొమ్మిది పుస్తకాలైనా పూర్తి చేసేదాన్ని. నాకు ఒక ప్రత్యేకమైన గది ఉండాలి. అది పై నుంచి కిందవరకూ పుస్తకాలతో నిండి ఉండాలి. ఇదీ నా చిన్నప్పటి కల. అయితే అది లైబ్రరీ కూడా కావచ్చని అప్పట్లో నేను ఊహించలేదు. మొదట్లో నన్ను బాగా చదువుకోవాలని చెప్పిన అమ్మానాన్నా... నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు... చదువు మాన్పించేశారు. పెళ్ళి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. అయితే నా అన్నలిద్దరూ ప్రోత్సహించడంతో... ప్రైవేటుగానే గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. పోటీ పరీక్షలు కూడా రాశాను. వివాహం అయిన వెంటనే... టీచర్ సెలక్షన్ ఎగ్జామ్ రాసి, సెలక్ట్ అయ్యాను. అలా 2002లో అధ్యాపకురాలుగా కెరీర్ మొదలైంది. నిజం చెప్పాలంటే ఇదేదీ నేను ప్రణాళిక వేసుకొని చేసింది కాదు. టీచర్ అవుతానని అస్సలు అనుకోలేదు. కానీ తొందరలోనే ఆ వృత్తి ఎంతగానో నచ్చింది. పిల్లలకు పాఠాలు చెబుతున్నప్పుడు ఒక విషయం గ్రహించాను. వాళ్ళు తరగతిలో చెప్పేవి కష్టపడి గ్రహిస్తున్నా... అంతకుమించిన పరిజ్ఞానమేదీ లేదు. అది పుస్తక పఠనం ద్వారానే వస్తుంది. కానీ మా ఊళ్ళో వాళ్ళకి పుస్తకాలు అందుబాటులో లేవు. ఈ అంతరాన్ని తగ్గించి, వారిని పుస్తకాలకు చేరువ చేయాలంటే... నేనే లైబ్రరీ ఏర్పాటు చేస్తే మంచిదనుకున్నాను. దాని ఫలితమే 'సావిత్రీబాయి ఫూలే లైబ్రరీ'. మా ఊరిలో అదే మొదటి గ్రంథాలయం. నా దగ్గర ఉన్న పుస్తకాలను అందులో ఉంచాను. మరికొన్ని పుస్తకాలు కొన్నాను. కథలు, జనరల్ నాలెడ్జ్ లాంటి వాటికి ప్రాధాన్యం ఇచ్చాను. పుస్తకాలు చదవడం, తరగతులు ముగిశాక వాటి గురించి చర్చించడం లాంటివి ప్రోత్సహించాను. పిల్లలు కూడా ఎంతో ఉత్సాహం చూపించారు.



అంతా ఉచితం...

ఆశ్చర్యమేమిటంటే... క్రమంగా వయోధికులు, మహిళలు కూడా లైబ్రరీకి రావడం మొదలుపెట్టారు. ఖాళీ సమయాల్లో చిన్న చిన్న బాధ్యతలు కూడా తీసుకోవడానికి ముందుకొచ్చారు. గ్రామ పెద్దల వైఖరిలో కూడా మార్పు కనిపించింది. దాంతో నాకో ఆలోచన వచ్చింది... లైబ్రరీని రోజంతా తెరిచి ఉంచితే ఎలా ఉంటుందని. ఎవరు ఎప్పుడైనా రావచ్చు. తమకు కావలసిన పుస్తకాన్ని చదువుకోవచ్చు లేదా ఇంటికి తీసుకువెళ్ళి, చదివి తిరిగి ఇవ్వవచ్చు. ఈ ప్రతిపాదన అందరికీ నచ్చింది. ఇప్పుడు... వర్షాకాలమైనా, శీతాకాలమైనా, వేసవి సెలవుల్లోనైనా... పండగలైనా, మరే సెలవులు వచ్చినా... మా లైబ్రరీ పని చేస్తూనే ఉంటుంది. డెబ్బైల వయసున్నవారి నుంచి ఏడేళ్ళ వయసువారి వరకూ ఇక్కడికి వస్తారు. వారికి నచ్చినవి చదువుకుంటారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. రోజూ పొద్దున్నే లైబ్రరీకి వచ్చి, వార్తాపత్రికలు చదివి... ఆ తరువాత తమ పనులకు వెళ్ళేవారు ఎంతో మంది ఉన్నారు. మంచి పుస్తకాలను ఎవరైనా సూచిస్తే... వాటిని తెప్పిస్తున్నాను. ఇక్కడ అంతా ఉచితం. ఎలాంటి మెంబర్‌షిప్ ఛార్జీలూ తీసుకోవడం లేదు. ఎక్కువగా నా సొంత డబ్బే ఖర్చు చేస్తున్నాను. ప్రస్తుతం బడి, లైబ్రరీ... ఇవే నా లోకమైపోయాయి. నేను ఏ రోజైనా పూజ చేయడం మానేశానేమో కానీ... లైబ్రరీకి వెళ్ళడం మానలేదు. తీర్థయాత్రల్లాంటి వాటికన్నా... ఎక్కడైనా మంచి పుస్తకాలు దొరుకుతాయంటే అక్కడికి వెళ్ళి తీసుకొస్తాను. దీని వెనుక నా స్నేహితుల సహకారం కూడా ఎంతో ఉంది. దూరప్రాంతాల్లో ఉన్నవాళ్ళు పుస్తకాలను పంపిస్తూ ఉంటారు. ఎక్కడినుంచైనా బరువైన పార్సిల్ వచ్చిందంటే... వాటిలో కచ్చితంగా పుస్తకాలే ఉంటాయని... పోస్ట్‌మ్యాన్లు నేరుగా మా లైబ్రరీకి తీసుకొచ్చేస్తారు. ఇప్పుడు పక్క గ్రామాల వాళ్ళు కూడా మా ఊరికి వచ్చి, పుస్తకాలు తీసుకువెళ్తున్నారు. తమ ఊళ్ళలో ఇటువంటి లైబ్రరీల ఏర్పాటుకోసం నన్ను సంప్రతిస్తున్నవారు కూడా ఉన్నారు. ఇలా రోజంతా నడిచే మా లైబ్రరీ నమూనాను అధ్యయనం చెయ్యడానికి అధికారుల బృందాన్ని రాష్ట్రప్రభుత్వం పంపింది. త్వరలోనే ఇతర

నవ్య | చిత్రజ్యోతి



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా రూపొందుతున్న చిత్రం 'టిల్లూ స్క్వేర్'. అనుపమా పరమేశ్వరన్ కథానాయిక. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో నాగవంశీ నిర్మిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.

మాస్ మెచ్చేలా బెల్లంకొండ సినిమా




బెల్లంకొండ శ్రీనివాస్ కొత్త సినిమా తొలి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. సాగర్‌చంద్ర దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రానికి రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మాతలు. ఈ భారీ షెడ్యూల్‌లో కీలకసన్నివేశాలను పూర్తిచేశారు. అత్యుత్తమ సాంకేతికనిపుణులు పనిచేస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన వర్కింగ్‌స్టిల్స్‌ని ఆదివారం విడుదల చేశారు. ఈ నెల 3న బెల్లంకొండ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌ను, ఫస్ట్‌లుక్‌ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలిపారు. బెల్లంకొండ పాత్ర అత్యంతశక్తిమంతంగా ఉంటుందని, మాస్ ప్రేక్షకులు మెచ్చే కథ, కథనాలతో రూపొందుతోన్న ఈ చిత్రం తప్పకుండా మంచి విజయం సాధిస్తుందని నిర్మాతలు నమ్మకం వెలిబుచ్చారు. ఈ చిత్రానికి కెమెరా: ముఖేష్ జ్ఞానేష్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణం: 14రీల్స్ ప్లస్.



'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'

కోలీవుడ్ హీరో విజయ్ నటిస్తున్న 68వ చిత్రం టైటిల్‌ను నిర్మాణ సంస్థ ఏజీఎస్ ప్రొడక్షన్స్ ఆదివారం ప్రకటించింది. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌పై 'వెలుతురు చీకటిని మింగేయగలదు.. కానీ, చీకటి వెలుతురును వింగలేదు' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఈ చిత్రంలో విజయ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. మీనాక్షి చౌదరి, స్నేహ, లైలా, రాఘవ లారెన్స్, ప్రశాంత్, మైక్ మోహన్, ప్రేమ్‌జీ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్నారు.



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందించిన ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు.

టీనేజ్ లవ్‌స్టోరీ



ఓ యదార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు శ్రీనాథ్ పులకురం తెరకెక్కించిన టీనేజ్ లవ్‌స్టోరీ 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు 500143'. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. గాయని మంగ్లీ ఆలపించిన 'దూడుం డుక్కుడుం' పాటను సంగీత దర్శకుడు జీవీప్రకాశ్ కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ గీతానికి సాయికిరణ్ సాహిత్యం అందించారు. కార్తిక్ రోడ్రిగ్జ్ స్వరాలు సమకూర్చారు. ప్రణవ్ సింగంపల్లి, రామ్ పటాస్ ముఖ్య తారాగణం. భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మాత.

జీవితం చెప్పిన కథ



దేవ్, ప్రియ చౌహాన్, సరిత ప్రధాన తారాగణంగా మురళీ రామస్వామి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దీనమ్మ జీవితం'. వై మురళీకృష్ణ, డి. దివ్యసంతోషి, బి సోనియా నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'డిఫరెంట్ కంటెంట్‌తో వస్తున్న చిత్రమిది. తమిళంలోనే కాదు తెలుగులోనూ కంటెంట్ ఆధారిత సినిమాలు తీయగలరని నిరూపిస్తుంది' అని చెప్పారు. సమాజంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా అల్లుకున్న కథ ఇది, పెద్ద విజయాన్ని అందుకుంటామనే నమ్మకం ఉందని దేవ్ అన్నారు.

బ్రహ్మానందంకు స్వర్ణకంకణం ప్రదానం 3న



ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ రాగ సప్తస్వరం 35వ వార్షికోత్సవం సందర్భంగా ప్రఖ్యాత హాస్య నటుడు బ్రహ్మానందంకు జీవన సాఫల్య పురస్కారంతో పాటు స్వర్ణ కంకణం ప్రదానం చేయనున్నారు. ఈ నెల 3న రవీంద్రభారతిలో సాయంత్రం 6గంటలకు జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. దీంతో పాటు ప్రముఖ నాట్య గురువు సుజత వింజమూరికి ఆత్మీయ సత్కారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాగసప్తస్వరం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ బుధవారం జరగనున్న వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ లక్ష్మణ్, నటుడు మురళీమోహన్ హాజరవుతారని తెలిపారు.

ఫైవ్స్ హాకీ కెప్టెన్‌గా రజని

FIH HOCKEY5s WORLD CUP



పురుషుల టీమ్‌కు సిమ్రన్‌జీత్ ● ఎఫ్ఐహెచ్ వరల్డ్‌కప్ జట్ల ఎంపిక

న్యూఢిల్లీ: ప్రయోగాత్మక హాకీ ఫైవ్స్ వరల్డ్‌కప్ కోసం భారత మహిళలు, పురుషుల జట్లను ఎంపిక చేశారు. ఈనెల 24 నుంచి 27 వరకు ఒమన్‌లో జరిగే మహిళల వరల్డ్‌కప్‌లో తిరుపతికి చెందిన రజని యతిమరపు భారత హాకీ జట్టు కెప్టెన్‌గా ఎంపికైంది. 33 ఏళ్ల ఈ వెటరన్ గోల్‌కీపర్ సారథ్య బాధ్యతలు తీసుకోవడం ఇదే మొదటిసారి. 2009లో అరంగేట్రం చేసిన తనకు ఒలింపిక్స్, వరల్డ్‌కప్, ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొన్న అనుభవం ఉంది. అలాగే 2016 ఆసియా చాంపియన్‌షిప్స్, 2017 మహిళల హాకీ ఆసియాకప్‌లో స్వర్ణం సాధించిన భారత జట్టులో సభ్యురాలు. పూల్ 'సి'లో ఉన్న భారత మహిళలకు నమీబియా, పోలెండ్, అమెరికా పోటీనివ్వనున్నాయి. 'అంతర్జాతీయ అనుభవం కలిగిన యువ ప్లేయర్లతో మహిళల జట్టును ఎంపిక చేశాం. సవాళ్లను దీటుగా ఎదుర్కొనే సత్తా వీరికి ఉంది' అని కోచ్ సౌందర్య యెండల తెలిపింది. సౌందర్య స్వస్థలం నిజామాబాద్. మరోవైపు జనవరి 28 నుంచి 31 వరకు ఒమన్‌లోనే జరిగే పురుషుల వరల్డ్‌కప్‌లో భారత జట్టు సిమ్రన్‌జీత్ సింగ్ ఆధ్వర్యంలో బరిలోకి దిగబోతోంది. పూల్ 'బి'లో భారత్‌తో పాటు ఈజిప్టు, జమైకా, స్విట్జర్లాండ్ జట్లున్నాయి. పురుషుల, మహిళల విభాగాల్లో 16 జట్లు చొప్పున పాల్గొంటున్నాయి.

మహిళల జట్టు షెడ్యూల్		
ప్రత్యర్థి	తేదీ	సమయం
పోలెండ్	జనవరి 24	సా.4.50
అమెరికా	జనవరి 24	రాత్రి 1.10
నమీబియా	జనవరి 25	సా.6.30
పురుషుల జట్టు షెడ్యూల్		
స్విట్జర్లాండ్	జనవరి 28	మ.3.10
ఈజిప్టు	జనవరి 28	రా.11.30
జమైకా	జనవరి 29	మ.1.30

ఏమిటీ.. హాకీ ఫైవ్స్

టీ20 క్రికెట్ తరహాలోనే హాకీ ఫైవ్స్ అనేది సూపర్ ఫాస్ట్‌గా ముగిసే మ్యాచ్. కేవలం 20 (10+10) నిమిషాలపాటు మాత్రమే ఆట సాగుతుంది. మధ్యలో రెండు నిమిషాల విరామం ఉంటుంది. అలాగే రెగ్యులర్ హాకీ మ్యాచ్‌లా 11 మంది కాకుండా ఇందులో గోల్‌కీపర్‌తో కలిపి మొత్తం ఐదుగురు మాత్రమే ఆడుతారు. నలుగురు సబ్‌స్టిట్యూట్స్‌లను అనుమతిస్తారు. విస్తీర్ణం కూడా రెగ్యులర్ కోర్టులో సగం మాత్రమే ఉంటుంది. 'డీ' సర్కిల్ కూడా కనిపించదు. దీంతో మైదానంలో ఎక్కడి నుంచైనా ప్లేయర్ గోల్ చేయవచ్చు. తొలిసారిగా 2014 యూత్ ఒలింపిక్ గేమ్స్‌లో అడుగిడిన ఈ క్రీడ, ఇప్పుడు 60 దేశాల్లో ప్రాచుర్యం పొందింది.

ఉత్కంఠ పోరులో యోధాస్ విజయం

కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2లో తెలుగు యోధాస్ జట్టు 2023 ఏడాదిని విజయంతో ముగించింది. ఆదివారం కటక్‌లో జరిగిన తమ ఐదో మ్యాచ్‌లో యోధాస్ ఒక్క పాయింట్ తేడాతో గెలిచింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో ఆట ఆఖరి నిమిషంలో కీలక పాయింట్ సాధించిన యోధాస్ 29-28తో ఒడిశా జగర్‌నాట్స్‌పై విజయం సాధించింది. యోధాస్ కెప్టెన్ ప్రతీక్ 10 పాయింట్లతో, జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు.

మూడో టీ20లో కివీస్ గెలుపు

సిరీస్ సమం

మౌంట్‌మాంగనుయ్ (న్యూజిలాండ్): స్వల్ప స్కోర్ల ఆఖరి టీ20లో 17 పరుగుల (డ/లూ)తో గెలుపొందిన న్యూజిలాండ్..బంగ్లాదేశ్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో డ్రా చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పర్యాటక జట్టు తొలుత 19.2 ఓవర్లలో 110 పరుగులకే కుప్పకూలింది. శాంట్నర్ (4/16) నాలుగు వికెట్లు సాధించాడు. స్వల్ప ఛేదనలో షోరిఫుల్ (2/17), మెహ్దీ హసన్ (2/18) దెబ్బకు 49/5తో న్యూజిలాండ్ ఇక్కట్లలో పడింది. అయితే నీషమ్ (28 నాటౌట్), శాంట్నర్ (18 నాటౌట్) ఆరో వికెట్‌కు 46 పరుగులు జోడించారు. ఈ దశలో వర్షంతో మ్యాచ్ నిలిచిపోవడంతో..అప్పటికి 14.4 ఓవర్లలో 95/5 స్కోరుతో ఉన్న కివీస్‌ను విజేతగా ప్రకటించారు. కాగా ఈ రెండుజట్ల మధ్య రెండో టీ20 వర్షంతో రద్దయింది.

భారత పేసర్ల సమర్థతకు పరీక్ష

అలెన్ డొనాల్డ్

కేప్‌టౌన్: తొలి టెస్టులో భారత్ ఓటమికి, దక్షిణాఫ్రికా విజయానికి బౌలర్లే కారణమని దిగ్గజ పేసర్ అలెన్ డొనాల్డ్ అభిప్రాయపడ్డాడు. 'సెంచూరియన్ కంటే రెండో టెస్టు జరగనున్న కేప్‌టౌన్ పిచ్ బౌలర్లకు మరింత కఠిన పరీక్ష పెట్టనుంది. ఇక్కడ వికెట్లు కావాలంటే భారత బౌలర్లు తెలివిగా బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే భారత బౌలర్ల సమర్థతకు ఇదొక పరీక్ష. ఇక్కడ స్పిన్నర్లకు ఎలాంటి సహకారం లభించదు. తొలి ఇన్నింగ్స్‌లో పేసర్లకు అనుకూలిస్తుంది' అని డొనాల్డ్ తెలిపాడు.

టాప్‌లో గుజరాత్ జెయింట్స్

నోయిడా: ప్రొ కబడ్డీ సీజన్-10లో గుజరాత్ జెయింట్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 51-42తో బెంగాల్ వారియర్స్‌పై నెగ్గి, 32 పాయింట్లతో టాప్‌నకు చేరుకుంది. గుజరాత్ రైడర్ ప్రతీక్ దహియా 25 పాయింట్లతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం పాయింట్లలో సగం సాధించిన ప్రతీక్‌నే గుజరాత్ విజయానికి కారణం. బెంగాల్ రైడర్లు నితిన్ (12 పాయింట్లు), మణిందర్ (11 పాయింట్లు), శ్రీకాంత్ (9 పాయింట్లు) రాణించినా, ప్రతీక్ దెబ్బకి పరాజయం పాలవక తప్పలేదు. మరో ఉత్కంఠభరిత మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 38-37తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది.

ఐపీఎల్.. మరో ఒలింపిక్స్



జస్టిన్ లాంగర్


న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా మాజీ కోచ్ జస్టిన్ లాంగర్ ఐపీఎల్‌ను ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌తో పోల్చాడు. ప్రస్తుతం అతను ఆండీ ఫ్లవర్ స్థానంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్రధాన కోచ్‌గా వ్యవహరించబోతున్నాడు. 'ఐపీఎల్ అతిపెద్ద టోర్నమెంట్. ఒలింపిక్ గేమ్స్ తరహాలోనే పోటీలు భారీ స్థాయిలో జరుగుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది తిలకించే ఈ టోర్నీలోని ప్రతీమ్యాచ్ ప్రేక్షకుల సందడి మధ్య అద్భుతంగా సాగుతుంటుంది. ఇలాంటి టోర్నీలో నేను కూడా భాగం కాబోతున్నందుకు సంతోషంగా ఉంది' అని లాంగర్ తెలిపాడు.

ఒలింపిక్ నామ సంవత్సరం



2024 స్పోర్ట్స్ క్యాలెండర్

కొత్త ఏడాది..క్రీడాకారులకు పండుగే పండుగ. ప్రపంచవ్యాప్త అథ్లెట్లందరికీ ఘనమైన ఆటల వేదిక ఒలింపిక్స్ ఈ సంవత్సరమే. పారిస్‌లో జరిగే ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా సంరంభంలో పాల్గొనడమే ప్రతి ఆటగాడి జీవిత ధ్యేయమైతే, పోటీపడి పతకం అందుకొంటే ఇక అతడి కెరీర్ ధన్యమైనట్టే. అంతటి విఖ్యాత ఈవెంట్‌లో సత్తా చాటేందుకు అథ్లెట్లందరూ ఇప్పటికే కఠోర సాధన మొదలు పెట్టేశారు..క్రికెట్‌కు సంబంధించి నూతన వత్సరంలో పురుషులు, మహిళల టీ20 వరల్డ్ కప్‌లు జరుగనున్నాయి. ఇక చదరంగానికి తలమానికంగా భాసించే క్యాండిడేట్స్ టోర్నీలో ఈ ఏడాది మన ఆటగాళ్లు ఏకంగా ఐదుగురు తలపడుతుండడం విశేషం.



ప్రధాన టోర్నీలు



- జనవరి 12-ఫిబ్రవరి 10 : ఆసియా కప్ ఫుట్‌బాల్-ఖతార్
- జనవరి 31-ఫిబ్రవరి 11: ఖేలో ఇండియా యూత్ గేమ్స్-మధ్యప్రదేశ్
- జనవరి 23-28 : వరల్డ్ టీటీ స్టార్ట్ కంటెండర్-గోవా
- ఫిబ్రవరి : ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-గువాహటి
- ఫిబ్రవరి 2-18 : వరల్డ్ అక్వాటిక్ చాంపియన్‌షిప్స్-దోహా
- ఫిబ్రవరి 16-25: వరల్డ్ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్స్-దక్షిణాఫ్రికా
- ఏప్రిల్ 11-16: ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్-కిర్గిస్థాన్
- ఏప్రిల్ 12-14 : శాఫ్ జూ.అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్-చెన్నై
- ఏప్రిల్ 20-మే 6: వరల్డ్ స్నూకర్ చాంపియన్‌షిప్స్-యూకే
- జూన్ 6 : ఎన్‌బీఏ ఫైనల్స్-అమెరికా/కెనడా
- **జూలై 6-ఆగస్టు 11: ఒలింపిక్స్- పారిస్**
- జూన్ 29-జూలై 21: టూర్ డి ఫ్రాన్స్ సైక్లింగ్-ఫ్రాన్స్
- సెప్టెంబరు 20-22 : ఇండియన్ గ్రాండ్ ప్రీ మోటో జీపీ-గ్రేటర్ నోయిడా

హాకీ

జనవరి 24-31: హాకీ ఫైవ్స్ వరల్డ్‌కప్ వేదిక -ఒమన్

- జనవరి 13-21: మహిళలు, పురుషుల ఒలింపిక్ క్వాలిఫయర్స్-స్పెయిన్, భారత్, ఒమన్
- ఫిబ్రవరి 3-9 : ప్రొ.హాకీ లీగ్, మహిళలు-భువనేశ్వర్
- ఫిబ్రవరి 10-16: ప్రొ.హాకీ లీగ్, పురుషులు-భువనేశ్వర్

బ్యాడ్మింటన్



- జనవరి 16-21 : ఇండియా ఓపెన్ -న్యూఢిల్లీ
- మార్చి 12-17 : ఆల్ ఇంగ్లండ్ -బర్మింగ్‌హామ్
- ఏప్రిల్ 28-మే 5: థామస్, ఉబెర్ కప్-చైనా
- నవంబరు 26-డిసెంబరు 1: సయ్యద్ మోదీ టోర్నీ-లఖ్‌నవూ
- డిసెంబరు 11-15: బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ ఫైనల్స్-చైనా

చెస్



- ఫిబ్రవరి 19-25: ఫిడే వరల్డ్ ర్యాండమ్ చెస్
- ఏప్రిల్ 2-25: క్యాండిడేట్స్ చెస్-కెనడా
- ఏప్రిల్ 25-29: వరల్డ్ క్యాడెట్ ర్యాపిడ్, బ్లిట్జ్-అల్బేనియా
- జూన్ 1-14: వరల్డ్ జూ. అండర్-20 చాంపియన్‌షిప్స్-న్యూఢిల్లీ
- జూన్ 22-జూలై 8: వరల్డ్ కప్-అండర్ 8, 10, 12-జార్జియా
- జూలై 1-12: వరల్డ్ సీనియర్ టీమ్ చాంపియన్‌షిప్స్-పోలెండ్
- సెప్టెంబరు 10-23: ఒలింపియాడ్-హంగేరి
- అక్టోబరు-22 - నవంబరు 2: వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్స్-బ్రెజిల్

ఫుట్‌బాల్

- జూన్ 14-జూలై 14: యూరో ఫుట్‌బాల్-జర్మనీ
- జూన్ 20-జూలై 14: కోపా అమెరికా కప్-అమెరికా

పురుషుల క్రికెట్

- జనవరి 3-7: భారత్ x దక్షిణాఫ్రికా రెండో టెస్టు
- జనవరి 11-17: భారత్‌లో అఫ్ఘానిస్థాన్ టూర్- 3 టీ20లు
- జనవరి 25-మార్చి 11: భారత్‌లో ఇంగ్లండ్ టూర్-5 టెస్టులు

మార్చి నుంచి మే మధ్య : ఐపీఎల్

- జూన్ 4-30 : ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ -వెస్టిండీస్/అమెరికా
- జూలై : శ్రీలంకలో భారత జట్టు టూర్-3 వన్డేలు, 3 టీ20లు
- సెప్టెంబరు: భారత్‌లో బంగ్లా జట్టు టూర్-2 టెస్టులు, 3టీ20లు
- అక్టోబరు: భారత్‌లో న్యూజిలాండ్ జట్టు టూర్-3 టెస్టులు
- నవంబరు-డిసెంబరు: ఆస్ట్రేలియాలో భారత్ టూర్-5 టెస్టులు



- జనవరి 3-మార్చి 14: రంజీట్రోఫీ
- జూన్ 28-జూలై 16: దులీప్ ట్రోఫీ
- జూలై 24-ఆగస్టు 3: దేవధర్ ట్రోఫీ
- అక్టోబరు 1-5: ఇరానీ కప్
- అక్టోబరు16-నవంబరు 6: ముస్తాక్ అలీ ట్రోఫీ
- నవంబరు 23-డిసెంబరు15: విజయ్ హజారే ట్రోఫీ

మహిళల క్రికెట్

ICC WOMEN'S T20 WORLD CUP

- డిసెంబరు 21-జనవరి 9: భారత్‌లో ఆస్ట్రేలియా జట్టు టూర్ - ఏకైక టెస్టు, 3 టీ20లు, 3 వన్డేలు
- ఫిబ్రవరి-మార్చి: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)
- సెప్టెంబరు-అక్టోబరు : ఐసీసీ మహిళల టీ 20 వరల్డ్‌కప్-బంగ్లాదేశ్
- డిసెంబరు: ఆస్ట్రేలియాలో భారత జట్టు టూర్-3 వన్డేలు
- డిసెంబరు: భారత్‌లో వెస్టిండీస్ జట్టు టూర్-3 వన్డేలు, 3 టీ20లు

టెన్నిస్



- జనవరి 14-28 : ఆస్ట్రేలియన్ ఓపెన్-మెల్‌బోర్న్
- మే 20-జూన్ 9: ఫ్రెంచ్ ఓపెన్-పారిస్
- జూలై 1-14: వింబుల్డన్-లండన్
- ఆగస్టు 26-సెప్టెంబరు 8: యూఎస్ ఓపెన్-న్యూయార్క్

బిజినెస్

అన్నీ మంచి శకునములే...

నూతన సంవత్సరం 2024 ఎన్నో ఆశలు చిగురింపచేస్తోంది. ఆర్థిక రంగం, ఈక్విటీ మార్కెట్లు, నియామకాలు, వేతన పెంపు అన్నింటిలోనూ ఆశావహ ధోరణులే ఉంటాయని అంటున్నారు. ప్రధానంగా కొత్త సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అన్ని రంగాలకు చోదకశక్తిగా నిలుస్తాయని మార్కెట్ పండితుల అంచనా. ఈ నేపథ్యంలో ఏఏ రంగం ఏ విధంగా ఉండవచ్చో పరిశీలిద్దాం.



ఆర్థిక రంగంలో వేగం ఖాయం

భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో సంపన్న దేశాల్లో నిరాశావహమైన వాతావరణం నెలకొన్నప్పటికీ అన్ని రకాల ఎదురుగాలులను తట్టుకుని భారత ఆర్థిక రంగం జోరును కొనసాగిస్తోంది. ద్రవ్యోల్బణం అదుపులో ఉండడం, స్థిరమైన వడ్డీ రేట్లు, శక్తివంతంగా ఉన్న విదేశీ మారకం నిల్వలు దేశీయ ఆర్థిక రంగానికి కుషన్‌లా పని చేస్తున్నాయి. ఈ వాతావరణంలో కొత్త సంవత్సరంలో కూడా భారత ఆర్థిక రంగం అదే జోరును కొనసాగిస్తూ ప్రపంచంలో వేగవంతమైన వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలవడం ఖాయమని ఆర్థికవేత్తలంటున్నారు. సర్వత్రా నిరాశా నిస్పృహలు గూడు కట్టుకున్న స్థితిలో కూడా 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో 7.7 వృద్ధి రేటుతో (క్యూ1- 7.8%, క్యూ2- 7.6%) చైనా సహా ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నింటి కన్నా ముందువరుసలో నిలిచింది. ఓఈసీడీ ఎంతో కన్జర్వేటివ్‌గా ప్రకటించిన అంచనా ప్రకారం సైతం భారత ఆర్థిక వ్యవస్థ 2024 సంవత్సరంలో 6.1% వృద్ధి సాధించే ఆస్కారం ఉంది. చైనా, బ్రెజిల్ దేశాల కన్నా ఇది చాలా మెరుగైన స్థితి. ఎన్నో ప్రతికూలతను సైతం తట్టుకుని 2023లో భారత్ వేగవంతమైన వృద్ధి సాధిస్తున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ఆర్‌బీఐ ఇటీవల విడుదల చేసిన నివేదికలో తెలిపింది.

రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో గరిష్ఠ స్థాయి 7.44 శాతంగా నమోదైనప్పటికీ నవంబరులో 5.55 శాతానికి దిగివచ్చింది. ద్రవ్యోల్బణం మరింత దిగివచ్చినట్టయితే రెపోరేట్ల తగ్గింపు ప్రక్రియకు 2024లో ఆర్‌బీఐ శ్రీకారం చుట్టవచ్చు. మరోవైపు నాలుగు నెలల విరామం అనంతరం డిసెంబరులో విదేశీ మారకం నిల్వలు 60,000 కోట్ల డాలర్ల స్థాయిని దాటడం కూడా ఎలాంటి విదేశీ ఆటుపోట్లనైనా తట్టుకోగల స్థితి ఆర్థిక రంగానికి అందిస్తుందని పరిశీలకులంటున్నారు.

ఈక్విటీల్లోకి ఎఫ్‌పీఐల పెట్టుబడుల వెల్లువ

2023లో రూ.1.7 లక్షల కోట్లు ఇన్వెస్ట్

న్యూఢిల్లీ: విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు భారత ఈక్విటీ మార్కెట్ పట్ల రోజురోజుకు మరింతగా విశ్వాసం పెరిగిపోతోంది. అంతర్జాతీయంగా పలు సవాళ్లున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉండటంతో 2023 సంవత్సరంలో ఎఫ్‌పీఐలు.. దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి రూ.1.7 లక్షల కోట్ల పెట్టుబడులను గుమ్మరించారు. ఇందులో రూ.66,134 కోట్లు ఒక్క డిసెంబరు నెలలోనే రావటం గమనార్హం. 2024లో అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలతో ఎఫ్‌పీఐలు.. రానున్న రోజుల్లో పెట్టుబడులు మరింతగా పెంచే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2023లో భారత ఈక్విటీల్లో ఎఫ్‌పీఐలు రూ.1.71 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయగా డెట్ మార్కెట్లోకి రూ.68,663 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఈ రెండింటిని కలిపితే మొత్తంగా ఎఫ్‌పీఐలు రూ.2.4 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఎఫ్‌పీఐలు 2022లో రూ.1.21 లక్షల కోట్లు, 2021లో కేవలం రూ.25,752 కోట్లు ఇన్వెస్ట్ చేయగా 2020లో మాత్రం రూ.1.7 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు.

బుల్ జోరు ఆగదు

ఈక్విటీ మార్కెట్ గత తొమ్మిది వారాలుగా కనివిని ఎరుగని బుల్‌రన్‌లో పురోగమిస్తూ చారిత్రక రికార్డులను నమోదు చేసింది. కొత్త సంవత్సరంలో కూడా ఈ జోరు అలాగే కొనసాగవచ్చని మార్కెట్ పండితుల అంచనా. వడ్డీ రేట్లు, లోక్‌సభ ఎన్నికలు, భౌగోళిక రాజకీయ అంశాలు మార్కెట్ దిశను నిర్దేశిస్తాయి. ఏదిఏమైనా వచ్చే 3-6 నెలల మధ్య కాలంలో ప్రధాన సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 7 శాతం వరకు వృద్ధి సాధించవచ్చన్నది వారి అభిప్రాయం.

రాజకీయ సుస్థిరత మార్కెట్లకు బలం చేకూరుస్తాయని పేర్కొంటూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం మంచి మెజారిటీతో తిరిగి అధికారంలోకి రావడం కీలకమని వారన్నారు. అలాగే ఎన్నికల అనంతరం వచ్చే తొలి బడ్జెట్ కూడా మార్కెట్ దిశను నిర్దేశిస్తుందంటున్నారు. వీటన్నింటికీ తోడు ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించినట్టయితే బుల్ జోరుకు ఆకాశమే హద్దవుతుందన్నది మార్కెట్ పండితుల అభిప్రాయం. అమెరికాలో బాండ్లపై రాబడులు తగ్గడంతో విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి భారత ఈక్విటీ పెట్టుబడులు ప్రారంభించడం ఒక శుభపరిణామమని వారంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కొంత అప్రమత్తమైన ఆశావహ స్థితి నెలకొందని, ఇన్వెస్టర్లు తక్షణం మూడో త్రైమాసికం ఆర్థిక ఫలితాలపై దృష్టి పెడతారని నిపుణుల అభిప్రాయం.

జాబ్ మార్కెట్ ఆశావహం

2024 సంవత్సరం ఉపాధి మార్కెట్‌కు కూడా ఆశావహంగానే ఉండవచ్చని అంటున్నారు. డేటా చోదక నియామకాలు, వేతనాల్లో రెండంకెల వృద్ధి ఉండవచ్చని మానవ వనరుల రంగం నిపుణులంటున్నారు. కంపెనీలు నిపుణులైన మానవ వనరులను నియమించుకోవడంపై దృష్టి పెట్టవచ్చు. గత కొద్ది సంవత్సరాల కాలంలో అటు యాజమాన్యాలు, ఇటు ఉద్యోగుల అంచనాల్లో విశేషమైన మార్పు ఏర్పడింది. పక్షపాత రహితమైన నియామక విధానాలు, పని ప్రదేశాల్లో మరింత అనుకూల వాతావరణం ఉండాలని ఉద్యోగులు కోరుతుండగా అత్యున్నత నైపుణ్యాలు గల వారిని నిలబెట్టుకునేందుకు అనుభవజ్ఞులకు పెద్ద పీట వేయాలని యాజమాన్యాలు భావిస్తున్నాయి. ఇందుకోసం ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలు, సానుకూల పని పరిస్థితులు, ఉద్యోగ-వ్యక్తిగత జీవితంలో సమతూకం కల్పించేందుకు యాజమాన్యాలు కృషి చేస్తున్నాయి.

2023 సంవత్సరంలో ఎడ్‌టెక్ రంగంలో పలువురు ఉద్యోగాలు కోల్పోయారు. ఐటీ రంగంలో కూడా అప్రమత్త స్థితి ఏర్పడింది. కొత్త సంవత్సరంలో ఐటీ నియామకాలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించవచ్చని, అలాగే నైపుణ్యాల ఆధారంగా వేతనాలు ఇచ్చే వైఖరి ఏర్పడవచ్చని నిపుణులంటున్నారు. కృత్రిమమేధ, ఆటోమేషన్ సంబంధిత విభాగాలు ఉపాధి రంగాన్ని ఆశావహంగా నిలపవచ్చునన్నది వారి అభిప్రాయం. అయితే 2023తో పోల్చితే కొత్త సంవత్సరంలో వేతనాలు పెంపు స్వల్పంగా తగ్గవచ్చని వారంటున్నారు.

22,025 పైన బుల్లిష్

(జనవరి 1-5 తేదీల మధ్య వారాని

అస్ట్రో గైడ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 21,731 (+382)

నిఫ్టీ గత వారం 21,801-21,329 పాయింట్ల మధ్యన కదలాడి 382 పాయింట్ల లాభంతో 21,731 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,025 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 20,659, 20,127, 19,611, 19,131 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,125 బ్రేక్‌డౌన్ స్థాయి: 21,325

నిరోధ స్థాయిలు: 21,925, 22,025, 22,125 (21,831 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 21,525, 21,425, 21,325 (21,325 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ			
హైదరాబాద్	576	విజయవాడ	580
1 జనవరి		విశాఖపట్నం	625
చిత్తూరు	608	వరంగల్	578
గోదావరి	580	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	గోదావరి	114
వరంగల్	110	విజయవాడ	114
కరీంనగర్	110	గుంటూరు	110
మహబూబ్‌నగర్	110	ఒంగోలు	110
కర్నూలు	110	చిత్తూరు	115
విశాఖపట్నం	109		

కన్సాలిడేషన్ బాటలోనే..!

కొత్త ఏడాది మొదటి వారంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మిశ్రమంగా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. బెంచ్‌మార్క్ సూచీలు ఇప్పటికే జీవితకాల గరిష్ఠాల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు ఫియర్ ఇండెక్స్‌గా భావించే ఇండియా విక్స్ పెరుగుతోంది. ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఇది సూచిస్తోంది. ప్రస్తుత అప్‌ట్రెండ్‌కు తెరపడి సూచీలు కొన్నాళ్లు కన్సాలిడేషన్‌లో సాగే వీలుంది. నిఫ్టీ ప్రస్తుతం ఉన్న 21,731 పాయింట్ల నుంచి 21,750 పాయింట్లు లేదా 21,100 పాయింట్ల వరకు కరెక్షన్‌కు లోనుకావచ్చు. ఈ దశలో ఇన్వెస్టర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభించే మంచి స్టాక్స్‌ను అక్యుములేట్ చేసుకోవాలి.

స్టాక్ రికమండేషన్స్

టాటా మోటార్స్: ఈ కౌంటర్ 2023లో పూర్తిగా బుల్లిష్ ధోరణిలో కొనసాగింది. డిసెంబరులో మూమెంటమ్ మరింత పెరిగింది. కొత్త ఏడాదిలో వాహన ధరలు పెరిగే అవకాశం ఉండటంతో లాభాదాయకత పెరగొచ్చు. గత శుక్రవారం ఈ షేరు రూ.779.40 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.700-750 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.820/950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.680 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

టాటా కన్స్యూమర్ లిమిటెడ్: సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత ఈ కౌంటర్‌లో మంచి బేస్ ఏర్పడింది. అనిశ్చితికి తావు లేకుండా షేరు ధర పెరుగుతోంది. టాటా కాఫీతో విలీనం తేదీ సమీపిస్తుండటంతో చివరి 12 సెషన్లలో ఈ షేరు 17 శాతం పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,086.80 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోని రూ.1,050 శ్రేణిలో ఎంటర్ అయి రూ.1,200/1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.970 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందుస్థాన్ యూనిలీవర్: ఈ కంపెనీ టెక్నికల్ చార్ట్ చాలా బాగుంది. మూడు వారాల నుంచి ఈ షేరు లాభాల్లోనే ముగుస్తూ వస్తోంది. సమీప నిరోధ స్థాయిని అధిగమించటంతో ట్రేడింగ్, డెలివరీ పరిమాణం పెరిగింది. రేటింగ్ సంస్థలు 'బై, హోల్డ్ కాల్స్' ఇవ్వటం సానుకూల అంశం. గత శుక్రవారం ఈ షేరు రూ.2,659.70 స్థాయిల్లో క్లోజైంది. స్వింగ్ ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.2,625/2,600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,855/2,940 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,575 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఈఎక్స్: జూన్ నెలలో ఒక్కసారిగా పతనబాటలోకి జారుకున్న ఈ షేరులో సుదీర్ఘ కాలం కన్సాలిడేషన్ జరిగింది. రూ.162 స్థాయిలో నిరోధ స్థాయి బ్రేక్ అవ్వటంతో మూమెంటమ్ వచ్చింది. గత శుక్రవారం ఈ షేరు రూ.167.30 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ షేరులో రూ.160/150 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.185/210 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.143 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్: ఎలక్ట్రిక్ బస్సులు, వాహనాలకు గిరాకీ పెరగటంతో పాటు కంపెనీకి పెద్దఎత్తున ఆర్డర్లు వస్తుండటంతో షేరు ధర పెరుగుతూ వస్తోంది. ఈ షేరులో రూ.1,300 స్థాయిలో క్రాస్‌లైన్ రెసిస్టెన్స్ బ్రేక్ అయ్యింది. వాల్యూమ్ అసాధారణంగా పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,346 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.1,310/1,330 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.1,475/1,655 టార్గెట్ ధరతో ఈ షేరును కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,270 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

21,800 వద్ద మార్కెట్ అప్రమత్తం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 21,350 నుంచి అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తూ 21,800 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్‌లో పడింది. అయినా చివరికి 380 పాయింట్ల లాభంతో ముగిసింది. వరుసగా తొమ్మిదో వారంలో కూడా ర్యాలీని కొనసాగించి రికార్డు స్థాయిలో 2,800 వరకు లాభపడింది. మిడ్‌క్యాప్ సూచీ అన్ని సూచీల కన్నా మెరుగ్గా ట్రేడి 1,100 పాయింట్లు లాభపడగా స్మాల్‌క్యాప్ సూచీ 300 పాయింట్ల మేరకు లాభపడింది. అయితే చివరి రెండు రోజుల్లో 21,800 వద్ద నిరోధం ఏర్పడినట్టు కనిపిస్తోంది. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. అమెరికన్ మార్కెట్లలో గత వారం మైనర్ బలహీనత కారణంగా ఈ వారంలో మన మార్కెట్ ఫ్లాట్/అప్రమత్తంగా ప్రారంభం కావచ్చు. గత వారం కీలక నిరోధం 21,500ని బ్రేక్ చేసిన కారణంగా పుల్‌బ్యాక్ రియాక్షన్ కూడా ఏర్పడవచ్చు. ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

బుల్లిష్ స్థాయిలు: టెక్నికల్‌గా కరెక్షన్ ఏర్పడవలసి ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం 21,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ తర్వాత కొత్త శిఖరాల్లో మానసిక అవధి 22,000 దిశగా కదులుతుంది. ఇక్కడ కన్సాలిడేషన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్‌లో పడినా మైనర్ మద్దతు స్థాయి 21,650 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మైనర్ బలహీనత మరింతగా ఏర్పడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 21,400. భద్రత కోసం మార్కెట్ ఇక్కడ తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. విఫలమైన స్వల్పకాలిక బలహీనతగా భావించాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం 800 పాయింట్ల మేరకు లాభపడి 48,300 వద్ద క్లోజయింది. తదుపరి నిరోధ స్థాయి 48,650. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 48,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి.

పాటర్న్: ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం డెయిలీ చార్టుల్లో నెగిటివ్ డైవర్జెన్స్‌తో ఓవర్‌బాట్ స్థితి కొనసాగుతోంది. 21,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద బ్రేక్‌డౌన్ అయితే అప్రమత్తత ఏర్పడుతుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	21,800, 21,855
మద్దతు	21,650, 21,570

www.sundartrends.in

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
వరంగల్ ● సోమవారం 1 జనవరి 2024
diksuchi@andhrajyothy.com



కాప్ 28

క్లయిమేట్ సమ్మిట్

యునైటెడ్ నేషన్స్ క్లయిమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్/ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ 28(కాప్ 28) దుబాయ్‌లోని ఎక్స్‌పో సిటీలో ఈ ఏడాది నవంబరు 30 నుంచి డిసెంబరు 12 వరకూ జరిగింది. 197 సభ్యదేశాలకు తోడు యురోపియన్ యూనియన్ కూటమి ప్రతినిధులు ఈ సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కాప్ అంటే ఏమిటి? కాప్ 28 ప్రత్యేకతలు, వైఫల్యాల గురించి తెలుసుకుందాం.

1992లో రియో ఎర్త్ సమ్మిట్(ధరిత్రీ సమావేశం)లో మానవ కార్యకలాపాల వల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని తగ్గించేందుకు, హరిత గృహ వాయు ఉద్గారాలను నియంత్రించే ఉద్దేశంతో 154 దేశాలు ఒక బహుళపక్ష ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీనినే యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లయిమేట్ చేంజ్(యూఎన్ఎఫ్‌సీసీసీ) అంటారు.

ఈ ఒప్పందం ప్రకారం 1995 నుంచి ఏటా ఆయా దేశాలు సమీక్షా సమావేశాలు జరుపుతున్నాయి. వీటినే కాప్(కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) సమావేశాలు అంటారు. ఆ తరవాతి కాలంలో 2015లో జరిపిన కాప్-21 సమావేశంలో చేసుకున్న ప్యారిస్ ఒప్పందం ప్రకారం ఈ శతాబ్దం చివరి నాటికి, పారిశ్రామిక విప్లవ ముందుకాలం నాటి కంటే ప్రపంచ ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్ మించకుండా ఉండేందుకు తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలను ఈ సమావేశాల్లో సమీక్షించాలి.

> శిలాజ ఇంధనాల వినియోగం గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణం. అయితే ప్రపంచ ఉష్ణోగ్రతల తగ్గింపు దిశగా పనిచేస్తున్న కాప్ సమావేశాలు ఇంతవరకూ శిలాజ ఇంధనాల గురించి ఎటువంటి చర్చనూ ప్రారంభించలేదు. ఈ సమావేశంలో తొలిసారిగా ఆ ప్రస్తావన వచ్చింది. శిలాజ ఇంధనాల నుంచి క్రమంగా వైదొలగుతూ 2050 నాటికి నికర సున్నా స్థాయి శిలాజ ఇంధన వినియోగం సాధించాలని నిర్ణయం తీసుకున్నాయి.

సమావేశ విజయం, వైఫల్యాలు విజయాలు: ఈ కాప్-28 సమావేశంలో గతంలో లేని కొన్ని చొరవలు, కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిని ఈ సమావేశ విజయాలుగా పేర్కొనవచ్చు. అవి-

1. శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనాల దిశగా పరివర్తన: శిలాజ ఇంధనాల వినియోగం గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణం. అయితే ప్రపంచ ఉష్ణోగ్రతల తగ్గింపు దిశగా పనిచేస్తున్న కాప్ సమావేశాలు ఇంతవరకూ శిలాజ ఇంధనాల గురించి ఎటువంటి చర్చనూ ప్రారంభించలేదు. ఈ సమావేశంలో తొలిసారిగా ఆ ప్రస్తావన వచ్చింది. శిలాజ ఇంధనాల నుంచి క్రమంగా వైదొలగుతూ 2050 నాటికి నికర సున్నా స్థాయి శిలాజ ఇంధన వినియోగం సాధించాలని నిర్ణయం తీసుకున్నాయి.

2. పునరుత్పాదక శక్తి వనరుల స్థాపక సామర్థ్యం మూడింతలు పెంచడం: ఈ సమావేశంలో చేసుకున్న పునరుత్పాదక, శక్తి సామర్థ్య ప్రతిజ్ఞ ప్రకారం 2030 నాటికి పునరుత్పాదక శక్తి వనరులను ప్రపంచవ్యాప్త స్థాపితశక్తి సామర్థ్యాన్ని పెంచేందుకు సభ్యదేశాలు కృషిచేయాలి. అంటే 2030 నాటికి పునరుత్పాదక శక్తివనరుల స్థాపిత శక్తి సామర్థ్యం కనీసం 11000 జీడబ్ల్యూ పెంచాల్సి ఉంటుంది. వార్షిక ప్రపంచ సగటు శక్తి సామర్థ్యం రేటు 2 నుంచి 4 శాతం వరకు ప్రతి సంవత్సరం 2030 వరకూ పెంచుకుంటూ పోవాలి. ఈ చర్యల ద్వారా ప్రస్తుత కాలం నుంచి 2030 మధ్య ఉత్పత్తి అయ్యే ఏడు బిలియన్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్‌ను అరికట్టగలం.

3. బొగ్గు వినియోగ తగ్గింపు: సహజ వాయువు, చమురుతోపాటు బొగ్గు కూడా ఒక శిలాజ ఇంధనమే. కానీ ఈ సమావేశంలో కేవలం బొగ్గు వినియోగ తగ్గింపునకు సంబంధించి మాత్రమే ప్రత్యేక ప్రస్తావన చేశారు.(గతంలో 2021లోనే గ్లాస్గో సమావేశంలో బొగ్గు వినియోగానికి సంబంధించి నిర్ణయం తీసుకోవడమే దీనికి కారణం). కార్బన్ క్యాప్చర్, స్టోరేజ్ ఏర్పాటు లేని కొత్త బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయరాదని తొలుత ఈ సమావేశంలో నిర్ణయించారు. అయితే భారతదేశంలో 75.1% విద్యుత్ అవసరాలకు బొగ్గుపైనే ఆధారపడుతున్నాం. అదేవిధంగా చైనా, దక్షిణాఫ్రికా వంటి దేశాలు సైతం అత్యధికంగా బొగ్గుపైనే తమ శక్తి అవసరాలకు ఆధారపడుతున్న దృష్ట్యా ఈ ప్రతిపాదనను భారత్‌తోపాటు ఆయా దేశాలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాయి. అందువల్ల గ్లాస్గోలో ప్రతిపాదించిన దశలవారీ విరమణ విధానంలో బొగ్గు వినియోగాన్ని క్రమంగా తగ్గించుకుంటూ రావాలని నిర్ణయించారు.

4. మీథేన్ వాయు ఉద్గారాల నియంత్రణ: హరిత గృహ వాయువుల్లో కార్బన్‌డైయాక్సైడ్‌తోపాటు మీథేన్ కూడా అత్యధికంగా ప్రభావం చూపుతున్న వాయువు. మొత్తం ఉద్గారాల్లో మీథేన్ శాతం 25%. అయినప్పటికీ ఇది కార్బన్‌డైయాక్సైడ్ కంటే 80% అధికంగా గ్లోబల్ వార్మింగ్‌కు కారణమవుతోంది. కాబట్టి ఈ వాయువుపై నియంత్రణ అనేది గ్లోబల్ వార్మింగ్ తగ్గింపునకు భారీగా సహకరిస్తోంది. అయితే మీథేన్ వాయువు అధికంగా వ్యవసాయం, పశువుల ద్వారానే విడుదల అవుతుంది. భారత్ వంటి వ్యవసాయాధార దేశాల్లో మీథేన్‌పై నియంత్రణ అనేది తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. కాబట్టి భారత్ వంటి వ్యవసాయ ప్రాధాన్య దేశాలు వ్యతిరేకించడంతో ఈ సమావేశం ఎలాంటి నిర్ణయాలు తీసుకోపోయింది. కేవలం మీథేన్‌ను నియంత్రించాలని మాత్రమే సంకల్పించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు.

5. లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్: తమ ఉద్గారాలు అతి తక్కువగా ఉన్నప్పటికీ, వాతావరణ మార్పుల కారణంగా తీవ్ర విపత్తులకు లోనైన పేద దేశాల, దీవుల పరిరక్షణకు నిధులు సమకూర్చే నిమిత్తం 'లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్'ను ఏర్పాటు చేయాలని కాప్-27లో నిర్ణయించారు. కానీ ఆ దిశగా చర్యలు సాధ్యపడలేదు.

ఉద్గారాలను అధికస్థాయిలో విడుదల చేస్తున్న అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాల ఆర్థిక సౌజన్యంతో ఈ నిధికి ఆర్థిక వనరులు సమకూరుతాయి. కాప్-28 సమావేశంలో తొలిరోజే లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్‌ను ఏర్పాటుచేసి, సమావేశం ముగిసే నాటికి వివిధ దేశాలు ప్రకటించిన నిధులను రాబట్టింది. ఈవిధంగా మొత్తం 800 మిలియన్ డాలర్లు సమకూరాయి.

6. గ్లోబల్ గోల్ అడాప్టేషన్: దేశాల వారీగా ఉద్గారాల తగ్గింపు లక్ష్యంలో చేరనున్న స్థాయిలను వివిధ సూచికల ఆధారంగా సమీక్షించే ఈ పద్ధతిని అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏనాటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. దేశాలు స్థానిక స్థాయిలో కలిగి ఉండాల్సిన లక్ష్యాలపై ఒక గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయడం ద్వారా మరింత నిబద్ధతతో ఉద్గారాల తగ్గింపు సాధ్యమవుతుంది. ఈవిధంగా గ్లోస్గో సమావేశంలో ఫ్రేమ్‌వర్క్ రూపకల్పన, విధివిధానాల నిర్ణయానికి రెండు సంవత్సరాల వ్యవధి గల వర్క్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేశారు. ఈ వర్క్ ప్రోగ్రామ్ ప్రపంచ దేశాలన్నింటికీ కొన్ని ముఖ్య సార్వజనీన లక్ష్యాలను గుర్తించింది. అవి వాతావరణ సంబంధిత నీటి కొరతను తగ్గించడం, వ్యవసాయ, ఆరోగ్య రంగాల పరంగా వాతావరణ ప్రతికూలతలను ఎదుర్కోవడం వంటి అంశాలు దీనిలో ఉన్నాయి. ఈ ఫ్రేమ్‌వర్క్‌ను కాప్-28 ఆమోదించడం ద్వారా క్షేత్రస్థాయిలో దేశాల వారీగా లక్ష్యాల సాధనకు మార్గం ఏర్పడింది.

7. గ్లోబల్ కూలింగ్ ప్లెడ్జ్: శీతలీకరణకు సంబంధించిన ఉద్గారాల తగ్గింపునకు కలిసి పనిచేయడానికి 66 దేశాలు ఒక తాటిపైకి వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా అన్నిరకాల శీతలీకరణ సంబంధిత ఉద్గారాలను 2050 నాటికి 2022 స్థాయిలతో పోల్చితే కనీసం 68% తగ్గింపునకు కృషి చేయాలని నిర్ణయించారు.

8. అణు విద్యుత్ సామర్థ్యం మూడింతల పెంపు: 2050 నాటికి ప్రపంచ అణు విద్యుత్ ఉత్పత్తిని మూడింతలు చేయాలని 22 దేశాలు కలిసి ఒక అంగీకారానికి వచ్చాయి.

9. ఛాంప్ ఇనీషియేటివ్: వాతావరణ మార్పులకు సంబంధించి ఇనీషియేటివ్ కాప్-28 వేదికగా తీసుకున్నారు. వాతావరణ పరిరక్షణ వ్యూహాలకు సంబంధించిన ప్లానింగ్, నిధుల సమీకరణ, కార్యాచరణ, పర్యవేక్షణపరమైన సమర్థ విధానాలకు సంబంధించి పరస్పర సహకారానికి చేసిన ఏర్పాటు ఇది.

10. క్లయిమేట్ ఫినాన్స్: యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రకారం న్యూ కలెక్టివ్ క్వాంటిఫైడ్ గోల్ ఫర్ క్లయిమేట్ ఫినాన్స్‌కు సంపన్న దేశాలు 2025లో 500 బిలియన్ డాలర్లు సమకూర్చాల్సి ఉంది. దీనిలో 250 బిలియన్ డాలర్లు మిటిగేషన్(నష్ట నివారణ), 100 బిలియన్ డాలర్లను ఆడాప్షన్(స్వీకరణ), 150 బిలియన్ డాలర్లను లాస్ అండ్ డ్యామేజ్ కోసం వినియోగిస్తారు. ఈవిధంగా వాతావరణ మార్పులను అరికట్టడానికి క్లయిమేట్ ఫినాన్స్ వెచ్చింపుల ద్వారా కృషి చేయనున్నారు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్



భావోద్వేగాల సమూహమే

కుటుంబం

విశ్వవ్యాపితం (Universe): కుటుంబం అత్యంత విశ్వవ్యాప్త సమూహం. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో, అన్ని కాలాల్లో , అన్ని సమాజాలలో కుటుంబం ఉంది. కుటుంబం ఏదో ఒక రూపంలో లేకుండా ఏ సంస్కృతి లేదా సమాజం లేదు. ప్రతీ వ్యక్తి ఒక కుటుంబం లేదా కొన్ని కుటుంబాల్లో సభ్యులై ఉంటారు.

భావోద్వేగాల మూలం: కుటుంబం మానవ సమాజానికి ప్రాథమిక విభాగం. స్త్రీ, పురుషుల లైంగిక సంగమం, సంతానాన్ని కనడం, సంతానంపై తల్లిదండ్రులు అన్ని రకాలైన శ్రద్ధను, ఆదరణను చూపించడం వంటి అంశాలపై ఆధారపడి కుటుంబం ఉంటుంది. అంటే.. భావోద్వేగాలకు సంబంధించిన సమూహమే కుటుంబం అని చెప్పవచ్చు.

పరిమితి పరిమాణం: జీవరాశి పరిస్థితులకు అనుగుణంగా కుటుంబం, దాని పరిమాణం పరిమితం. ఇతర సమూహాలు కుటుంబం కంటే తక్కువగా ఉండవచ్చు. కానీ, వాటిలో జీవరాశి పరిస్థితులు ఉండవు.

నిష్పాదక ప్రభావం: కుటుంబం తన సభ్యుల పట్ల అత్యంత ప్రభావాన్ని నిర్వర్తిస్తుంది. వ్యక్తులను శీలవంతులుగా మలుస్తుంది. వ్యక్తి బాల్యంలోనే అతని వ్యక్తిత్వ నిర్మాణంపై ప్రభావాన్ని చూపిస్తుంది. "బాల్యంలో తల్లిదండ్రుల నుంచి గ్రహించిన శీల, మానసిక ధోరణులు వయోజనులైనప్పుడు ప్రదర్శిస్తారు" అని ఫ్రాయిడ్ పేర్కొంటే.. "సమాజం మెరుగుపడాలంటే కుటుంబం మెరుగుపడాలి" అని కన్ఫ్యూషియస్ వ్యాఖ్యానించారు.

కేంద్ర స్థానం: అన్ని ఇతర సమూహాలకు కుటుంబం కేంద్రకంగా ఉంటుంది. సమాజం, ప్రాథమిక సంస్థాగత కేంద్రంగా కుటుంబం ఉండటానికి తల్లిదండ్రుల బాధ్యతలు, తోబుట్టువుల సంబంధాలు వంటి విలక్షణమైన లక్షణాలున్న వివాహ వ్యవస్థే కారణం. మొత్తం సామాజిక నిర్మితి అంతా కుటుంబ నిర్మాణంతో ముడిపడి ఉంటుంది.

సభ్యుల బాధ్యత: సామాజిక బాధ్యత, సహకారం అవసరం గురించి పిల్లలు కుటుంబం నుంచే నేర్చుకుంటారు. ప్రాథమిక వైఖరులు, ఆదర్శాలు, పిల్లలు అలవాటు చేసుకోవడానికి కుటుంబమే కారణం. పిల్లల సాంఘీకరణకు కుటుంబమే గొప్ప సంస్థ.

"సంక్షోభ సమయంలో పురుషులు పని చేయడానికి, పోరాడటానికి అవసరమైతే దేశం కోసం మరణించడానికి సిద్ధంగా ఉంటారు" అని మైకేవర్ పేర్కొన్నాడు.

సామాజిక నియంత్రణ: సామాజిక ఆచారాలు, చట్టపరమైన నిబంధనలు ప్రత్యేక రక్షణను కల్పిస్తాయి. కుటుంబం ఒక సమూహం కాబట్టి సంబంధిత వ్యక్తులు దాని నుంచి వదిలిపోవడం లేదా రద్దు చేసుకోవడం అంత సులభం కాదు.

శాశ్వతం, తాత్కాలికం: కుటుంబం శాశ్వతమైంది. విశ్వ వ్యాప్తమైన సంస్థ. సమితి అయితే తాత్కాలిక పరివర్తన కలిగి ఉంటుంది. కుమారుడు వివాహమైన తరవాత కుటుంబాన్ని వదిలిపోతాడు. మరొక కుటుంబాన్ని ప్రారంభిస్తాడు. వ్యక్తి నిర్దిష్ట అవసరాలను, దాన్ని మూలాన్ని కుటుంబం కలిగి ఉంటుంది. మానవుని కోరికలు, క్లిష్టమైన అవసరాలు సఫలీకృతం కావడానికి కుటుంబమే ఆధారం.

కుటుంబ వ్యవస్థలో మార్పులు

భారతదేశంలో కుటుంబ వ్యవస్థ వేదకాలం నుంచి ప్రస్తుత కాలం వరకు సామాజిక పరిణామ క్రమంలో అనేక మార్పులకు లోనవుతూ వస్తోంది. అయితే మార్పు అనేది సమాజ మౌలిక లక్షణమే. అయినప్పటికీ.. ఈ మార్పు సమాజ వికాసానికి దోహదపడే విధంగా ఉండాలి. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికీకరణ, శ్రమ విభజన, ఆధునాతనమైన ప్రసార సాధనాలు, వ్యక్తిగత స్వేచ్ఛ, ఆధునిక విద్యా విధానం, ఆర్థిక స్వేచ్ఛ, పాశ్చాత్య జీవన విధానం, ధన విలువలు, వారసత్వ చట్టాలు, వివాహ చట్టాలు మొదలైన వాటి ప్రభావ ఫలితంగా కుటుంబం తన బాధ్యతల నుంచి తప్పుకొనే ప్రమాదకర పరిస్థితులలో ఉంది. ఫలితంగా ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వ్యష్టి కుటుంబాలు(సింగిల్ పేరెంట్) ఆవిర్భవిస్తున్నాయి. ఇటీవలి కాలంలో సంతానం కోసం అద్దె గర్భం(సరోగసి) పద్ధతిని ప్రజలు ఆశ్రయించడం వలన కుటుంబం తన ప్రాథమిక విధి నుంచి దూరం అవుతున్నట్లు అర్థమవుతోంది.

ఎ.సంతానం కోసం అవసరం: కుటుంబాలు స్థిరత్వం కోసం పిల్లల్ని కంటారు. పిల్లలు ఉండటాన్ని ఓ వరంగా భావిస్తారు. మత సంబంధ, నైతిక లక్ష్యాలతో పాటు మానవ జాతి స్వీయ రక్షణకు సంతానం అవసరం. కుటుంబంలో పిల్లలు లేకపోవడం దురదృష్టంగా భావిస్తారు. కొన్నిసార్లు ఇది అంతఃకలతలు, మానసిక అసమతుల్యతకు కారణమవుతుంది.

బి.లైంగిక వాంఛ: లైంగిక సంతృప్తి అవసరం. దీనిని కుటుంబమే నెరవేరుస్తుంది. మనిషి తన సంతృప్తి కోసం గుర్తింపు ప్రాతిపదిక లైంగిక అవసరాన్ని కోరుకుంటాడు. పర్యవసానమే కుటుంబంలో లైంగిక చర్య.

సి. ఆర్థిక అవసరాలు: ఆర్థిక అవసరాలే స్త్రీ, పురుషున్ని కుటుంబ ఏర్పాటుకు దారి తీసేలా చేస్తుంది. మహిళ గృహం లోపల కార్యక్రమాలను నిర్వర్తిస్తే పురుషుడు బయట విధులను చేపడతాడు. కుటుంబ జీవితం సంతోషంగా ఉండటానికి పరస్పర సహకారంతో దోహద పడుతుంది.



జి.వీరాస్వామి
సీనియర్ ఫ్యాకల్టీ

అర్థమెటికల్ రీజనింగ్

పార్ట్-1

1. కెప్టెన్లు, సైనికులు కలిసి మొత్తం 1404 మంది ఒక రైలులో ప్రయాణిస్తున్నారు. ప్రతి 12 మంది సైనికులకు ఒక కెప్టెన్ కలడు. అయిన ఆ గ్రూపులో కెప్టెన్లు ఎంత మంది?

ఎ) 117 బి) 108 సి) 116 డి) 112

సమాధానం: (బి)

వివరణ: ఉదాహరణకు 10 మంది టీచర్స్, 100 మంది విద్యార్థులు ఒక విహారయాత్రకు వెళ్ళారు అనుకుందాం. 10 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ను జాగ్రత్తగా చూసుకోవాలి అని నియమించారు అనుకొందాం. అంటే 10 మంది విద్యార్థులతో ఒక టీచర్ వీరంతా గ్రూపుగా ఉండాలి కదండి. అంటే దీని అర్థం గమనించండి. టీచర్‌తో కలిసి ఉన్న 11 మంది గ్రూపులో ఒక టీచర్ ఉన్నారు.

అదే విధంగా ఇచ్చిన ప్రశ్నలో 12 మందికి ఒక కెప్టెన్ అనగా కెప్టెన్‌తో కలిసి 13 మంది గ్రూపులో ఒక కెప్టెన్ ఉంటాడు.

13 మంది గల గ్రూపులో - ఒక కెప్టెన్
1404 మంది గల గ్రూపులో - ఎంతమంది?

దీని క్రాస్ మల్టిప్లికేషన్ చేయగా

$$\frac{1404\times1}{13}=108$$


కాబట్టి సమాధానం 108 అవుతుంది.

2. వివేక్ ఒక కేకును రెండు సమ భాగాలు చేశాడు. ఒక సగభాగాన్ని మరల చిన్న చిన్న సమాన భాగాలుగా చేశాడు. ఒక్కొక్క చిన్న భాగం బరువు 40 గ్రా॥ ఆ కేకు వలన మొత్తం 8 భాగాలు వచ్చాయి. అయితే ఆ కేకు బరువు ఎంత?

ఎ) 600 గ్రాములు బి) 500 గ్రాములు
సి) 560 గ్రాములు డి) 320 గ్రాములు

సమాధానం: (సి)

వివరణ:



280 + 280 = 560 గ్రాములు.

ముందుగా కేకును రెండు సగభాగాలు చేశారు. ఒక సగభాగాన్ని మరల చిన్న చిన్న సమాన భాగాలుగా చేశాడు. ఆ కేకు వలన మొత్తం 8 భాగాలు అంటే ఒక సగభాగం అలాగే ఉంది. అది కూడా కేకులో భాగమే. దానిని ఒకటిగా భావించాలి. ఇంకో సగభాగంతో 7 భాగాలు వచ్చినవి అని భావించాలి.

3. ఒక వ్యాపార సమావేశ ముగింపులో 8 మంది వ్యక్తులు ప్రతి ఒక్కరు మరొకరితో కరచాలనాలు చేసుకున్నారు. అయితే మొత్తం కరచాలనాలు ఎన్ని?

ఎ) 20 బి) 26 సి) 28 డి) 32

సమాధానం: (సి)

వివరణ: దీనికి ఒకసారి పైన గల 2వ ప్రశ్నను గమనించగలరు. దానిని గమనించిన 8 మంది వ్యక్తులు ప్రతి ఒకరు మరొకరితో కరచాలనాలు చేసిన 7+6+5+4+3+2+ 1=28. లేదా

షార్ట్‌కట్:

$\frac{n(n-1)}{2}$ n అనగా ప్రశ్నలో ఇవ్వబడిన వ్యక్తులు = 8

$$\frac{8(8-1)}{2}=\frac{8\times7}{2}=\frac{56}{2}=28$$

సమాధానం అవుతుంది.

పార్ట్-2

1. ఒక వ్యాపారవేత్తకు, అతను నూతనంగా ప్రారంభించిన ఒక వ్యాపారంలో మొదటిరోజు రూ.2 లాభం వచ్చింది. రెండో రోజు నుంచి ప్రతిరోజు దాని ముందురోజు వచ్చిన లాభం కంటే రెట్టింపు వస్తున్నది. అయితే ఆ వ్యాపారవేత్త ఆ వ్యాపారంలో 10వ రోజున ఎన్ని రూపాయలు లాభంగా పొందాడు?

ఎ) రూ.1000 బి) రూ.956 సి) రూ.1024 డి) ఏదీకాదు.

సమాధానం: (సి)

వివరణ : వ్యాపారస్తుడు మొదటిరోజు పొందిన లాభం 2 రూ. $(2)^1$

రెండోరోజు దాని ముందురోజు కంటే రెట్టింపు లాభం పొందాడు. అనగా రూ.4 $(2)^2$

మూడోరోజు, రెండో రోజు పొందిన లాభం కంటే రెట్టింపు అనగా 8 రూ. $(2)^3$. ఈవిధంగా చూస్తే పదోరోజు అతను పొందే లాభం. $(2)^{10}$

అనగా $2\times2\times2\times2\times2\times2\times2\times2\times2\times2 = 1024$

∴ సమాధానం రూ.1024

2. ఒక వ్యక్తి వద్ద ఒక రూపాయి, 5 రూపాయలు, 10 రూపాయలు నాణాలు సమానంగా ఉన్నాయి. వీటి మొత్తం విలువ 480 రూపాయలు అయితే అతని వద్ద గల మొత్తం నాణాలు ఎన్ని?

ఎ) 30 బి) 90 సి) 60 డి) 120

సమాధానం: (బి)

వివరణ : రూ. 1, రూ. 5, రూ. 10 నాణాలు సమానం కావున రూ.1 + రూ.5 + రూ.10 ఒక్కొక్క నాణం వంతున తీసుకుంటే

3 నాణాలు = రూ. 16

అయిన 480 రూపాయలకు

3 — 16 రూ.
? — 480 రూ.

$$\frac{480\times3}{16}=90 \text{ నాణాలు}$$

రూ.1 నాణాలు 30 = 30 x 1 = 30
రూ.5 నాణాలు 30 = 30 x 5 = 150
రూ.10 నాణాలు 30 = 30 x 10 = 300

∴ సమాధానం 90 నాణాలు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ



మహా సముద్రాలు

సముద్ర శాస్త్రాన్ని ఆంగ్లంలో 'ఓషనోగ్రఫీ(Oceanography) అంటారు. ఓషనోగ్రఫీ అనే పదం 'ఒకనోస్'(Okeanos), గ్రాఫియ(Graphia) అనే గ్రీకు పదం నుంచి ఆవిర్భవించింది. గ్రీకు భాషలో 'ఒకనోస్' అంటే సముద్రం, 'గ్రాఫియా' అంటే 'వర్ణన' అని అర్థం. ఓషనోగ్రఫీ అంటే 'సముద్ర వర్ణన' అని అర్థం.

భూగోళం మొత్తం విస్తీర్ణంలో 71 శాతం జలమయమై ఉంది. ఈ జలభాగంలో ఉన్న ముఖ్యమైన ఐదు మహా సముద్రాలు: పసిఫిక్ మహా సముద్రం, అట్లాంటిక్ మహాసముద్రం; హిందూ మహా సముద్రం, ఆర్కిటిక్ మహా సముద్రం, అంటార్కిటిక్ మహాసముద్రం. ఈ సముద్రాలు ఉత్తరార్థ గోళంలో కంటే దక్షిణార్థ గోళంలోనే ఎక్కువ ప్రాంతాన్ని ఆక్రమించి ఉన్నాయి. ఈ విశాల జలభాగానికి సంబంధించిన శీతోష్ణస్థితి, క్షారత్వం(Salinity), తరంగాలు(Waves), ప్రవాహాలు(Currents), పోటుపాట్లు(Tides) మొదలైన వాటిని గురించి తెలుసుకోవాల్సి ఉంది.

మహాసముద్రాలు(Oceans)

ఖండతీరాల వెంబడి విస్తరించి ఉన్న విశాలమైన లోతైన ఉప్పునీటి జల భాగాలను 'మహా సముద్రాలు' అంటారు. భూ ఉపరితలంలో ఉన్న మొత్తం జలభాగాలలో 97 శాతం ఉప్పునీటి స్వభావాన్ని మిగిలిన 3 శాతం మంచినీటి స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఈ 3 శాతం మంచినీటిలో 2 శాతం మంచు రూపంలో, మిగిలిన 1 శాతం జీవులకు వినియోగపడే విధంగా ఉన్నాయి. ఉత్తరార్థ గోళంలో జలభాగం 61 శాతం ఉండగా, దక్షిణార్థ గోళంలో జలభాగం 81 శాతం ఉంది. వాస్తవానికి భూమి మీద ఉన్న ఉప్పునీటి జలభాగాన్ని 4 మహాసముద్రాలుగా విభజించారు. కాని భౌగోళిక పరంగా 5 మహాసముద్రాలుగా వర్గీకరించారు. వీటిలో 'అంటార్కిటికా/దక్షిణ మహాసముద్రం' అనేది ఒక భౌగోళిక ఊహ మాత్రమే.

సముద్రాల సరాసరి లోతు 3,800 మీ/3.8 కి.మీ. ఖండతీరపు వాలు సగటు లోతు 2,500 మీ./2.5 కి.మీ. సముద్ర జలాల ఉపరితలాలను కొలవడానికి ఉపయోగించే ప్రమాణం- నాటికల్ మైల్(ఒక నాటికల్ మైలు= 1.852 కి.మీ.). సముద్ర లోతు కొలవడానికి ఉపయోగించే ప్రమాణం- పాథమ్(1 పాథమ్=1.8 మీ.). సముద్రాల లోతు కొలవడానికి ఉపయోగించే పరికరం- పాథోమీటర్. సముద్రాల మధ్య వేగాన్ని కొలవడానికి ఉపయోగించే ప్రమాణం- నాట్. సమాన సముద్ర లోతు గల ప్రాంతాలను కలుపుతూ గీసిన రేఖలు- ఐసోబాథ్‌లు.

మహా సముద్రాల అవరోహణ క్రమం

1. పసిఫిక్ మహా సముద్రం
2. అట్లాంటిక్ మహాసముద్రం
3. హిందూ మహాసముద్రం
4. అంటార్కిటికా మహాసముద్రం
5. ఆర్కిటిక్ మహాసముద్రం

పసిఫిక్ మహాసముద్రం(Pacific Ocean): మాజీలాన్ అనే వ్యక్తి ఈ మహాసముద్రాన్ని కనుగొని పేరు పెట్టాడు. సముద్రాలలో ప్రపంచంలోకెల్లా అతి పెద్దది, అతి లోతైనది. దీని వైశాల్యం- 1,55,557,00 చ.కి.మీ. సీఐఏ వరల్డ్ ఫ్యాక్ట్ బుక్ ప్రకారం ఈ మహాసముద్రం మొత్తం భూభాగంలో 28 శాతం ఆక్రమించింది. భూమిపై ఉన్న మొత్తం భూభాగ విస్తీర్ణానికి సమాన పరిమాణంలో ఉంది. ఆసియా ఖండానికి, దక్షిణ సహాసముద్రానికి, పశ్చిమార్థ గోళంలోని ఆస్ట్రేలియా ఖండానికి మధ్యలో పసిఫిక్ మహాసముద్రం నెలకొని ఉంది. ఈ మహాసముద్రం త్రిభుజాకారంలో ఉంది. దీనిలో ఎక్కువ అగాధాలు(సుమారు 32) ఉన్నాయి. దీనిని 'ప్రశాంత మహాసముద్రం' అని, 'రింగ్ ఆఫ్ ఫైర్' అని పిలుస్తారు. ఈ మహాసముద్రపు ఖండతీరపు అంచుపైన ఇండోనేషియా, జపాన్, ఫిలిప్పీన్స్ దేశాలు ఉన్నాయి. ఈ మహాసముద్రాన్ని పసిఫిక్ అగ్నివలయం అని కూడా పిలుస్తారు. ఈ మహాసముద్రంలో ప్రపంచంలోకెల్లా అత్యంత లోతైన అగాధం 'మెరియానా ట్రెంచ్(11,033 మీ.). ఇది ఈ మహాసముద్రంలోని ఫిలిప్పీన్స్ దీవుల సమీపంలో ఉంది. అగాధ సముద్ర మైదానం ఎక్కువగా ఉన్న మహాసముద్రం ఇది. ఇది ఉత్తరార్థ గోళంలో ఆసియా, ఉత్తర అమెరికా ఖండాల మధ్య ఉన్నది. ప్రపంచంలోనే అత్యధిక దీవులు ఉన్న మహాసముద్రం. ఈ మహాసముద్రంలోనే అత్యధికంగా 'సునామీలు' సంభవిస్తాయి.

అట్లాంటిక్ మహాసముద్రం(Atlantic Ocean): ఇది ప్రపంచంలో రెండో పెద్ద మహాసముద్రం. ఇది s ఆకారంలో ఉంటుంది. దీని వైశాల్యం 76,762, 000 చ.కి.మీ./29,637,900 చ.మైళ్లు. ఇది ఆఫ్రికా, యూరప్, పశ్చిమార్థ గోళంలోని దక్షిణ మహాసముద్రానికి మధ్య నెలకొని ఉంది. అట్లాంటిక్, ఆర్కిటిక్ సముద్రాలను కలిపే 'డేవిస్ జలసంధి' ఈ మహాసముద్రం సరిహద్దులో ఉంది. ఈ సముద్రంలో లవణీయత ఎక్కువ. అతి పొడవైన ఖండ తీరరేఖ, అత్యంత పొడవైన తీర రేఖగల మహాసముద్రం. అతి వెడల్పయిన ఖండ తీరపు అంచును కలిగి ఉంది. దీనిని 'కల్లోల సముద్రం, హెర్రింగ్‌పాండ్' అని అంటారు. జల రవాణా మార్గాలు ఎక్కుగా ఉన్నాయి. ఈ మహాసముద్రంలో అత్యంత లోతైన అగాధం- ప్యూర్టోరికో ట్రెంచ్(8,385). 'రిడ్జ్' అనే భూస్వరూపాలు ఎక్కువగా ఉన్నాయి. మహాసముద్రాలలోని రిడ్జ్‌లన్నింటిలో కంటే అత్యంత పెద్ద రిడ్జ్ అయిన మిడ్ అట్లాంటిక్ ఓషియానిక్ రిడ్జ్ ఈ మహాసముద్రంలోనే ఉంది.

అట్లాంటిక్ మహాసముద్ర భాగాలు: ఏజియన్స్, మెక్సికో, ఉత్తర సముద్రం, మధ్యధరా సముద్రం, నల్ల సముద్రం, కరేబియన్ సముద్రం, బాల్టిక్ సముద్రం, ఇంగ్లీష్ ఛానల్.

హిందూ మహాసముద్రం(Indian Ocean): దీనికి అర్థ మహాసముద్రం అని మరో పేరు. ఇది ప్రపంచంలోకెల్లా మూడో అతిపెద్ద మహాసముద్రం. M లేదా 'ఒంటే వీపు' ఆకారంలో ఉంటుంది. ఇది ఆఫ్రికా, దక్షిణ మహాసముద్రం, ఆసియా, ఆస్ట్రేలియా ఖండాల మధ్య నెలకొని ఉంది. ఈ మహాసముద్రంలోని అత్యంత లోతైన అగాధం- సుండా ట్రెంచ్(7,451 మీ). ఇది ఆస్ట్రేలియా సరిహద్దులో కలదు. ఈ మహాసముద్రంలో ఉన్న మరొక ట్రెంచ్ - జావాట్రెంచ్/జావా అగాధం. ఈ మహాసముద్రంలో గల అతిపెద్ద దీవి- మడగాస్కర్(ఆగ్నేయాసియా తీరాన్ని ఆనుకొని ఉంది). ఈ దీవిలో లెమూర్ జాతికి చెందిన కోతులు అధికం.



హిందూ మహాసముద్ర భాగాలు: గ్రేట్ ఆస్ట్రేలియన్ బైట్, అడెన్ సింధుశాఖ, ఒమన్ సింధుశాఖ, మొజాంబిక్ ఛానెల్, ఎర్ర సముద్రం, అరేబియా సముద్రం, బంగాళాఖాతం, పర్షియన్ గల్ఫ్.

అంటార్కిటికా మహాసముద్రం(Antarcitic Ocean): దీనిని దక్షిణ మహాసముద్రం అని పిలుస్తారు. దక్షిణ మహాసముద్రం ప్రపంచంలోకెల్లా కొత్తది, 4వ అతిపెద్ద మహాసముద్రం. 2000 సంవత్సరంలో 'ఇంటర్నేషనల్ హైడ్రోగ్రాఫిక్ ఆర్గనైజేషన్' 5వ మహాసముద్ర సరిహద్దులను గుర్తించాలని నిర్ణయించింది. దీని వైశాల్యం 20,327,000 చ.కి.మీ. ఈ మహాసముద్రంలో లోతైన అగాధం దక్షిణ శాండివిజ్ ట్రెంచ్‌కు దక్షిణంగా గుర్తించారు. ఈ మహాసముద్రంలో అత్యంత లోతైన అగాధం - నాన్‌సేన్స్ ట్రెంచ్(5450 మీ.). ప్రపంచంలోకెల్లా అతిపెద్ద సముద్ర ప్రవాహం అయిన అంటార్కిటిక్ పరిధ్రువ ప్రవాహం 21,000 కి.మీ. పొడవున తూర్పు దిశలో ప్రయాణిస్తుంది. ఈ మహాసముద్ర తీర ప్రాంతంలో అత్యధికంగా పెంగ్విన్ పక్షులు సంచరిస్తూ ఉంటాయి. దీనికి నిర్దిష్టమైన ఆకృతి ఉండదు. అంటార్కిటికా ఖండతీరాన్ని ఆనుకొని ఉన్న పసిఫిక్, అట్లాంటిక్, హిందూ మహాసముద్రాల జలరాశినే అంటార్కిటికా మహాసముద్రం అంటారు. దీనినే వెడ్డెల్ సముద్రం, అముండ్‌సేన్ అఖాతం అంటారు.

ఆర్కిటిక్ మహాసముద్రం(Arcitic Ocean): ప్రపంచంలోకెల్లా అతి చిన్న మహాసముద్రం. ఇది 'వృత్తాకారం' లేదా 'O' ఆకారంలో ఉంటుంది. ఉత్తర ధృవాన్ని ఆవరించి ఉన్న మహాసముద్రం. కాబట్టి దీన్ని 'ఉత్తర మహాసముద్రం' అని కూడా అంటారు. సంవత్సరంలో అధిక కాలం ఘనరూపంలో ఉంటుంది. లవణీయత తక్కువ గల మహాసముద్రం.



వి. వెంకట్‌రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ

రైతు-మహిళ-యువత నామ సంవత్సరం

రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.. పాలనా వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం: సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న ఆశలు అతి త్వరలో ఫలిస్తాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కొత్త సంవత్సరాన్ని రైతు-మహిళ-యువత నామ సంవత్సరం'గా భావిస్తూ సంకల్పం తీసుకుంటున్నామని, గత ప్రభుత్వ హయాంలో స్తంభించిన పాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందాలి.. అభివృద్ధిలో రాష్ట్రం అగ్రభాగాన ఉండాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష అని పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆదివారం ఒక ప్రకటనలో ఆయన శుభాకంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రభుత్వం తీసుకున్న సంకల్పానికి సంబంధించి సందేశాన్నీ ఇచ్చారు. ప్రజలందరి సహకారంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని, నిర్బంధాలు, ఇనుప కంచెలను తొలగించామని, పాలనలో ప్రజలను భాగస్వాములను చేశామని అన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ, పౌరులకు స్వేచ్ఛ ఉంటుందన్న హామీని నిలబెట్టుకున్నామన్నారు. ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలను అమలు చేశామని, కొత్త ఏడాదిలో మిగతా గ్యారెంటీల అమలుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. యువత భవిష్యత్తు తమకు ప్రాధాన్య అంశమని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యువతకు అందించి.. వారి భవిష్యత్తుకు గ్యారెంటీ ఇచ్చే దిశగా ఆలోచన చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు సమూల ప్రక్షాళనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులకూ ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ప్రజా పాలనకు అనుగుణంగా వ్యవస్థల పునర్వ్యవస్థీకరణ జరుగుతోందని తెలిపారు. కార్యనిర్వాహక వ్యవస్థలో మానవీయత జోడించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు.

ప్రజల ఆశలు త్వరలో ఫలిస్తాయి..

గత ప్రభుత్వంలో చిన్నాభిన్నమైన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిపుష్టం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆర్థిక, విద్యుత్తు రంగాల్లో వాస్తవ పరిస్థితులను శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందు ఉంచామని, త్వరలో సాగునీటి రంగంలో జరిగిన అవినీతిపై కూడా వాస్తవాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. "గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకుంటామని, దోపిడీకి గురైన తెలంగాణ ప్రజల సంపదను తిరిగి రాబడతామని మాట ఇచ్చాం. ఆ దిశగా చర్యలు మొదలుపెట్టాం. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల కోసం లక్షల మంది అర్హులు పదేళ్లుగా ఎదురు చూశారు. అతి త్వరలో వారి ఆశలు ఫలిస్తాయి. అధికారం కోల్పోయిన దుగ్ధ, ఈర్ష్యతో కొందరు చేసే తప్పుడు ప్రచారాలతో గందరగోళ పడవద్దు. ఇది గత పాలన కాదు.. జన పాలన. ప్రతి పౌరుడు ఈ ప్రభుత్వాన్ని చేరుకునేందుకు 24 గంటలు ద్వారాలు తెరిచే ఉంటాయి" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసుల వివరాలు సేకరిస్తున్నామని, ఆ కేసుల నుంచి వారికి విముక్తి కల్పించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్లు, అసంఘటిత కార్మికుల కోసం రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని తీసుకొచ్చామన్నారు. జర్నలిస్టుల సమస్యలకు త్వరలో పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. కాగా, బేగంపేటలోని ఐఏఎస్ టీచర్స్ అసోసియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఇందులో ఐఏఎస్ అధికారులు, అసోసియేషన్ కార్యవర్గం ప్రతినిధులు పాల్గొన్నారు.



ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ వేడుకల్లో సీఎం రేవంత్ దంపతులు

గవర్నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గవర్నర్ తమిళిసై రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 2024 సంవత్సరంలో తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం సామాన్య ప్రజలు తనను కలవొచ్చని గవర్నర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో కొత్త సంవత్సరం సుఖ శాంతులు నింపాలని ఆదివారం ఒక ప్రకటన ద్వారా ఆయన ఆకాంక్షించారు.



హైదరాబాద్ బేగంపేటలోని హాకీ గ్రౌండ్‌లో నూతన సంవత్సర వేడుకల్లో యువతీ యువకులు

కొత్త సంవత్సరంలో కొత్త పింఛన్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. నిజానికి, తమకూ పింఛన్లు కావాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న సంగతి తెలిసిందే. దాంతో, ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా అర్హుల నుంచి స్వీకరించే ప్రజా పాలన దరఖాస్తుల్లో పింఛన్ విషయాన్ని కూడా సర్కారు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే, పాత వారికి, కొత్త వారికి కలిపి ఒకేసారి పింఛను మొత్తాన్ని పెంచుతారని ఇప్పటి వరకూ అంతా భావించారు. అయితే, వంద రోజుల గడువు మార్చి 17వ తేదీతో ముగిసిపోతోందని, ఆరు గ్యారెంటీలను ఇంకెప్పుడు అమలు చేస్తారంటూ ప్రతిపక్షాలు అప్పుడే డిమాండ్లు చేయడం ప్రారంభించాయి. అదే సమయంలో, జనవరి ఆరో తేదీ వరకూ ప్రజా పాలన దరఖాస్తులను సర్కారు తీసుకోనుంది. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వాటిని ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. గ్రామ సభలు నిర్వహించి అర్హులను నిర్ధారించాల్సి ఉంది. ఇదంతా భారీ ప్రక్రియ కావడంతో ఇందుకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఇంకా చెప్పాలంటే, లోక్‌సభ ఎన్నికల సమయంలోపు ఈ ప్రక్రియంతా పూర్తయ్యే అవకాశాలు లేవు. ఎన్నికల కోడ్ కారణంగా దాదాపు రెండు మూడు నెలలు ప్రక్రియ నిలిచినా ఆశ్చర్యం లేదు. ఈ నేపథ్యంలోనే, ప్రతిపక్షాలకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా పాత వారికి మాత్రం హామీ ఇచ్చినట్లు పింఛనును జనవరి నుంచే పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ప్రక్రియ అంతా పూర్తయిన తర్వాత అర్హులను గుర్తించి.. కొత్త వారికి పెంచిన పింఛనును రూ.4000 చొప్పున అమలు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.

పెంపు జనవరి నుంచా!? ఫిబ్రవరి నుంచా!?

పెంచిన పింఛనును జనవరి నుంచి అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తే.. క్షేత్రస్థాయిలో అది ఎప్పటి నుంచి అమలవుతుందనే సందిగ్ధం నెలకొంది. నిజానికి, ఆసరా లబ్ధిదారులకు పింఛన్లను ప్రతినెలా మొదటి వారంలోనే అందజేయాల్సి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం 2022 నుంచి ఒక నెల ఆలస్యంగా ఇస్తోంది. కానీ, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాత్రం రెండు నెలల (సెప్టెంబరు, అక్టోబరు) పింఛన్ మొత్తాన్ని ఒకేసారి నవంబరులో అందజేసింది. ఎన్నికల అనంతరం డిసెంబరు 7న కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నవంబరు పింఛన్లను డిసెంబరు 25 నుంచి 31వ తేదీ మధ్య లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. పోస్టాఫీసుల ద్వారా చెల్లింపులు జరగాల్సిన లబ్ధిదారులకు మాత్రం రెండు మూడు రోజుల్లో వీటిని అందజేయనున్నట్లు పింఛను పంపిణీ విభాగాలు వెల్లడించాయి. ఇక, డిసెంబరు పింఛన్‌ను జనవరిలో, జనవరి పింఛన్‌ను ఫిబ్రవరిలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వం కొత్త సంవత్సరంలో జనవరి నుంచే పింఛన్‌ను రూ.4 వేలకు పెంచి ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. అంటే, తాము అధికారంలోకి వచ్చిన డిసెంబరు నుంచే పెంచిన పింఛనును అమలు చేయనుందా!? జనవరిలోనే దానిని అమలు చేయనుందా!? లేదా ఫిబ్రవరిలో ఇచ్చే జనవరి పింఛనును పెంచి ఇవ్వనుందా? అనే సందిగ్ధం నెలకొంది. ఒకవేళ డిసెంబరు నుంచే పెంచిన పింఛనును అమలు చేస్తే అది పింఛనుదారులకు సంక్రాంతి కానుక కూడా అవుతుందనే భావన అధికార వర్గాల్లో నెలకొంది. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పుడు పింఛన్లను కూడా పెంచితే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో దాని ప్రభావం ఉంటుందని కూడా భావిస్తున్నట్లు సమాచారం. చేయూత పథకం కింద వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులతోపాటు డయాలిసిస్ బాధితులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, ఫైలేరియా బాధితులు, బీడీ కార్మికులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ టేకేదారులకు ప్రభుత్వం పింఛన్‌ను అందజేయనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 39 లక్షల మందికి రూ.2,016 చొప్పున పింఛను అందుతోంది. ఇందు కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.786,24,00,000 వెచ్చిస్తోంది. దీనిని రూ.4 వేలకు పెంచితే రూ1560 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది దివ్యాంగులకు రూ.4 వేల చొప్పున పింఛను ఇచ్చేందుకు రూ.200 కోట్లు వెచ్చిస్తుండగా.. దానిని రూ.6 వేలకు పెంచితే రూ300 .కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో చేయూత పథకం కింద ప్రభుత్వంపై అదనంగా రూ.873.76 కోట్ల భారం పడనుంది.



బడుల విద్యుత్తు బిల్లులపై త్వరలోనే నిర్ణయం?

- బిల్లులు చెల్లించలేక సర్కారీ పాఠశాలల ఇబ్బందులు
- విధాన నిర్ణయం తీసుకోనున్న సర్కారు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యుత్తు బిల్లులపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. చాలా పాఠశాలల్లో విద్యుత్తు బిల్లులు పేరుకుపోతున్నాయి. కొన్ని చోట్ల బిల్లులను చెల్లించకపోవడంతో కరెంట్‌ను నిలిపివేస్తున్నారు. రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కూళ్లకు నిర్వహణ గ్రాంట్ పేరిట నిధులిస్తున్నారు. బడుల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు మంజూరు చేస్తారు. 500 మంది విద్యార్థులకు పైగా ఉన్న స్కూలుకు ఏడాదికి రూ.లక్ష, 500 మంది లోపు ఉంటే రూ.75 వేలు, 200 మంది ఉంటే రూ.50 వేలు, 100లోపు విద్యార్థులున్న స్కూళ్లకు రూ.15 వేలను చెల్లిస్తున్నారు. ఈ నిధులను చాక్‌పీస్‌లు, విద్యార్థుల తాగునీటికి కుండలు, స్టేషనరీ, ప్రోగ్రెస్ కార్డులు, వైట్ పేపర్లు, కంప్యూటర్ నిర్వహణ వంటి అవసరాలకు వినియోగించాల్సి ఉంటుంది. వీటికి అదనంగా విద్యుత్తు బిల్లులను కూడా చెల్లించాలి. ఈ గ్రాంట్ కొన్ని స్కూళ్లకు సరిపోతున్నా.. కొన్నింటికి చాలడం లేదు. దీంతో కరెంటు బిల్లులను చెల్లించడం లేదు. కొన్ని చోట్ల మీటర్ లేకుండా నేరుగా విద్యుత్తును వాడుకుంటున్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా పాఠశాలలకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని అన్ని సర్కారు బడుల విద్యుత్తు బిల్లులపై ఒక విధాన నిర్ణయానికి రావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని విద్యుత్తు, విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. నివేదిక అందాక తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఉన్నత విద్యా మండలి కొనసాగింపు!

- ప్రస్తుత చైర్మన్, వైస్ చైర్మన్లతోనే నడిపించనున్న సర్కారు?

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలిని ఇప్పుడున్న వారితోనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. కొత్త వారిని ఎంపిక చేసే విషయాన్ని కొంత కాలం వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌గా ప్రొఫెసర్ లింబాద్రి, వైస్ ఛైర్మన్లుగా వెంకటరమణ, మహమ్మూద్ ఉన్న విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వివిధ కార్పొరేషన్లతో పాటు, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను కూడా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేయలేదు. ఈ నేపథ్యంలో శనివారం విద్యా శాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షకు లింబాద్రి, వెంకటరమణ హాజరయ్యారు. దీంతో మండలి ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లను ఇప్పట్లో మార్చరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. త్వరలోనే ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షలతోపాటు వివిధ కోర్సులకు అడ్మిషన్లను కూడా నిర్వహించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో కొత్త వారిని నియమించడం కంటే, ఉన్న వారినే కొనసాగించడం మంచిదనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు సమాచారం.

రేషన్‌కార్డుల ఈ- కేవైసీకి 31 వరకు అవకాశం

- ఆదేశాలు జారీ చేసిన పౌరసరఫరాల కమిషనర్

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు వినియోగదారులు ఈ- కేవైసీ పూర్తిచేయటానికి జనవరి 31వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు. రెండు నెలలుగా చౌక డిపోల్లో కేవైసీ ప్రక్రియ చేపడుతున్నారు. వినియోగదారుల నుంచి వేలిముద్రలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 71 శాతం ఈ- కేవైసీ పూర్తయింది. మిగిలిన వినియోగదారులు కూడా నెల రోజుల్లో ఈ- కేవైసీ పూర్తిచేసుకోవాలని కమిషనర్ సూచించారు. కాగా, రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉండగా 2.82 కోట్ల పైచిలుకు వినియోగదారులు ఉన్నారు.

బొకేల ఖర్చును సీఎంఆర్‌ఎఫ్‌కు జమ చేయండి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తనను కలిసేందుకు వస్తున్న నాయకులు.. బొకేలు, శాలువాలకు పెట్టే ఖర్చును సీఎం సహాయ నిధికి జమ చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరిట దోచుకొని ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేసిందని, అందరం డబ్బులు వృథా చేయకుండా సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇస్తే అది పేదల ఆరోగ్య రక్షణకు ఉపయోగపడుతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నేతలు, ప్రజలు కలవడమే తనకు సంతోషమన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు నేతల చుట్టూ తిరగాల్సిన పని లేదని, ప్రజా పాలన, ఇతర కార్యక్రమాల ద్వారా తామే ప్రజల ఇళ్ల ముందుకొచ్చి సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు.

అర్హులందరికీ 6 గ్యారెంటీలు: పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు హామీ మేరకు కొత్త సంవత్సరం ఆరు గ్యారెంటీలను అర్హులందరికీ వర్తింపచేస్తుందని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. అర్హులెవరూ ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా పేదల చెంతకే పథకాలు చేరేలా పారదర్శక పాలనను అందిస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వు చూడాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

కిశోర్‌బాబువి తప్పుడు ఆరోపణలు

- సమాచార శాఖ ఉద్యోగుల సంఘం

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్‌ఎల్‌ఆర్ కిశోర్‌బాబు చేస్తున్న ఆరోపణలను సమాచార శాఖ ఉద్యోగుల సంఘం ఖండించింది. ఆయన ఆరోపణలు అవాస్తవమని పేర్కొంది. చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరు పోస్టు నుంచి అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందేందుకు అర్హత లేదన్న జీవో 397ను 2018 సంవత్సరంలో హైకోర్టు అఫిడవిట్‌లో ప్రస్తావించకుండా కోర్టును తప్పుదారి పట్టించారని, తన పదోన్నతి కోసం జీవోను సవరించి పదోన్నతి ఇచ్చేలా ఆదేశాలు తెచ్చుకున్నారని ఓ ప్రకటనలో సంఘం తెలిపింది. ఉద్యోగిపై కేసులు, ఆరోపణలున్నప్పుడు పదోన్నతి ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని గుర్తు చేసింది.

పెన్షనర్ల ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకునే కుట్రలొద్దు

- తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం

మంగళ్‌హాట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు కేటాయించిన ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను అడ్డుకునే కుట్రలు మానుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పేర్కొంది. ఆదివారం గన్‌పార్కు వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి తూము అశోక్ రెడ్డి తదితరులు మాట్లాడారు. సొసైటీతో సంబంధంలేని కొందరు ఈ ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అవాస్తవాలతో మంత్రులను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని చెప్పారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కూలీ నుంచి టెకీ వరకూ..

హైదరాబాద్‌లో డ్రగ్స్ స్మగర్లు, వాడకందారుల అరెస్టు.. కొత్త సంవత్సర వేడుకలకు ఢిల్లీ నుంచి 'సరుకు'

హైదరాబాద్ సిటీ, రాజేంద్రనగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువు కోసం వెళ్లి అలవాటుపడిన వారొకరైతే.. కొత్త సంవత్సరాన్ని మత్తుగా ఆహ్వానించాలనుకున్నవారు మరొకరు..! కూలీకి వచ్చి దందా సాగిస్తున్నవారు ఇంకొందరు.. మొత్తం నాలుగు వేర్వేరు ఘటనల్లో హైదరాబాద్‌లో పలువురు డ్రగ్స్ విక్రేతలు, వాడకందారులు పోలీసులకు పట్టుబడ్డారు. ఇందులో పెద్దగా చదువుకొని కూలీలు.. ఉజ్వల భవిష్యత్ ఉన్న యువత.. మంచి ఉద్యోగం చేస్తున్న యువతి ఉండడం గమనార్హం. అయితే, పోలీసులు వీరి ఆటకట్టించారు. కొత్త ఏడాది వేడుకలను పబ్‌లు, క్లబ్‌లు, రేవ్ పార్టీల్లో 'మత్తు'గా జరుపుకోవాలనేవారికి సరఫరాదారులుగా మారినవారిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో డిసెంబరు చివరి వారం నుంచే న్యూ ఇయర్ జోష్ మొదలైంది. దీనికోసం డ్రగ్స్, గంజాయి స్మగ్లర్లు పలువురు తమ వినియోగదారులను కలుసుకొన్నారు. కొన్ని రోజుల కిందటే ఈవెంట్ల నిర్వాహకులు, స్మగ్లర్లు మాదకద్రవ్యాలను దిగుమతి చేసుకునే పనిలో పడ్డారు. సమాచారం తెలిసి వారం రోజులుగా విక్రయ ముఠాలను పట్టుకోవడంలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఆదివారం ఒక్క రోజే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌ల పరిధిలో పలు ముఠాల ఆటకట్టించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..



నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

పంజాబ్ వెళ్లి.. డ్రగ్స్‌కు అలవాటై

ఏపీలోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సూరెలీలా నవీన్‌సాయి 2019లో పంజాబ్‌లో బీటెక్ చేస్తుండగా స్నేహితుల ద్వారా డ్రగ్స్ అలవాటయ్యాయి. వీటికోసం మనీ వ్యూ, జస్ట్ మనీ, ధని, ట్రూ బ్యాలెన్స్, పేటీఎం పోస్టు పెయిడ్ వంటి యాప్స్‌లో రుణాలు తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవడంతో యాప్ నిర్వాహకుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. దీంతో తన వ్యసనం తీరేందుకు, సులభంగా డబ్బు సంపాదించేందుకు డ్రగ్స్ అమ్మకమే మార్గమని భావించాడు. గుంటూరుకు చెందిన స్నేహితుడు వీర సాయితేజను కలుపుకొన్నాడు. తమకు విక్రయించే వ్యక్తి ద్వారా ఢిల్లీలోని డ్రగ్ పెడ్లర్ కాంటాక్టు సంపాదించారు. అక్కడినుంచి తెచ్చి హైదరాబాద్‌లో అమ్ముతున్నారు. న్యూ ఇయర్ వేడుకలకు డ్రగ్స్ డిమాండ్ ఉండటంతో డిసెంబరు 12వ తేదీన రూ.7.50 లక్షల విలువైన ఎండీఎంఏ, కొకైన్, బ్రౌన్ షుగర్ కొన్నారు. ఎండీఏంఏ గ్రాము రూ.2 వేలకు కొని రూ.6-8 వేలకు, కొకైన్ గ్రాము రూ.10 వేలకు కొని రూ.17వేలకు, బ్రౌన్ షుగర్ రూ.5 వేల చొప్పున కొని రూ. 10 వేలకు విక్రయిస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని టానిక్ లిక్కర్ మార్ట్ వద్ద కస్టమర్స్ కోసం వేచి ఉన్న నవీన్‌సాయి, వీర సాయితేజను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. 100గ్రాముల ఎండీఎంఏ, 11.6గ్రాముల బ్రౌన్‌షుగర్, 2గ్రాము ల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.7.50లక్షలు ఉంటుందని పోలీసులు చెప్పారు.

డ్రగ్స్‌తో మహిళా ఇంజనీర్ 'విల్లా'సం

రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీ కెన్వర్త్ విల్లాస్‌లో నివాసం ఉండే సంధ్య (26) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. అదే ప్రాంతానికి చెందిన స్నేహితులు డేవిడ్(23), అర్జున్ (25)తో కలిసి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బెంగుళూరు నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను తెప్పించుకున్నారు. విషయం తెలిసిన బాలానగర్ ఎస్‌వోటీ, రాజేంద్రనగర్ పోలీసులతో కలిసి.. సంధ్య నివాసంలో దాడులు నిర్వహించారు. ఆమె నుంచి 8 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.86వేలు ఉంటుందని రాజేంద్రనగర్ ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. డేవిడ్, అర్జున్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

100 గ్రాముల గంజాయి రూ.1000

సూర్యాపేటకు చెందిన కానుకుర్తి సాయినవీన్ అలియాస్ నవీన్, చెట్ల వంశీ కూలీలు. కొన్నేళ్లుగా గంజాయి అమ్ముతున్నారు. హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా గంజాయికి మంచి డిమాండ్ ఉందని తెలిసి విక్రయించడానికి వచ్చారు. హబ్సిగూడలో వీరిద్దరూ 100 గ్రాముల ప్యాకెట్ రూ.1000 చొప్పున అమ్ముతుండగా సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, ఓయూ పోలీసులు పట్టుకున్నారు. 2.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నవీన్‌పై 6, వంశీపై 3 గంజాయి విక్రయం కేసులున్నాయి.

రాజస్థాన్ నుంచి నగరానికి హెరాయిన్

కూలీ పనులకు హైదరాబాద్ వచ్చిన వ్యక్తి డ్రగ్స్ దందాకు తెరతీసిన వైనం ఇది. ఉత్తరప్రదేశ్ సుల్తాన్‌పూర్‌కు చెందిన ఉమేష్ తివారి (35) హైదరాబాద్‌లోని ఫతేనగర్ పైప్‌లైన్ రోడ్‌లో ఉంటూ, రాజస్థాన్ జాలోర్‌కు చెందిన సురేష్ దివానీ (26), సంచోర్ వాసి రౌలా రామ్ (22)లు కూకట్‌పల్లిలో ఉంటూ స్టీల్ రెయిలింగ్ పనులు చేస్తున్నారు. ముగ్గురూ డ్రగ్స్‌కు అలవాటుపడ్డారు. జాలోర్‌కు చెందిన డ్రగ్స్ విక్రేతలతో పరిచయం పెంచుకుని అక్కడ కొన్న హెరాయిన్‌ను వీరు తీసుకుంటూ, విక్రయిస్తున్నారు. వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు వలపన్ని అరెస్టు చేశారు. 15 గ్రాముల హెరాయిన్, 3 సెల్‌ఫోన్లు, బైక్, రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నారు.

ఏడాది చివరి రోజు మద్యం అమ్మకాలు 40 కోట్లు?

సంవత్సరంలో చివరి రోజు.. అదీ ఆదివారం.. కొత్త ఏడాదికి స్వాగతం పేరిట మందుబాబులు చేసే హడావుడి ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురిపించింది. డిసెంబరు 31న అర్ధరాత్రి వరకు సాగిన అమ్మకాల గణాంకాలు వెల్లడించకపోయినా ఒక్క రోజే హైదరాబాద్‌లో విక్రయాలు రూ.40 కోట్లు దాటినట్లు అంచనా. నిరుడు ఇది రూ.37.7 కోట్లు మాత్రమే. గతేడాది హైదరాబాద్-1 డిపోలో రూ.16.9కోట్లు, హైదరాబాద్-2 డిపోలో రూ.20.8 కోట్ల విక్రయాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా నిరుడు డిసెంబరు 31న రూ.216 కోట్లు అమ్మకాలు జరిగాయి. ఈసారి రూ.260 కోట్లు దాటుతుందని అంచనా. కాగా, హైదరాబాద్‌లో మందుబాబులు ఉదయం నుంచే వైన్ షాప్‌ల వద్ద క్యూ కట్టారు. రాత్రికి ఈ రద్దీ మరింత పెరిగింది. బార్‌లు, హోటళ్లు, పబ్‌లు కిటకిటలాడాయి.

32 మెడికల్ కాలేజీలకు బదులు.. 32 యూట్యూబ్ చానళ్లు పెట్టాల్సింది

- ఎన్నికల్లో ఓటమికి కారణం ఫేక్ ప్రచారమే
- నెటిజన్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నా: కేటీఆర్



హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి సంబంధించి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఎక్స్(ట్విటర్)లో ఆదివారం ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంపై 32 యూట్యూబ్ చానళ్ల ద్వారా చేసిన తప్పుడు ప్రచారం వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందన్న నెటిజన్ అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి నెట్టింట చాలామంది ఫీడ్‌బ్యాక్‌లు, పరిశీలనలు పంపుతున్నారని, అందులో ఓ నెటిజన్ పంపిన విశ్లేషణతో తాను ఏకీభవిస్తున్నానని పేర్కొన్నారు. "కేసీఆర్ ప్రభుత్వం 32 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసే బదులు.. ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు 32 యూట్యూబ్ చానళ్లు పెట్టాల్సింది" అంటూ తనకు వచ్చిన ఒక అబ్జర్వేషన్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ షేర్ చేశారు.

కోడ్ వస్తే హామీల అమలు ఎలా?

- ప్రజల్లో ఎన్నో అనుమానాలున్నాయి
- పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టి జీవోలిస్తేనే ఆరు గ్యారెంటీల అమలు సాధ్యం
- మీడియాతో చిట్‌చాట్‌లో హరీశ్



హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 6 గ్యారెంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్.. ఆ దిశగా వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఫిబ్రవరి మూడోవారంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నందున 50 రోజుల్లో ఆయా పథకాలను అమల్లోకి తెస్తారా? ఎగవేస్తారా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఎన్నికల్లోగా కాంగ్రెస్ గ్యారెంటీలకు మార్గదర్శకాలిచ్చి జీవోలు విడుదల చేయాలని, పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితేనే గ్యారంటీలు సరిగ్గా అమలవుతాయని.. లేకుంటే అన్నింటికీ కోతలు తప్పవన్నారు. ఆదివారం బీఆర్ఎస్ఎల్పీలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కోడ్ అమల్లోకి వచ్చేలోపు విధానపరమైన నిర్ణయాలు తీసుకొని 6 గ్యారెంటీల్లోని 12 పథకాల అమలుకు జీవోలు జారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొంటామన్నారని, యాసంగి వడ్లనైనా బోనస్‌తో కొనాలని డిమాండ్ చేశారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే నిర్ణయం తీసుకొని బడ్జెట్‌ను ప్రకటించాలని, లేకుంటే యాసంగిలో రైతులు నష్టపోతారన్నారు. డిసెంబరు9 నాడే రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఆసరా పెన్షన్ల పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలుకాలేదని ప్రజలు ఆందోళనలో ఉన్నారన్నారు. గ్యారంటీలపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిందేనన్నారు. అసెంబ్లీలో శ్వేత పత్రాలు ఇచ్చిన వారికి రైతుబంధు డబ్బులపై ప్రతి రోజూ సమాచారం ఇచ్చేందుకు ఇబ్బంది ఏంటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతోందన్న ఆయన అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే తమ ఎమ్మెల్యేలపై వివక్ష మొదలైందని చెప్పారు. నర్సాపూర్, జనగాం, హుజూరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రభుత్వ కార్యక్రమాల్లో అవమానం జరిగిందన్నారు. ఆరోగ్యశ్రీ మొత్తాన్ని రూ.10లక్షలకు పెంచామన్న ప్రభుత్వం ఇప్పటివరకు ఎంతమందికి వర్తింపజేసిందో వెల్లడించాలని డిమాండ్‌చేశారు. బుల్లెట్ ప్రూఫ్ కోసం వాహనాలను సిద్ధం చేసేందుకు ఎవరైనా విజయవాడకు పంపాల్సిందేనని, అయితే వాహనాలను అక్కడ దాచిపెట్టారని సీఎం స్థాయి వ్యక్తి మాట్లాడటం సరికాదని అన్నారు.

చలిగాలులు.. పొగమంచు!

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలిగాలులు.. పొగమంచు వణికిస్తున్నాయి. రెండు, మూడ్రోజులుగా 10 డిగ్రీలపైనే రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నప్పటికీ చలి తీవ్రతలో ఏమాత్రం తేడా కనిపించట్లేదు. అర్ధరాత్రి దాటాక కమ్ముకుంటున్న పొగమంచు తెల్లారి 8 గంటలైనా వీడటం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో హయత్‌నగర్‌లో 13.7 డిగ్రీలుగా నమోదైంది. రాష్ట్రంలో వచ్చే మూడ్రోజుల పాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14-17 డిగ్రీల మధ్య నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళ, బుధవారాల నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పేర్కొంది. 15-17 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశముందని వెల్లడించింది. మరోవైపు కొన్ని జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.

టీజీవోసీఏ ఎన్నిక చట్టవిరుద్ధం

వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత టీజీవోసీఏ కార్యవర్గం ఎన్నికల ప్రక్రియను నిర్వహించటం నిబంధనలకు విరుద్ధమని టీజీవోసీఏ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, బి.శ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ఓటరు జాబితా తయారుచేయకుండా, కొందరు రిటైర్డ్ అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించి చేసుకుంటున్న ప్రక్రియ చెల్లదన్నారు. అసోసియేషన్ భవనం లీజును రద్దు చేయాలని మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ప్రజాపాలన ముగిసిన తర్వాత రాష్ట్ర కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు.

ప్లీజ్.. ఏపీకి రావొద్దు చెల్లీ!

- షర్మిలకు జగన్ రాయబారం?
- బాబాయ్ సుబ్బారెడ్డితో పురమాయింపు
- బుజ్జగించేందుకు వైవీ ప్రయత్నం
- కుదరదు పొమ్మన్న షర్మిల





(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సోదరి వైఎస్ షర్మిల ఏపీ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోతున్నారన్న వార్తతో 'తాడేపల్లి' తల్లడిల్లుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో షర్మిల అడుగుపెడితే జగన్‌కు రెక్కలు ఊడినట్లేనని బెంబేలెత్తుతోంది. 'జగనన్న బాణం' తాడేపల్లి తలుపులు బద్దలు కొట్టుకొని తనపైకే దూసుకొస్తుండటంతో జగన్‌లో తీవ్ర కలవరం మొదలైంది. సోదరి షర్మిల ఏపీ వైపు రాకుండా నచ్చచెప్పడానికి జగన్ రాయబారం పంపినట్టు తెలుస్తోంది. వైసీపీ సీనియర్ నేత, బాబాయ్ అయిన వైవీ సుబ్బారెడ్డిని రంగంలోకి దించినట్టు సమాచారం. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... ఏపీలో జగన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే అది కుటుంబంలో చిచ్చు పెట్టినట్లవుతుందని, అది ఎవరికీ మంచిది కాదని షర్మిలకు సుబ్బారెడ్డి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు.



కానీ, ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడినట్లు తెలిసింది. "ఇన్నాళ్లూ మేం రోడ్డున పడితే ఎవరు పట్టించుకున్నారు? నాకు అన్యాయం జరిగిందని నెత్తి, నోరు బాదుకుంటే ఆ రోజు మీరెందుకు రాయబారం నడపలేదు? నేను రోడ్డున పడితే మీకు సరదాగా ఉందా? నేను కష్టాల్లో ఉన్నప్పుడు నా ముఖం చూడలేదు కానీ.. ఏపీకి వస్తానంటే రాయబారానికి వచ్చారా? ఏనాడైనా నా తరఫున మాట్లాడారా? నాకు ఊరట కలిగించేలా చేశారా? నేను ఎంతో మానసిక క్షోభ అనుభవించాను. అప్పుడెప్పుడూ లేనిది, ఇప్పుడు జగన్‌కు ఇబ్బంది అవుతుందని నా దగ్గరకు వచ్చారు. ఇదేమి న్యాయం? కుదరదులే. నా ఆలోచనలు నాకున్నాయి. నా మానాన నన్ను బతకనివ్వండి" అని ముఖం మీదే షర్మిల కుండబద్దలు కొట్టినట్లు తెలిసింది. అసలు ఈ పరిస్థితుల్లో వచ్చి ఉండకూడదని, తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆమె మండిపడినట్లు సమాచారం. 'అదేంటమ్మా.. మనమంతా ఒకే కుటుంబం కదా'.. అని సుబ్బారెడ్డి బుజ్జగించే ప్రయత్నం చేయగా... 'నన్ను రోడ్డు మీద వదిలేసినప్పుడు కుటుంబంలో నేనూ ఒకరిని అన్న విషయం గుర్తుకులేదా?' అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

గతంలో అంతా తానై..

జగన్ జైలులో ఉన్నప్పుడు, గత ఎన్నికల సమయంలోను ఆయన తరఫున సోదరి షర్మిల విస్తృతంగా ప్రచారం చేశారు. 'జగనన్న వదిలిన బాణాన్ని' అని సగర్వంగా చెప్పుకొన్నారు. షర్మిలను ఇన్నాళ్లూ నిర్లక్ష్యం చేసి దూరదూరంగా పెట్టి, అనేక రకాల వేధింపులకు గురి చేసిన జగన్ ఇప్పుడు తన బంధువర్గాన్ని ఆమెపై పురమాయిస్తున్నారు. ఇప్పటికే జగన్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడటం.. పార్టీలో రోజురోజుకూ ధిక్కార స్వరాలు పెరుగుతుండటం.. దీనికితోడు షర్మిల ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు చేపడుతున్నారని వార్తలు రావడంతో తాడేపల్లి శిబిరం మరింత ఆందోళన చెందుతోంది. వైసీపీ ప్రేరేపిత సోషల్ మీడియా ఇప్పటికే షర్మిలపై విమర్శలు గుప్పించడం మొదలుపెట్టింది. ట్విటర్, ఫేస్‌బుక్ ఖాతాల ద్వారా షర్మిల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా పోస్టులు పెడుతున్నారు.

పానగల్లులో 800 ఏళ్ల నాటి కళాఖండాల గుర్తింపు

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 31: నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్లులో 800 సంవత్సరాల నాటి కళాఖండాలను పురావస్తు పరిశోధకులు గుర్తించారు. పానగల్లులోని శ్రీ పచ్చల, ఛాయాసోమేశ్వర, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల పరిసరాల్లో ఉన్న ఆ కళాఖండాలను పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడి పురాతన కళాఖండాలు శిథిలావస్థకు చేరకుంటున్నాయని, వాటిని భద్రత పరచాలని, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కళాఖండాలను పునరుద్ధరించాలని, పురాతన శిల్ప సంపదనను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పానగల్లును కాకతీయుల సామంతులైన కందూరు చోళుల రాజులు పరిపాలించిన కాలంలో ఈ దేవాలయాలను నిర్మించారని, కళాఖండాలు, నిర్మాణాలు నాటి శిల్పుల నైపుణ్యానికి అద్దంపడుతున్నాయని నాగిరెడ్డి వివరించారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో కాకతీయుల నాటి మండపస్తంభాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివ నాగిరెడ్డి

ఇద్దరు ఐపీఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇద్దరు మహిళా ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో నల్లగొండ ఎస్పీగా కొనసాగుతున్న అపూర్వారావును ఉమన్ ప్రొటెక్షన్ సెల్ సీఐడీ విభాగానికి ఎస్పీగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో వేకెన్సీ రిజర్వులో ఉన్న చందనా దీప్తిని నల్లగొండ ఎస్పీగా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.



తిరుమలలో నేటితో ముగియనున్న వైకుంఠ ద్వార దర్శనాలు

- రేపటి నుంచి ఎస్ఎస్‌డీ టోకెన్లు జారీ

తిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారంతో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియనున్నాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబరు 23వ తేదీ వేకువజామున శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలను తెరిచి దర్శనాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని పాటిస్తూ పదిరోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం అమలు చేస్తున్నారు. ఈక్రమంలో వైకుంఠ ద్వారాన్ని జనవరి ఒకటో తేదీ అర్ధరాత్రి మూసివేయనున్నారు. రెండో తేదీ నుంచి యథావిధిగా తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీని ప్రారంభించనున్నారు. కాగా, తిరుమలలో జనవరి ఒకటో తేదీ సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. శని, ఆది, సోమవారాలు వరుస సెలవులు రావడంతో శనివారం సాయంత్రం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. వైకుంఠద్వార దర్శనాలు కూడా సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో తిరుమల క్షేత్రం యాత్రికులతో కిటకిటలాడుతోంది. ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా శ్రీవారిని దర్శించుకునేందుకు పలువురు వీఐపీలు టీటీడీకి లేఖలు అందజేశారు.





Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.